Dwaraka



మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..



HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 36 • పేజీలు:12+16 • వెల: రూ.5 శనివారం • 6-1-2018 www.manamnews.com /manamnews



హెచ్‌సీఏ కార్యదర్శిపై వేటు

శేష్ నారాయణను తొలగించిన అపెక్స్ కౌన్సిల్

కేసు పెండింగ్‌లో ఉన్నందున: వివేకానంద

కౌన్సిల్‌కు ఆ అధికారం లేదు: నారాయణ

కార్యవర్గం ఎన్నికైన ఏడాదికే ఉద్వాసన

సంఘంలో తీవ్రమైన అంతర్గత కుమ్ములాటలు

12లో..

అమెరికాకే కష్టం!

హెచ్-1బీ విధానంలో మార్పులొద్దు

భారత నిపుణులు వెనక్కి వెళ్తే నష్టం

కొత్త విధానంపై కాంగ్రెస్ వ్యతిరేకత

7లో..



పంట కొంటం



ఇదే ఇప్పుడు మా ముందున్న లక్ష్యం

నిరాశా నిస్పృహల్లో రైతులు.. సర్కారు సపోర్టు జేస్తది

ప్రభుత్వ చర్యలతో కొంత మార్పు

వరి.. మక్కలకు కనీస మద్దతు ధర

పత్తిలాంటి వాటికే కొంత అనిశ్చితి

నిధులు దండి.. మనమే పంట కొనాలె

ఇతర రాష్ట్రాల్లో అధ్యయనానికి వెళ్లాలి

కేంద్రం మరింత ఔదార్యం చూపాలి

ఈ ఏడాది నుంచే పెట్టుబడి మద్దతు

వ్యవసాయంపై సమీక్షలో సీఎం కేసీఆర్

హైదరాబాద్, జనవరి 5 (మనం ప్రతినిధి):

''రాష్ట్ర జనాభాలో 70 శాతం వ్యవసాయం మీదే ఆధారపడి బతుకుతున్నరు. ఆర్థికవేత్తలు ఏమి చెప్పినా ఎక్కువ మంది ఆధారపడిన ప్రధాన రంగం వ్యవసాయమే. అయితే, వ్యవసాయదారులు మాత్రం తీవ్ర నిరాశా నిస్పృహల్లో ఉన్నరు. తమనెవరూ పట్టించుకోరనే భావనలో ఉన్నరు. తమ కర్మ ఇంతే అనే బాధలో వారున్నరు. అలాంటి రైతుల్లో ధైర్యం నింపాల్సిన అవసరం ఉంది. అవసరమైన చేయూత అందించి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది'' అని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. శుక్రవారం వ్యవసాయ రంగంపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు పండించిన పంటకు మంచి మిగతా 6లో..



ప్రభుత్వం.. చిత్తశుద్ధితో ఉంది

ఈ అంశంపై ఎవరికీ సందేహం అక్కర్లేదు

ఎస్సీ వర్గీకరణపై నోముల నర్సింహయ్య

హైదరాబాద్, జనవరి 5 (మనం ప్రతినిధి):

ఎస్సీ వర్గీకరణపై తెలంగాణ ప్రభుత్వ పనితీరునుగానీ, చిత్తశుద్ధిని గానీ ఎవరూ శంకించాల్సిన పనిలేదని మాజీ ఎమ్మెల్యే, నాగార్జున సాగర్ నియోజకవర్గ టీఆర్ఎస్ ఇన్‌చార్జి నోముల నర్సింహయ్య అన్నారు. శుక్రవారం టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వర్గీకరణపై సీఎం మిగతా 6లో..

ఇదీలోకం!



మీ వయసు.. ఆరోగ్యం.. దృష్టిలో ఉంచుకొనే.. శిక్ష పడనీయకుండా ఒకరోజు వాయిదా వేయించాను సార్..!

దివ్యాంగులకు ప్రత్యేక ఐటీ పార్కు

దేశంలోనే తొలిసారి తెలంగాణలో ప్రారంభం

దివ్యాంగులకు పెద్ద సంఖ్యలో ఉపాధి

లక్ష బెడ్‌రూం ఇళ్లలోనూ 3 శాతం వారికే

అన్ని మున్సిపాలిటీల్లోనూ పార్కులు: మంత్రి కేటీఆర్





హైదరాబాద్ సిటీ, జనవరి 5(మనం న్యూస్):

రాష్ట్రంలో దివ్యాంగులకు ప్రత్యేకంగా ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రత్యేక ఐటీ పార్కును ఏర్పాటు చేస్తున్నట్టు మిగతా 6లో..



గవర్నర్ X కాంగ్రెస్

మీరు సరిగ్గా పనిచేయట్లేదు.. టీఆర్ఎస్ నేతలా ఉంటున్నారు

సోనియా దయతోనే గవర్నర్‌గిరీ

గవర్నర్‌తో టీపీసీసీ నేతల వాగ్వాదం

నరసింహన్ తీవ్ర ఆగ్రహం

కాంగ్రెస్ నేతలకు అక్షింతలు

ఇసుక మాఫియాకు అధికార దన్ను

పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి

హైదరాబాద్, జనవరి 5 (మనం ప్రతినిధి):

ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గవర్నర్ నరసింహన్‌ను టీపీసీసీ నేతలు శుక్రవారం కలిసిన సందర్భంగా వారి మధ్య తీవ్రవాగ్వాదం చోటు చేసుకున్నట్లు తెలిసింది. ''మీరు గవర్నర్‌లా వ్యవహరించటం లేదు. టీఆర్ఎస్ నేతలా వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో ఏం జరుగుతుందో పట్టించుకోవట్లేదు'' అని టీపీసీసీ నేతలు పేర్కొన్నారు. దాంతో గవర్నర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కొత్త ఏడాదిలో మిగతా 6లో..

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం చల్లగానే కొనసాగుతుంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు తక్కువుంటాయి. శనివారం పొడి వాతావరణం ఉండే అవకాశముంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 29 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 14 డిగ్రీలు

గాలిలో తేమ: 45 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: పంచమి సా.5.10 తదుపరి షష్ఠి; నక్షత్రం: పుబ్బ రా.1.18 తదుపరి ఉత్తర; వర్జ్యం: ఉ.9.55-11.28, రా.1.42-3.17; దుర్ముహూర్తం: ఉ.6.52-8.20; రాహుకాలం: ఉ.9.37-10.59; అమృతఘడియలు: సా.7.11-8.44; శుభసమయం: ఉ.11.00-1.00, సా.5.00-6.00;

సూర్యోదయం: 6.52,

సూర్యాస్తమయం: 5.52

1న కేంద్ర బడ్జెట్!

ఈ నెల 29 నుంచి తొలిదశ పార్లమెంట్ సమావేశాలు

ఫిబ్రవరి 9 నుంచి విరామం.. మార్చి 5న మలిదశ

మొదటిరోజు సంయుక్త భేటీలో రాష్ట్రపతి ప్రసంగం

మంత్రి మండలి సభా వ్యవహారాల కమిటీ సిఫారసు

న్యూఢిల్లీ, జనవరి 5:

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈ నెల 29 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు మిగతా 6లో..

పాక్ తోక కట్!

రూ.7290 కోట్ల సాయం నిలిపివేత

ఉగ్రవాద సంస్థలకు ఊతమే కారణం

డొనాల్డ్ ట్రంప్ సర్కారు కఠిన నిర్ణయం

ఉగ్రవాదులకు స్వర్గధామమని వ్యాఖ్యలు

తాలిబన్లు.. హక్కానీలపై చర్య తప్పనిసరి

అలా చేసినప్పడే సాయం పునరుద్ధరణ



వాషింగ్టన్, జనవరి 5:

ఉగ్రవాద సంస్థలకు ఊతం ఇస్తున్న పాకిస్థాన్‌కు.. అగ్రరాజ్యం అమెరికా తోక కత్తిరించింది. తన గడ్డపై నుంచి కార్యకలాపాలు మిగతా 6లో..



గజల్ శ్రీనివాస్‌కు బెయిల్ నిరాకరణ

సీడీని ఎఫ్ఎస్ఎల్‌కు ఎలా పంపుతారు

పోలీసుల తీరుపై నాంపల్లి కోర్టు ఆగ్రహం

'పార్వతి పరంలో'పైనా.. జడ్జి సీరియస్

6లో..

అటవీశాఖ ఆధీనంలోని పులిచర్మం మాయం

- ఆలస్యంగా వెలుగులోకొచ్చిన వైనం
- విచారణ చేపడుతున్న అధికారులు



కాగజ్‌నగర్, జనవరి 5 (మనం న్యూస్): అటవీశాఖ పోలీసుల ఆధీనంలో ఉన్న ఓ పుల్లి చర్మం మాయమైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుమ్రంభీం జిల్లా బెజ్జూర్ మండలం ఎటిగూడ గ్రామ సమీపంలో 2016 నవంబరులో ఇద్దరు స్మగ్లర్లను పట్టుకున్న అటవీశాఖ అధికారులు వారి నుంచి పులి చర్మాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన అప్పట్లో రాష్ట్రమంతా సంచలనం సృష్టించింది. ఈకేసుకు సంబంధించి మొత్తం 19 మందిపై కేసులు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న పులి చర్మాన్ని సల్గుపెల్లి సెక్షన్ అధికారి వేణుగోపాల్ కస్టడీలో ఉంచారు. నెల రోజుల క్రితం వేణుగోపాల్ సస్పెండ్ కావడంతో మరో సెక్షన్ అధికారి శ్రావణ్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో సెక్షన్‌కు సంబంధించిన వాటిని అప్పగించిన వేణుగోపాల్ పులిచర్మాన్ని అప్పగించలేదు. పులిచర్మం ఎక్కడ ఉందని ప్రశ్నించగా ఓ బీట్ అధికారి చెందిన గదిలో ఉంచానని చెప్పాడు. అయితే అక్కడకు వెళ్లిన అధికారులు పులిచర్మం మాయమైనట్లు గుర్తించారు. దీంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై ఎఫ్ఆర్‌వో రామోహన్‌ను వివరణ అడుగగా విచారణ చేపడుతున్నట్లు చెప్పారు.

పెదకర్మ చేస్తానన్న చిన్నకొడుకు

- ఆస్తికోసం ఆరళ్లు.. కలెక్టరుకు ఫిర్యాదు
- ఆదుకోండి దొరా.. ఓ తండ్రి ఆర్తనాదం

సిద్దిపేట టౌన్, జనవరి 5 (మనం న్యూస్): పున్నామ నరకం తప్పిస్తారని ఆశించిన ఇద్దరు పుత్రులు కన్నతండ్రిని ఆస్తికోసం ఆరళ్లు పెడుతూ భూలోక నరకం చూపుతున్న ఉదంతమిది. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం సిరిసినగండ్ల గ్రామవాసి నందాల లక్ష్మీనర్సయ్య (70) గోడు ఇది. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో తన గోస వినిపించుకునేందుకుగాను ఆయన 'మనం' ప్రతినిధిని సంప్రదించాడు. ఈ సందర్భంగా ఆయన తెలిపిన వివరాల ప్రకారం... లక్ష్మీనర్సయ్య 15 ఏళ్లకిందట హైదరాబాద్ వలసవచ్చాడు. తెల్లవారింది మొదలు పొద్దుగుంకేదాకా కాయకష్టం చేసి తినీతినకా కష్టార్జితాన్ని కాస్తోకూస్తో కూడబెట్టాడు. అలా పోగుచేసుకున్న సొమ్ముతో స్వగ్రామంలో కొంత భూమి కొన్నాడు. అయితే, ఆ భూమిలో వాటా కోసం చిన్నకొడుకు శ్రీనివాస్ ఇప్పుడు ఆయనను బెదిరిస్తున్నాడు. కాదూకూడదని బుద్ధిచెప్పబోతే దాడిచేయడానికీ వెనుకాడటం లేదు. పైగా 'బతికుండగానే పెదకర్మచేసి, గ్రామస్థులందరి ముందే నీకు పిండం పెడతా'నంటూ బెదిరిస్తున్నాడు. దీనిపై లక్ష్మీనర్సయ్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి, ఆదుకోమంటూ ఆర్తనాదం చేశాడు.



పెద్దకుమారుడికి ఇంతకుముందే పెళ్లిచేసినా, అతని వైఖరితో విసిగిపోయి భార్య వదిలేసి వెళ్ళిపోయింది. ఆమెకు భరణం కోసం తండ్రి కష్టార్జితమైన భూమిలో రెండెకరాలు తెగనమ్మాల్సి వచ్చింది. ఇప్పుడు మిగిలిన భూమిలో వాటా కావాలంటూ చిన్నకొడుకు తనపాలిట యముడిలా వెంటబడ్డాడని ఆయన వాపోయాడు.

24 గంటల విద్యుత్‌తో లాభమా.. నష్టమా..?



రైతుల సంక్షేమం కోసం అంటూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరాను ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. రాత్రిళ్లు పొలాల దగ్గర కాపు కాసే పని తప్పిందంటూ ఓ పక్క రైతులు హర్షం వ్యక్తం చేస్తోంటే, పథకంపై ప్రతిపక్షాలు పలు విమర్శలు చేస్తున్నాయి. అసలు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా వల్ల లాభమా.. నష్టమా..?

- ఆటోస్టార్టర్స్ తొలగించకపోతే నష్టమే
- భూగర్భజలాలపై ప్రభావం ఉండొచ్చు: నిపుణులు

హైదరాబాద్, జనవరి 5 (మనం ప్రతినిధి): వ్యవసాయానికి 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. కొత్త ఏడాది తొలి రోజు నుంచే పథకాన్ని అమలులోకి తెచ్చింది. అయితే వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇవ్వడం వల్ల భూగర్భ జలాలు అడుగంటుకుపోయే ప్రమాదం ఉందని, రైతులకు మేలు కన్నా కీడే ఎక్కువ జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏ రైతు కూడా వ్యవసాయ అవసరాలకు 24 గంటల విద్యుత్‌ను ఇవ్వమని కోరుకో లేదు. ఇచ్చే 9 గంటలు పాటు సరఫరా సక్రమంగా ఉంటే చాలు అని కోరుకుంటాడని అంటున్నారు.

కానరాని అవగాహన సదస్సులు

ఆటోస్టార్టర్ల తొలగింపుకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా ఇప్పటివరకు ఎలాంటి ప్రయత్నాలు కనిపించలేదు.విద్యుత్, వ్యవసాయ శాఖ అధికారులు, మండల స్థాయి అధికార యంత్రాంగంతో కలిసి ఆటోస్టార్టర్ల తొలగింపునకు రైతుల్లో అవగాహన తీసుకురావాలి. మంత్రులు, ఎమ్మెల్యే లతో పాటు ఇతర ప్రజాప్రతి నిధులు కూడా గ్రామాల్లో పర్యటించి, రైతులకు ఈ విషయంపై అవగాహన కల్పించాలి. ఇప్పటికే సగానికి సగం రైతులు నాట్లు కూడా వేశారు. ఇప్పటికి ఆటో స్టార్టర్లు కొనసాగుతూనే ఉన్నాయని రైతులే పేర్కొంటున్నారు.

ఆటోస్టార్టర్లపై దృష్టి పెట్టారా..

గతంలో విద్యుత్ సరఫరా ఎప్పుడు ఉంటుందో తెలియక రైతులు తమ వ్యవసాయ మోటార్లకు ఆటోస్టార్టర్లను అమర్చారు. సరఫరా రాగానే మోటారు ఆటోమెటిక్‌గా ఆన్ అవుతుంది. రైతుల సాగు అవసరాలకు నీరు ఉండేది. ప్రస్తుతం ఈ ఆటోస్టార్టర్లను తొలగించకపోతే రైతుకు లాభం కంటే నష్టమే ఎక్కువగా జరుగుతుంది. ఆటోస్టార్టర్ల తొలగింపుపై విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే భూగర్భ జలాలు అడుగంటుకుపోయే ప్రమాదం ఉంది. ఎక్కువ లోతున్న బోర్ల వల్ల తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని సన్నకారు రైతులు చెబుతున్నారు. గతంలో ఇదే అంశంపై పలుమార్లు సీఎం కేసీఆర్ కూడా విద్యుత్ అధికారులతో చర్చించారు. ఆ సమయంలో కొన్ని ముఖ్య విషయాలను విద్యుత్ అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లలేదని సమాచారం.

ప్రతిపక్షాల ఆరోపణలు

24 గంటల విద్యుత్ సరఫరాపై ప్రతిపక్షాలు పలు ఆరోపణలు చేస్తున్నాయి. ఈ పథకం దేశ వ్యాప్తంగా 19 రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అమలవుతుం దన్నారు. 24 గంటల కరెంట్ వల్ల తెలంగాణ రైతాంగానికి ఎలాంటి లాభం లేదంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 55 లక్షల 54 వేల మంది రైతులుండగా.. వీరిలో 90 శాతం మంది ఎకరా నుంచి ఐదు ఎకరాలలోపు భూమి ఉన్నవారే. ప్రైవేట్ కంపెనీల నుంచి వేల కోట్ల ముడు పులు తీసుకోవడం కోసమే కేసీఆర్ ఈ పథకం ప్రారం భించారని ఆరోపిస్తున్నాయి. తెలంగాణలోని విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి తగ్గించి, ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనడం ఎంతవరకు సమంజమాన్నారు. రూ.3.50కి యూనిట్ విద్యుత్ దొరుకుతుంటే.. రూ.5.50 కొనడంలో ఆంతర్యమేంటో చెప్పాలని అంటున్నారు.

కేసీఆర్ నమ్మకం ఫలిస్తుందా

చెరువులో ఉన్న నీటిని పొదుపుగా వాడుకుంటూ వ్యవసాయం చేసుకునే అలవాటు మన రైతులది. భూగర్భ జలాలను కూడా అవసరం ఉన్న మేరకే పొదు పుగా వాడుకుంటారని, రైతులపై నాకు నమ్మకం ఉంద ని సీఎం కేసీఆర్ విద్యుత్ ఉన్నతాధికారులతో జరిగిన ఓ సమావేశంలోనే అన్నారు. గతంలో కరెంట్‌పై నమ్మ కం లేని రైతులు ఆటోస్టార్టర్లు తొలగిస్తారని నమ్మకం వెలిబుచ్చారు. అవసరానికి మించి రైతులు నీటి వాడ కం చేయరని గట్టి నమ్మకంతో రైతులకు 24 గంటల ఉచిత నిరంతర విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు.

పార్లమెంట్‌కు వర్గీకరణ బిల్లు పంపాలి

- బీజేపీ ఆఫీసును ముట్టడించిన విద్యార్థి సంఘాలు

హైదరాబాద్, జనవరి 5 (మనం న్యూస్): ఎస్సీ వర్గీకరణ బిల్లుకు పార్లమెంటులో చట్టబద్దత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఓయూ విద్యార్థి సంఘాలు బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించాయి. 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామన్న బీజేపీ 1500 రోజులైనా బిల్లును పట్టించుకోవడం లేదంటూ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్తి మెజార్టీ ఉన్న, అన్ని పార్టీలు మద్దతు ఇస్తామని చెప్పిన పార్లమెంట్లో ఎందుకు చట్టసవరణ చేయట్లేదో చెప్పాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. వర్గీకరణ చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న బీజేపీ మా సామాజిక వర్గానికి ప్రధాన శత్రువని అన్నారు. ఇప్పటికైనా బీజేపీ ప్రభుత్వం స్పందించకపోతే రాబోవు రోజుల్లో ప్రధాని, అమిత్‌షాలతో సహా కేంద్ర మంత్రులు



రాష్ట్రంలో ఎక్కడ పర్యటించిన అడ్డుకుంటుమంటున్నారు. బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించడానికి వచ్చిన విద్యార్థులకు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. ఆగ్రహించిన పోలీసులు విద్యార్థులను అరెస్టు చేసి, పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్ఎస్ఎఫ్ ఓయూ ఇంచార్జి పల్లెర్ల సుధాకర్, ఏఐఎస్ఎఫ్ ఓయూ సెక్రటరీ కాంపల్లి శ్రీనివాస్, విద్యార్థి సంఘ నాయకులతో పాటు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైకోర్టుకు సంక్రాంతి సెలవులు

హైదరాబాద్, జనవరి 5 (మనం లీగల్ ప్రతినిధి): ఈ నెల 8 నుంచి 17 వరకు హైకోర్టుకు సంక్రాంతి పండుగ సెలవులను ప్రకటించారు. అత్యవసర కేసుల్ని ఈ నెల 11న విచారణకు న్యాయమూర్తులు ఎస్వీ భట్, దుర్గాప్రసాదరావులతో కూడిన డివిజన్ బెంచ్, న్యాయమూర్తి రామలింగేశ్వరరావు ఏకసభ్య కోర్టులు పనిచేస్తాయి.

అయుత ధర్మదీక్షకు అనుమతివ్వండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జనవరి 5 (మనం లీగల్ ప్రతినిధి): సీఎం కేసీఆర్ సొంత నియోజకవర్గం గజ్వేల్‌లో ఈ నెల 7న నిర్వహించనున్న అయుత ధర్మ దీక్షకు అనుమతించాలని పోలీసులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి ఎస్వీ భట్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. తొలుత అనుమతి ఇచ్చి తర్వాత రద్దు చేయడాన్ని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ సవాల్ చేస్తూ హైకోర్టులో రిట్ దాఖలు చేశారు. పాత పెన్షన్ విధానాన్నే తిరిగి తేవాలన్నదే తమ డిమాండ్ అని, దీనికి ఎందుకు అనుమతి ఇవ్వలేదో అర్థం కావడం లేదని పిటిషనర్ వాదించారు. సాయంత్రం 5 గంటల్లోగా సభ పూర్తి చేసేలా అనుమతి ఇవ్వాలని న్యాయమూర్తి పోలీసులను ఆదేశించారు.

చెన్నమనేని రమేశ్‌కు ఊరట

- పౌరసత్వం రద్దుపై హైకోర్టు స్టే

హైదరాబాద్, జనవరి 5 (మనం ప్రతినిధి): పౌరసత్వం వివాదంలో టీఆర్ఎస్ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌కు స్వల్ప ఊరట లభించింది. ఆయన పౌరసత్వం చెల్లదంటూ కేంద్ర హోంశాఖ వెలువరించిన ఆదేశాలపై హైకోర్టు శుక్రవారం స్టే విధించింది. కేంద్ర ఉత్తర్వులపై ఆరువారాలపాటు నిలిపివేసింది. ఈ అంశంపై మళ్లీ వాదనలు వింటామని స్పష్టం చేసింది చెన్నమనేని రమేశ్ భారత పౌరసత్వాన్ని గతేడాది డిసెంబర్ నెలలో కేంద్రం రద్దు చేసిన విషయం విదితమే. పౌరసత్వం రద్దుపై గత ఆగస్టు 31న హోంశాఖ తీర్పునిచ్చినా డిసెంబర్ నెలలో రమేశ్ రివ్యూ పిటిషన్ దాఖలు చేశారు.దీనిని కేంద్ర హోంశాఖ కొట్టివేసింది. సంవత్సరం పాటు వరుసగా దేశంలో ఉండాలనే నిబంధనను రమేశ్ పాటించలేదని తమవిచారణలో తేలిందని, అందుకని ఆయన పౌరసత్వాన్ని రద్దు చేస్తున్నామని హోంశాఖ వివరించింది. అయితే కేంద్ర హోంశాఖ ఇచ్చిన తీర్పు లోపభూయిష్టంగా, ఏకపక్షంగా ఉన్నదని రమేశ్ అ సమయంలో వ్యాఖ్యానించారు. కేంద్రం ఆదేశాలపై హైకోర్టులో సవాలు చేయగా.. స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.



మావోయిస్టు కమాండర్ అరెస్టు

- మరో ఇద్దరు మిలీషియా సభ్యులు కూడా..

ఏటూరునాగారం, జనవరి 5 (మనం న్యూస్): మావోయిస్టు పార్టీ ప్లాటూన్ దళ కమాండర్, ఇద్దరు మిలీసియా సభ్యులను వరంగల్ పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక ఏఎస్పీ రాహుల్ హేగ్డే తెలిపిన వివరాలు ఇలా.. బెటాలియయన్ సిబ్బంది వెంకటాపురం పరిసర ప్రాంతాలలో వాహనాలు తనికీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అనుమానించి అదుపులోకి తీసుకున్నారు. విచారించగా వారు ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాకు చెందిన మడివి పాండే అలియాస్ సుశీల, అలియాస్ లక్ష్మీ, మిలీషియా సభ్యుడు రమేశ్, నందినీలుగా గుర్తించారు.

వేరుశనగకు మద్దతివ్వండి

- వనపర్తిలో రోడ్డెక్కిన రైతన్నలు
- మద్దతు తెలిపిన కాంగ్రెస్, సీపీఎం
- 5గంటల పాటు స్తంభించిన రాకపోకలు

వనపర్తి, జనవరి 5(మనం ప్రతినిధి): వనపర్తి జిల్లా కేంద్రంలోని వేరుశనగకు మద్దతు ధర ఇవ్వడం లేదని మార్కెట్ యార్డు ప్రధాన రహదారిపై రైతులు శుక్రవారం రోడ్డెక్కి 5గంటల పాటు రాస్తారోకో చేశారు. స్వచ్ఛందంగా ధర్నా చేస్తున్న రైతులకు స్థానిక శాసన సభ్యులు డాక్టర్ జి.చిన్నారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి యం.డి జబ్బార్ పాల్గొని మద్దతు తెలిపారు. కేసీఆర్ డౌన్ డౌన్, డీఎంఓ రైతుల దగ్గరకు రావాలి, రైతులు పండించిన వేరుశనగకు మద్దతు ధర కల్పించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రాస్తారోకో దగ్గరకు మార్కెట్ అధికారులు రాకపోవడంతో ఐదు గంటల పాటు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. మద్దతు ధర కల్పిస్తేనే ఇక్కడి నుండి వెళ్తామని లేదంటే ఇక్కడే బైఠాయిస్తామని నాయకులు, రైతులు మొండికేశారు. మార్కెట్ సూపర్‌వైజర్ లక్ష్మయ్య వచ్చి రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసిన రైతులు వినలేదు. సంబంధిత అధికారులు వచ్చి సమస్య పరిష్కరించాలని కోరడంతో డీఎంఓకు ఫోన్ చేసిన ఆయన అక్కడికి రాలేదు. చివరకు ఆర్డీవో చంద్రారెడ్డి రైతులు చేపట్టిన ధర్నా దగ్గరకు చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు పండించిన పంటకు గిటుబాటు ధర కల్పించాలని, పండించిన పంట దాచడానికి గోడౌన్ ల వసతి కల్పించాలని, రైతులు మార్కెట్‌లోనే ఉండేందుకు విశ్రాంతి భవనాన్ని ఉపయోగంలోకి తేవాలని, రైతులకు ప్రింటెడ్ బిల్లులు ఇవ్వాలని, రూ.5లకే మార్కెట్‌లో భోజన వసతి కల్పించాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని, రైతుల వద్ద వసూలు చేయవలసిన రూ.1.75పైసాలు కమిషన్ కాకుండా అధనంగా రూ.3.50పైసాలు వసూలు చేస్తున్నారని, నూతనంగా నిర్మాణం చేస్తున్న మార్కెట్‌యార్డును వినియోగంలోకి తేవాలని పలు డిమాండ్లను ఆర్డీఓ దృష్టికి తెచ్చారు. ఈ విషయాలపై సూపర్‌వైజర్ లక్ష్మయ్యతో చర్చించారు. కొన్ని సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని మరికొన్ని సమస్యలు ప్రభుత్వం పరిధిలో ఉన్నాయని చెప్పారు. దీంతో సమస్య మొదటికి వచ్చింది. డీఎంఓ స్వరణ్‌సింగ్ అక్కడికి చేరుకొని సాధ్యసాధ్యాలను రైతులకు వివరించిన ఆ మాటలు నమ్మశక్యంగా లేకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. పోలీసులు రంగప్రవేశం చేసి ఎమ్మెల్యే చిన్నారెడ్డిని ముందస్తుగా అరెస్టు చేయాలని ప్రయత్నించగా ఆయన ఒప్పుకోలేదు. రైతుల సమస్య పరిష్కారం అయ్యే ద్వారా ఇక్కడి నుండి కదిలేది లేదని గట్టిగా పట్టుబట్టారు. ముందస్తు చర్యగా పోలీసులు బలవంతంగా ఎమ్మెల్యేను ఎత్తికెళ్లారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, రైతులు అడ్డుపడడంతో 20 నిమిషాల పాటు ఎం జరుగుతుందో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యేను బలవంతంగా లాక్కెళ్లె ప్రయత్నంలో



చిన్నారెడ్డి నిరసించిపోయారు. దాహం ... దాహం అంటూ అరవడంతో కార్యకర్తలు మంచినీటి తీసుకొచ్చి తాపారు. అరెస్టును విరమించడంతో కొద్ది సేపు చిన్నారెడ్డి సేద తీర్చుకున్నారు. ఆ వెంటనే పోలీసులు అరెస్టు చేసి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆయనతో పాటు సీపీఎం జిల్లా కార్యదర్శి యం.డి జబ్బార్, నాయకులు దేవేందర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కిరణ్‌కుమార్, మరికొంత మందిని బలవంతంగా జీపుల్లో ఎక్కించుకొని స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం సొంత పూచికతుపై వారిని వదిలి పెట్టారు. అధికారులు రైతులకు స్పష్టమైన హామి ఇవ్వకపోవడంతో రైతులు నిరాశ చెందారు. మద్దతు ధర కల్పిస్తేనే వేరుశనగకు అమ్ముకుంటామని లేదంటే మార్కెట్‌లోనే ఉంటామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



రేషన్ 'రీసైక్లింగ్'

- 1080 బస్తాల బియ్యం స్వాధీనం
- ప్రభుత్వానికే మళ్లీ అమ్ముతున్న ముఠా
- తనిఖీల్లో వెలుగులోకి..క్రిమినల్ కేసులు
- బ్లాక్ లిస్టులో రైసు మిల్లులు: సీవీ ఆనంద్

హైదరాబాద్, జనవరి 5 (మనం ప్రతినిధి): కొంతకాలంగా గుట్టు చప్పుడుకాకుండా నడు స్తున్న రేషన్ బియ్యం దొంగలు ఎట్టకేలకు చిక్కారు. నాగర్ కర్నూలు జిల్లాకు చెందిన పలు రైసు మిల్లుల్లో రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి తిరిగి ప్రభుత్వానికే అప్పగించిన వైనం బయటపడింది. దాదాపు 1080 బస్తాలను గుర్తించారు. వీటి విలువ 15 లక్షల వరకు ఉంటుందని పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఇందుకు సంబంధించి నాగర్ కర్నూలు జిల్లాలోని శ్రీనివాస రైస్ మిల్, వెంకటేశ్వరరైస్ మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టినట్లు తెలిపారు. ఎవరికీ ఏమాత్రం అనుమానం రాకుండా పక్కా పకడ్బందీగా పథకం ప్రకారం ఒక్కో లారీ (ఎసికె)లో కొన్ని కొన్ని రీసైక్లింగ్ చేసిన బస్తాలను కలిపివేశారని ఆయన మీడియాకు తెలిపారు. కాగా, ఒక్కో లారీలో 400 నుండి 500 బ్యాగులు ఉంటాయన్నారు. ఈ బ్యాగుల్లో ఎవరికీ అనుమానం రాకుండా ఉండేలా ఎసికె నెం. 131,136,137,149,163,165లలో 1080 బస్తాల రీసైక్లింగ్ చేసిన రేషన్ బియ్యాన్ని కలిపి వేశారన్నారు. ఈ రెండు రైస్ మిల్లుల యజమానులను కమిషనర్ తన కార్యాలయానికి పిలిపించగా హాజరు కాలేదన్నారు. అధికారులు ఈ రెండు రైస్ మిల్లులో కరెంట్ బిల్లుల తనిఖీలు చేయగా ధాన్యం మిల్లింగ్ చేయనట్లుగా వారు గుర్తించినట్లు తెలిపారు. అయితే, ఈ బియ్యం ఎక్కడ నుంచి వచ్చాయనే దానిపై



పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తున్నామని కమిషనర్ తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఈ నెల నుంచి ఈపాస్ విధానం అమల్లోకి రావడంతో రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌కు తరలించడం సాధ్యం కాదన్న ఉద్దేశంతో, అంతకు ముందు రేషన్ డీలర్ల నుండి బియ్యాన్ని కొనుగోలు చేసి, మిల్లర్లు నిల్వ ఉంచారని తెలిపారు. ఆ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి అప్పగించినట్లుగా అధికారులు గుర్తించామన్నారు. కాగా, సిరిసిల్లలో సన్న బియ్యం మార్పిడికి ఆదేశం... సన్న బియ్యం నాణ్యతపై కమిషనర్ ఆదేశాల మేరకు సాంకేతిక సిబ్బంది తనిఖీలు చేపట్టగా సిరిసిల్ల జిల్లాలో నాణ్యత లేని సన్న బియ్యాన్ని అప్పగిస్తున్నారన్న విషయం వెలుగులోకి వచ్చిందని ఆనంద్ తెలిపారు.



మొండి బకాయిల వసూలుకు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐవోబీ) అధికారులు వినూత్న పద్ధతిలో నిరసనకు దిగారు. రుణ వసూళ్ల కోసం టీసీఐ కన్‌స్ట్రక్షన్ కార్యాలయం ఎదుట బ్యాంకు సిబ్బంది 'రుణాలు చెల్లించండి..దేశ పురోగతికి సహకరించండి' అని రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఐవోబీ చీఫ్ రీజనల్ మేనేజర్ శివకుమార్ చతుర్వేది, అసిస్టెంట్ మేనేజర్ అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



దమ్మున్న పత్రిక 'మనం'

- రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్
- జమ్మికుంటలో క్యాలెండర్ ఆవిష్కరణ

జమ్మికుంట(కరీంనగర్), జనవరి 5 (మనం న్యూస్) : ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ.. ప్రజాసమస్యలను పరిష్కరించే విధంగా పని చేస్తోన్న మనం తెలుగు దినపత్రిక దమ్మున్న పత్రిక అని రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో శుక్రవారం మంత్రి ఈటల రాజేందర్ 'మనం' దిన పత్రిక 2018 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనతి కాలంలోనే మనం ప్రజాభిమానాన్ని పొందిందన్నారు. ముక్కుసూటిగా ప్రజాసమస్యలను ఎత్తి చూపుతూ.. అవినీతి అంతమే.. 'మనం' పత్రిక పంథాగా ఎంచుకుని ముందుకు పోతుందన్నారు. రాష్ట్రంలో అనేక పత్రికలు ఉన్నప్పటికీ మనం పత్రికారంగంలో ఓ కొత్త శఖానికి నాంది పలికిందన్నారు. ఏ రాజకీయ పార్టీకి వత్తాసూ పలకకుండా పని చేస్తోన్న పత్రిక మనం అని ఆయన అన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో 'మనం' జమ్మికుంట ప్రతినిధి పెరుమాండ్ల సదానందం గౌడ్, జమ్మికుంట అర్బన్ టీఆర్ఎస్ అధ్యక్షుడు పొనగంటి మల్లయ్య, ఏబూసి శ్రీనివాస్, ఎండి నసిరోద్దీన్. రఘుపతి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నిర్సిని శ్రీనివాస్, ఇల్లందకుంట మనం రిపోర్టర్ జక్కె బాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ 'మనం' చదువుతున్నా..

రాజన్న సిరిసిల్ల కలెక్టర్ కృష్ణ భాస్కర్



మనం పత్రికను క్రమం తప్పకుండా చదువుతానని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్ అన్నారు. శుక్రవారం సిరిసిల్లలో 'మనం' దిన పత్రిక 2018 క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అనతి కాలంలోనే పత్రిక జనాదరణ పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో దశరథం, వేములవాడ ప్రాంతీయ దినపత్రిక ప్రతినిధి ఎండి రఫీఖ్, కోనారావుపేట రిపోర్టర్ శ్రీనివాస్, సిరిసల్ల రిపోర్టర్ సాయి పాల్గొన్నారు.

పీజీ కోర్సుల్లో ప్రవేశానికి 'నీట్' రేపు

హైదరాబాద్, జనవరి 5 (మనంన్యూస్): వైద్య విద్య పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్ (ఎన్‌బీఈ) నిర్వహించే నీట్-2018 పరీక్ష జనవరి 7 ఆదివారం జరగనుంది. దేశ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులు ఎంఎస్, ఎండీ వంటి పీజీ కోర్సుల్లో ప్రవేశం కోసం ఈ పరీక్ష రాస్తారు.అభ్యర్థుల పరీక్ష కేంద్రాలు, హాల్‌టికెట్ వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో ఉంచారు.



న్యాక్ మరింత బలోపేతం

- ఉపాధి ఏజెన్సీగా రూపొందాలి: తుమ్మల

హైదరాబాద్, జనవరి 5: యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే ఏజెన్సీగా న్యాక్ (జాతీయ నిర్మాణ సంస్థ)ను తీర్చిదిద్దాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ సంస్థలను పిలిచి సమన్వాయం బాధ్యతలకే పరిమితం కాకుండా నేరుగా నిరుద్యోగ యువతి, యువకులకూ శిక్షణ తీసుకున్న వారికి దేశ, విదేశాల్లో ఉద్యోగాలు కల్పించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని నిర్దేశించారు. శుక్రవారం సచివాలయంలో మంంత్రి తుమ్మల నేతృత్వంలో న్యాక్ కార్యనిర్వాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. న్యాక్ లో శిక్షణ తీసుకున్న వారంటే ఆ రంగంలో ''అత్యుత్తమంగా రాణిస్తారని'' ఉద్యోగాలు ఇచ్చే సంస్థలు భావించాలని, 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సెస్' సంస్థ గా పేరు తెచ్చుకోవాలని సూచించారు. జిల్లాలో ఉన్న న్యాక్ కేంద్రాలను మరింత బలోపేతం చేయాలని తుమ్మల ఆదేశించారు. ఈ సమావేశంల న్యాక్ కో చైర్మన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్‌కు రోజులు దగ్గరపడ్డాయ్ : మోత్కుపల్లి



హైదరాబాద్, జనవరి 5 (మనం న్యూస్): టీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. శుక్రవారం జరిగిన టీడీపీ నాయకత్వ శిక్షణ తరగతుల్లో ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. ప్రభుత్వ అక్రమాలపై ప్రశ్నిస్తే పోలీసు కేసులు పెడుతున్నారని, కేసులకు భయపడే ప్రసక్తే లేదని, కార్యకర్తలకు పార్టీ నాయకత్వం అండగా ఉంటుందన్నారు. పార్టీ అధ్యక్షుడు ఎల్.రమణ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు ముందుండాలన్నారు. ప్రతి కార్యకర్త భవిష్యత్తులో ఓ నాయకుడుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి, బక్కని నర్సింహులు, నన్నూరి నర్సిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియా ఆగడాలకు ప్రభుత్వమే కారణం

హైదరాబాద్, జనవరి 5 (మనం న్యూస్): ప్రభుత్వం ఉదాసీనత వల్లే కామారెడ్డి జిల్లాలో ఇసుక మాఫియా రెచ్చిపోయిందని తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి అనూషరాం అన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇసుక అక్రమార్కుల చేతిలో ప్రభుత్వ ఉద్యోగి మరణించినప్పటికీ.. ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఆ ఉద్యోగి కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని తెలిపారు. మంత్రి కేటీఆర్ కామారెడ్డి వెళ్లి ఏం చర్యలు తీసుకున్నారని ఆమె ప్రశ్నించారు. ఇకనైనా ప్రభుత్వం ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోకపోతే ఉద్యమిస్తామని ఆమె హెచ్చరించారు.

త్వరలో సహకార సంఘాలకు ఎన్నికలు

హైదరాబాద్, జనవరి 5 (మనం ప్రతినిధి): రాష్ట్రంలోని అన్ని సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం శుక్రవారం కమిటీని వేసింది. ఈ సందర్భంగా మార్గదర్శకాలను వెలువరించింది. గ్రామీణ స్థాయి కోఆపరేటివ్ సొసైటీల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎస్సీ, ఎస్టీలయితే నామినేషన్ ఫీజు రూ.500 చెల్లించాలని నిర్ణయించారు. బీసీ అభ్యర్థులు రూ.750, ఇతరుల రూ.వెయ్యి చెల్లించాలని పేర్కొంది. పట్టణ ప్రాంతాల్లో ఉన్న అర్బన్ సొసైటీలు, డీసీసీబీల్లో పోటీ చేసే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు నామినేషన్ ఫీజు రూ.1000, బీసీ అభ్యర్థులయితే రూ.2 వేలు, ఇతరులయితే రూ.4 వేలు చెల్లించాలని మార్గదర్శకాలు జారీ చేసింది. త్వరలోనే కోఆపరేటివ్ సొసైటీలకు ఎన్నికల నిర్వహించనున్నట్టు వెల్లడించింది.

ఇసుక మాఫియాను పోషిస్తోంది టీఆర్ఎస్సే

- ఎమ్మెల్యే డీకే ఆరుణ



హైదరాబాద్, జనవరి5 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో ఇసుక మాఫియాను టీఆర్ఎస్ ప్రభుత్వమే పెంచి షోషిస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్యే డీకే అరుణ ఆరోపించారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో ఇసుక ధర పేద ప్రజలకు అందుబాటులో ఉందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం హయంలో ఇసుక కొనలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతుందన్నారు. ప్రజలకు తక్కువ ధరకు ఇసుక అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఫ్లెక్సీలు కట్టిన నేతలపై కేటీఆర్ ఆగ్రహం

జరిమానా విధించాలని జీహెచ్ఎంసీకి ఆదేశం.. మలక్‌పేట్‌లో స్టేడియం ప్రారంభించిన మంత్రి

హైదరాబాద్, జనవరి 5 (మనం ప్రతినిధి) : నిబంధనలు పాటించడం విషయంలో రాష్ట్ర ఐటీ, పంచాయతీ రాజ్ శాఖ కేటీఆర్ ఇతర నేతలకు ఆదర్శంగా మారారు. మలక్‌పేట, ఎల్బీనగర్ ప్రాంతాల్లో మంత్రి కేటీఆర్ శుక్రవారం పర్యటించారు. అయితే పలువురు టీఆర్ఎస్ నేతలు ఆయనను స్వాగతిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలను చూసిన కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నగర పరిధిలో ఫ్లెక్సీలు కట్టేందుకు అనుమతి లేదని, నిబంధనల మేరకు వాటిని ఏర్పాటు చేసిన వారికి జరిమానా విధించాలని జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. నిబంధనలు అందరూ పాటించి తీరాలన్నారు. దీంతో టీఆర్ఎస్‌కు చెందిన కార్పొరేటర్ సునరితారెడ్డికి రూ.50 వేలు, మాజీ కార్పొరేటర్‌కు అస్లాంకు రూ.25వేలు జీహెచ్ఎంసీ అధికారులు జరిమానా విధించారు.

క్రీడలకు టీఆర్ఎస్ ప్రాధాన్యం

క్రీడల అభివృద్ధికి టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర ఐటీ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు పేర్కొన్నారు. మలక్‌పేటలో నూతనంగా నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు ప్రతిభ కనబరచడం ప్రభుత్వ ప్రోత్సాహానికి నిదర్శనం అన్నారు. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తెలంగాణ అభివృద్ధి చెందదని కాంగ్రెస్ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి అన్నారని, మూడున్నరేండ్ల కాలంలో దేశంలోనే మన రాష్ట్రం అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉందన్నారు.

ఫ్రెంచ్ రాయబారితో కేటీఆర్ చర్చలు



తెలంగాణ ప్రభుత్వం పని తీరు భేష్ అని ఫ్రెంచ్ రాయబారి అలెగ్జాండర్ జిగ్లర్ పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర మంత్రి కేటీఆర్‌తో సమావేశమైన అలెగ్జాండర్ పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అలెగ్జాండర్ మాట్లాడుతూ ఫ్రెంచ్, భారత దేశాని మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు.హైదరాబాద్ మెట్రోరైలు కార్యకలాపాల్లోనూ ఫ్రెంచ్ కంపెనీ భాగస్వామిగా ఉందన్నారు. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టే విషయంతో ఫ్రెంచ్ సంస్థలు సానూకూలంగా ఉన్నాయన్నారు. నగరంలో ట్రామ్ రవాణా సౌకర్యం ఏర్పాటు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తామన్నారు. త్వరలోనే ఫ్రెంచ్ పెట్టుబడిదారుల బృందం నగరానికి వస్తుందన్నారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణలో ఉన్న పెట్టుబడి అవకాశాలను, ప్రభుత్వ విధానాలను అలెగ్జాండర్‌కు వివరించారు. తెలంగాణకు ఫ్రెంచ్ సంస్థల పెట్టుబడులు వచ్చేందుకు సహకరించాలని అలెగ్జాండర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఫ్రెంచ్ కాన్సుల్ జనరల్‌తో పాటు పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జమేష్ రంజన్ పాల్గొన్నారు.

టీఆర్ఎస్‌లో చేరిన బాన్సువాడ నేతలు

- టీడీపీ, కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్, జనవరి 5 (మనం ప్రతినిధి): తెలంగాణను 50 ఏళ్ళు దరిద్రపు గొట్టు పార్టీలు పాలించాయని మంత్రి కేటీఆర్ ఘాటుగా విమర్శించారు. గడ్డాలు పెంచుకున్నవారు సన్నాసులు అవుతారు తప్ప అధికారంలోకి రారన్నారు. గడ్డాలు పెంచుకుంటే గబ్బర్ సింగ్‌లు కాలేరని ఏద్దేవా చేశారు. ఇక్కడ నేతలు మాత్రం బాగా బలిసిపోతే...ప్రజలు మాత్రం బక్కచిక్కిపోయారన్నారు. కలిసొచ్చే కాలానికి నడిసొచ్చే కొడుకు వచ్చినట్లు తెలంగాణకు కేసీఆర్ వచ్చారన్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గానికి చేందిన టీడీపీ నేత బోజ్యానాయక్, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ మాజీ చెర్మెన్ కాంగ్రెస్ నేత తాన్ సింగ్‌తో పాటు పలువురు కాంగ్రెస్, టీడీపీ కార్యకర్తలు మంత్రి కేటీఆర్, పోచారం సమక్షంలో శుక్రవారం టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భగా కేటీఆర్ మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ...అసెంబ్లీ సమావేశాలంటే ప్రభుత్వాలు పారిపోతాయని... కానీ, తెలంగాణాలో పరిస్థితి రివర్స్‌గా ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పై నమ్మకంతో టీఆర్ఎస్‌లో చేరిన నేతలకు ధన్యవాదాలు తెలిపారు.

సచివాలయంలో హడావుడి

బుద్వేల్ ఐటీ క్లస్టర్‌పై సమీక్ష సమావేశం కోసం మంత్రి కేటీఆర్ శుక్రవారం సచివాలయానికి వచ్చారు. ఈ సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు. కొంత కాలంగా ప్రగతి భవన్‌కే పరిమితం అయిన కేటీఆర్ సచివాలయానికి రావడంతో హడావుడి నెలకొంది. ఆయనకు వినతులు ఇచ్చేందుకు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పోటీపడ్డారు.

సంచార జాతులకు లక్ష రుణం

- నాయీ బ్రాహ్మణులు, రజకులకు నిధులు
- అందరికీ సంక్షేమ పథకాలు: ఈటల
- బీసీ సంక్షేమంపై మంత్రుల కమిటీ భేటీ



హైదరాబాద్, జనవరి 5: సంచార జాతుల వారికి త్వరలో లక్ష రూపాయల బోనస్ ఇవ్వబోనున్నామని మంత్రి ఈటల రాజేందర్ ప్రకటించారు. శుక్రవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో మంత్రి ఈటల రాజేందర్ అధ్యక్షతన బీసీ సంక్షేమ కమిటీ సమావేశం జరిగింది. ఇందులో మంత్రులు జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, జోగురామన్న, చందూలాల్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ.. 2018-19 సంక్షేమ నామ సం వత్సరం అని అన్నారు. ఎస్సి,ఎస్టీ,బీసీ,మైనారిటీ అందరికి సంక్షేమపథకాలు అందిస్తామన్నారు. పేద పిల్లలకు ఒక్క రూపాయ ఖర్చు లేకుండా నాణ్యమైన విద్య అందిస్తున్నామని, ఇక ఎవరి కాళ్లమీద వాళ్ళు నిలబడేందుకు ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. గతంలో పేదలకిచ్చే స్కీమ్స్ బ్యాంకుల సహకారం లేకపోవడం వల్ల పేపర్లకే పరిమితం అవుతున్నాయని, ఒక వేల మంజూరీ అయినా కూడా మధ్య దళారీల చేతిలోకి వెళ్తున్నాయి తప్ప అసలైన లబ్ది దారులకు అందడం లేదని, అందుకే కెసిఆర్ గారు బ్యాంకులతో సంబంధం లేకుండా నేరుగా డబ్బు అందేలా ప్రణాళికలు తాయారు చేస్తున్నారని మంత్రి ఈటల అన్నారు. ఇప్పటికే గొల్లకురుమలు, మత్స్యకారులకు పెద్ద ఎత్తున ప్రభుత్వసాయం అందుతోందని చెప్పారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో మంత్రి జోగురామన్న నాయకత్వంలో అన్ని కుల సంఘాలతో, అధికారులతో సమావేశం నిర్వహించి నివేదిక సిద్ధం చేశారనాన్నిరు. ఈ నివేదికను త్వరలోనే సీఎంకు అందజేస్తామని చెప్పారు. నాయి బ్రాహ్మణులు కొత్తగా షాప్స్ పెట్టుకోవడానికి, ఉన్న షాపులను ఆధునీకరించడానికి నిధులు ఇవ్వబోతున్నామని అన్నారు. ఇక మీదట పని చేసే వారికే పూర్తి ఆదాయం అందడమే తమ లక్ష్యమని మంత్రి ఈటల అన్నారు. ముందుగా సంచార జాతులు, ఆ తరువాత రజక, నాయి బ్రాహ్మణ, విశ్వకర్మ లకు వ త్తుల వారీగా నిధులు కేటాయించేందుకు నివేదిక సిద్ధం అయ్యిందన్నారు. సీఎం గారి ఆమోదం తెలిపిన వేంటనే ఈ నెలలోనే విడుదల చేస్తామన్నారు.

22 నుంచి వన్యప్రాణుల గణన

- ప్రతి జిల్లాకో అర్బన్ పార్కు: పీకే ఝా

హైదరాబాద్, జనవరి 5: ఈ నెల 22 నుంచి దేశవ్యాప్తంగా పులులు, వన్యప్రాణుల జనగణన మొదలవుతోందని, తెలంగాణలో కూడా ఈ సర్వేను చేపడుతున్నట్లు అటవీ సంరక్షణ ప్రధాన అధికారి పి.కె.ఝా వెల్లడించారు. అడవులు, వణ్యప్రాణుల రక్షణతోనే పర్యావరణ సమతుల్యత ఆధారపడి ఉందని, నాలుగేళ్ల కోసారి ఈ రకమైన సర్వేను కేంద్రం నిర్వహిస్తోందని, తెలంగాణ ఏర్పాటయ్యాక మొదటి సారి పులుల లెక్కింపు జరుగుతోందని వెల్లడించారు. సర్వేకు అటవీ శాఖ సన్నద్ధత, మానవ వనరులు, సాంకేతిక సౌకర్యాలపై సచివాలయం నుంచి అన్ని జిల్లాల అటవీ అధికారులతో ఉన్నతాధికారులు సమీక్షించారు. నర్సరీల నిర్వహణలో కొన్ని చోట్ల నిర్లక్ష్యం కనిపిస్తోందని, వచ్చే యేడాది హరితహారం కోసం పెద్ద మొక్కలు పెంచాలని ఆదేశించారు. నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. రోడ్ల వెంట ఎవెన్యూ ప్లాంటేషన్ తో అటవీ శాఖకు మంచి గుర్తింపు వస్తోందని, దీనిని మరింతగా చేపట్టాలని నిర్ణయించారు. పట్టణ ప్రాంతాలు, మున్సిపాలిటీలు, ప్రధాన రోడ్ల వెంట జిల్లాకు వంద కిలోమీటర్లకు తక్కువ కాకుండా ఎవెన్యూ ప్లాంటేషన్ చేపట్టాలని చెప్పారు. అన్ని జిల్లాల్లో కనీసం ఒకటి చొప్పన కొత్త అర్బన్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, పట్టణ ప్రాంతాలకు ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉండే అటవీ బ్లాకుల్లో ఈ పార్కులను ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అటవీ, గిరిజన ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు, రోడ్డు, విద్యుత్ సదుపాయం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు స్థానిక యంత్రాంగం సహకరించాలని కోరారు. కొత్త యేడాదిని అగ్ని ప్రమాదాల నివారణ సంవత్సరంగా అటవీ శాఖ పాటిస్తోందన్నారు. అగ్ని ప్రమాద అవకాశాలున్న సుమారు 440 గ్రామాలు గుర్తించామని, అక్కడ ప్రత్యేక చర్యల ద్వారా ప్రమాదాలను నివారించాలన్నారు. అటవీ ఉత్పత్తులు, బీడీ ఆకుల సేకరణ లాంటి వాటికోసం అడవికి నిప్పుపెట్టేవారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

మాతోనే మహిళా సాధికారత

- ట్రిపుల్ తలాక్‌పై కాంగ్రెస్‌ది ద్వంద్వ వైఖరి
- టీఆర్ఎస్ మహిళా వ్యతిరేఖ ప్రభుత్వం
- బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

హైదరాబాద్, జనవరి 5 (మనం న్యూస్): మహిళా సాధికారతకు ప్రాధాన్యమిస్తోన్న ఏకైక ప్రభుత్వం బీజేపీ అని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం నగరంలో జరిగిన బీజేపీ మహిళా మోర్చ కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రిపుల్ తలాక్ విషయంలో కాంగ్రెస్ ద్వంద వైఖరి అవలంబిస్తోందని, బిల్లుకు రాజ్యసభలో అడ్డంపడుతూ ముస్లిం మహిళలకు అన్యాయం చేస్తోందన్నారు. 'షాబానో కేసు' విషయంలో కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలు చేసిందని ఆరోపించారు. మహిళా కార్యకర్తలకు పెద్దపీట వేస్తున్న ఏకైక పార్టీ తమదేనన్నారు. దేశ రక్షణ మంత్రిగా ఓ మహిళ ఉండటం అందరం గర్వపడాల్సిన విషయమన్నారు. మంత్రివర్గంలో ఒక్క మహిళకు కూడా చోటు కల్పించని టీఆర్ఎస్ పార్టీ మహిళా వ్యతిరేక ప్రభుత్వమన్నారు. ఉజ్వల, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలను మహిళల కోసం ప్రధాని మోదీ ప్రారంభించారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో మరుగుదొడ్డ నిర్మాణం జరుగుతుంటే టీఆర్ఎస్ వాటికి గులాబీ రంగు వేసి తన దిగజారుడు తనాన్ని చూపిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి 90 వేల ఇళ్లను ఇచ్చిందని, టీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని ఇళ్లు ఇచ్చిందని ఆయన ప్రశ్నించారు. మహిళా మోర్చా కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు.



బెల్టు షాపులు, క్లబ్ కల్చర్ మీద యుద్ధం చేద్దామన్నారు. మహిళా వ్యతిరేక ప్రభుత్వంపై నారి-భేరి మోగిద్దామని లక్ష్మణ్ పిలుపునిచ్చారు. అనంతరం ఆలిండియా మహిళా మోర్చ ప్రెసిడెంట్ విజయ రాహత్కర్ మాట్లాడుతూ మూడున్నర కోట్ల మహిళా కార్యకర్తలు బీజేపీలో సభ్యులుగా ఉన్నారన్నారు. మహిళా సంక్షేమం కోసం 'బేటీ బచావో-బేటీ పడావో', 'సుకన్య సమృద్ధి యోజన','ముద్రా యోజన','కౌశల్ వికాస్ యోజన' వంటి పథకాలను ప్రవేశపెట్టిన చరిత్ర బీజేపీదన్నారు.

మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడతోందని వాటిని మహిళలందరికీ చేరువ చేయాలని ఆమె మహిళా మోర్చ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత కిషన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చ అధ్యక్షురాలు విజయ, ఆచారి, కాంతారావు, వివిధ జిల్లాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

ట్రిపుల్ తలాక్‌పై కేసీఆర్ వైఖరేంది ?

- స్పష్టత ఇవ్వాలంటూ షబ్బీర్ అలీ డిమాండ్

హైదరాబాద్, జనవరి 5 (మనం ప్రతినిధి): ట్రిపుల్ తలాక్‌పై సీఎం కేసీఆర్ తన వైఖరిని వెల్లడించాలని శాసనమండలిలో ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం తలాక్‌పై ఏకపక్షంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. తలాక్ బిల్లుపై సవరణలకు కాంగ్రెస్, టీడీపీతో పాటు 17 పార్టీలు కలిసి వస్తున్నాయన్నారు. టీఆర్ఎస్‌తో పాటు వైసీపీ తమ వైఖరిని స్పష్టం చేయలేదన్నారు. బిల్లు చర్చకు వచ్చిన సమయంలో ఆయా పార్టీల సభ్యులు వాకౌట్ చేస్తున్నామంటూ పరోక్షంగా బీజేపీకే మద్దతు ఇచ్చారన్నారు.

కౌన్సెలింగ్‌కు హాజరవుతా: యాంకర్ ప్రదీప్

హైదరాబాద్, జనవరి 5 (మనం ప్రతినిధి): మద్యం తాగి కారు నడుపుతూ పోలీసులకు అడ్డంగా దొరికి కొద్ది రోజులుగా అజ్ఞాతంలో ఉన్న టీవీ యాంకర్ ప్రదీప్ ఎట్టకేలకు ప్రజల ముందుకు వచ్చాడు. ఈ మేరకు శుక్రవారం ఓ సెల్ఫీవీడీయోను విడుదల చేశారు. గతంలో కొన్ని ప్రోగ్రామ్స్‌కు కమిట్‌మెంట్ అయ్యానని, అందువల్లే పోలీసుల కౌన్సెలింగ్‌కు హాజరుకాలేక పోయానని అందులో పేర్కొన్నారు. తనకు తానుగా కౌన్సెలింగ్‌కు హాజరవుతానని, పోలీసు అధికారులు చెప్పిన విధంగా నడుచుకుంటానని చెప్పారు. ''నేను తప్పు చేశాను. నాలా ఎవరూ తప్పు చేయొద్దు'' అని పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, పోలీసులు నిర్వహించే కౌన్సెలింగ్ రాకుంటే చార్జిషీట్ దాఖలు చేస్తామని అదనపు డీసీపీ అమర్‌కాంత్ హెచ్చరించారు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
శనివారం, జనవరి 6

ట్రంప్ అసలు ఉద్దేశం


పాకిస్థాన్‌కు 255 మిలియన్ల డాలర్ల విదేశీ సైనిక ఆర్థిక సాయాన్ని నిలిపివేస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ట్రంప్ ఈ ప్రకటన చేయడానికి ముందు అమెరికా, పాకిస్థాన్ అధికారుల మధ్య తీవ్రవాగ్వివాదం చెలరేగింది. అంతేగాక టెర్రరిజంతో పాకిస్థాన్‌కున్న సంబంధాల నేపథ్యంలో ఆ దేశంతో తమకున్న మైత్రిస్థాయిని తగ్గించుకుంటున్నామని అమెరికా స్పష్టంచేసింది. ఆఫ్ఘనిస్థాన్‌లో టెర్రరిజంపై పోరులో తమకు సహకరిస్తూ, మరోవైపు అదే టెర్రరిస్టు వర్గాలను ప్రోత్సహించడం ద్వారా పాకిస్థాన్ ద్వంద్వవైఖరితో వ్యవహరిస్తోందని ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారి నిక్కి హేలీ ఆరోపించారు. గత ఒకటిన ట్రంప్ చేసిన ట్వీట్‌లో కొంత సరళత్వం కనిపించింది. పాకిస్థాన్ అసత్యాలతో తమ ను మోసగిస్తోందని ట్రంప్ వ్యాఖ్యానించారు. తద్వారా అమెరికా నేతలను 'మూర్ఖులు'గా భావించిందని అన్నారు. కాగా, అమెరికా ప్రకటన పట్ల పాక్ తీవ్ర విచారం వ్యక్తంచేసింది. ఆఫ్ఘనిస్థాన్‌లో అమెరికా సైన్యంతో కలిసి చేసిన పోరాటంలో తమ సైనికుల్ని కూడా నష్టపోయిన విషయాన్ని సమావేశం గుర్తుచేసింది. అయితే, అమెరికా ఆర్థికసాయం నిలిపివేయడం పాక్‌కు అనూహ్యామైనది కాదు. గత మే నెలలోనే 2018లో అందించాల్సిన వార్షిక సాయంలో 100 మిలియన్ అమెరికా డాలర్ల సాయాన్ని నిలిపివేసిన విషయం విదితమే. అయితే, అమెరికా ఆర్థికసాయం నిలిపివేయడం పాకిస్థాన్‌కు కలవరం కాకపోయినా పాక్‌తో సంబంధాలు తగ్గించుకోవాలని అమెరికా నిర్ణయం మాత్రం కలవరం కలిగించే అంశమే.

ఆధిపత్యం కోసం తహతహలాడుతున్న ట్రంప్ అధికారం స్వీకరించిన నాటి నుంచి శాంతి పంథాను వదిలి సమరపంథానే ఎన్నుకుంటున్నారు. ప్రపంచంలో ఒక్క అమెరికా పేరు తప్ప మరో దేశం పేరు వినిపించకూడదని కంకణం కట్టుకున్న ఆయన చైనా వస్తువులపై దండయాత్ర చేశారు. అమెరికా సొత్తు మొత్తాన్నీ చైనా ఎగరేసుకుపోతోందని ఆక్రోశించారు. అందుకే అమెరికాలో చైనా వస్తువుల్ని బహిష్కరించాలని పిలుపునిచ్చారు. పాకిస్థాన్ వ్యవహారశైలిపై భారత్ ఎంత మొత్తుకున్నా మొదట వినిపించుకోకుండా పాకిస్థాన్ కొమ్ముకాచిన ఆయన ప్రస్తుతం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. అధికారం స్వీకరించినప్పటి నుంచి ఆయన ఎన్నో ఏక పక్ష నిర్ణయాలతో అమెరికాను బోనులో నిలిపే యత్నాలు చేస్తూనే ఉన్నా రు. ప్రచ్ఛన్నయుద్ధం తరువాత పరిణామాల్లో సోవియట్ యూనియన్ న శించడంతో ఏకధ్రువ ప్రపంచంగా అమెరికా నిలిచింది. తాజారాజకీయ, ఆర్థిక పరిణామాల్లో అమెరికాకు చైనా ఎదురునిలిచే స్థాయికి చేరుకుంది. ఆసియా ఖండంలో చైనా, భారత్, రష్యా ఏకమై నడిస్తే అమెరికా ఆధిపత్యానికి గండి పడుతుంది.

భారత్, రష్యాలతో మైత్రికి చైనా ఎదురుచూస్తున్న సమయంలో మారే భౌగోళిక ఆధిపత్యాన్ని సహించలేక వేస్తున్న ఎత్తుల్లో పాకిస్థాన్‌కు సాయాన్ని నిలిపేయడం ఒక భాగంగానే పరిగణించాలి. జెరూసెలంలో రాయబార కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో ఐక్యరాజ్యసమితిలో చైనా, భారత్, రష్యాల వాణితో అమెరికాకు దిమ్మతిరిగింది. తాను తీసుకున్న నిర్ణయం ఇంత తీవ్ర పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుందని తెలుసుకుని ట్రంప్ ఈ మూడుదేశాల మధ్య మైత్రికి చిచ్చుపెట్టాలనే ఎత్తులో భాగంగానే పాక్‌పై నిర్ణయాన్ని తీసుకున్నారని భావించాలి. ప్రపంచంలో చైనా అన్నిరంగాల్లోను ఎదురులేని శక్తిగా పెరగడం అమెరికా గుర్తించింది. ఈ నేపథ్యంలో భారత్, రష్యాలతో చెలిమి కోసం చైనా ఎంతో కృషిచేసింది. ఆసియాలో ఈ మూడు దేశాలు ఏకమైతే తమకు ప్రమాదమేనని అమెరికా భావించే స్థాయికి వచ్చింది. ట్రంప్ ప్రకటించిన వెంటనే అమెరికా ఊహించినట్లే తాము చైనాకు మరింత దగ్గరవుతామని పాకిస్థాన్ ప్రకటించింది. ఆ విధంగా చైనా, రష్యాలకు భారత్‌ను దూరంచేస్తే భారత్ తమ అండకు చేరగలదని అమెరికా వ్యూహం. తమపై ఆంక్షలు విధించాలని ఐక్యరాజ్యసమితిలో తీర్మానం ప్రవేశపెడితే చైనా, రష్యా వీటో అధికారాన్ని ప్రదర్శిస్తామ ని హామీ ఇచ్చినట్టు పాక్ స్పష్టంచేసింది. అంతేగాక, ఈ అంశంలో తాము ఇంగ్లండ్, ఫ్రాన్స్‌లనుకూడా సంప్రదించి వాటి మద్దతు కూడా కూడగడతామని పేర్కొన్నది. నిధులు స్తంభింపచేసినంత మాత్రాన పోయేదేమీలేదని, ఈ పరిణామాల నేపథ్యంలో తాము ప్రత్యామ్నాయంగా చైనాకు దగ్గరవుతామని ప్రకటించింది. ఆర్థిక సాయాన్ని నిలిపివేసినంత మాత్రాన పాకిస్థాన్‌లో టెర్రరిస్టుల ప్రభావం తగ్గుముఖం పడుతుందనీ చెప్పలేం. పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వమైనా నడిచేది సైనిక ప్రాబల్యంతోనే (డీప్ స్టేట్) అన్నది బహిరంగ రహస్యం. మూడు దశాబ్దాలుగా టెర్రరిస్టులతో పెనవేసుకున్న బంధాన్ని వదులుకునేందుకు పాకిస్థాన్ సంసిద్ధంగా ఉంటుందనుకోవడం భ్రమేనని అమెరికాలో పాకిస్థాన్ మాజీరాయబారి హుస్సేన్ హక్కనీ వ్యాఖ్యానించడం గమనార్హం. అమెరికా చర్యను భారత్ దృష్టితో చూస్తే, టెర్రరిస్టు సంస్థలకు ఊతమిస్తున్న పాక్‌పై అమెరికా తీసుకున్న చర్య సబబుగానే కనిపిస్తుంది.



మంచిమాట



'గెలుపు గురించి అతిగా ఆలోచించొద్దు... వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకో చాలు'

- అబ్రహాం లింకన్

రాజకీయ 'సూపర్‌స్టార్' అవుతారా?



జి. రాజశుక
9160232435

సచేతన

తమిళ సూపర్‌స్టార్ రాజకీయాల్లో నిలదొక్కుకోగలరా? ఎన్నికల్లో గెలవగలరా? రాజకీయ ప్రవేశం చేయాలనే నిర్ణయం ప్రకటించిన తర్వాత ఆయన పరిస్థితి ఏమిటి? ఒక్క తమిళనాడు ప్రజలనే కాక, నటుడిగా చిరపరిచితుడైన తెలుగు ప్రజలను కూడా ఈ ప్రశ్నలు తొలిచేయడం ఖాయం. రాజకీయ ప్రవేశం గురించి ప్రకటించడంతోపాటు, తమ పార్టీ గుర్తు, తాము తమిళనాడు శాసనసభకు పోటీ చేయబోయే సీట్ల సంఖ్య గురించి కూడా ఆయన ప్రకటించడాన్ని బట్టి, ఆయన చాలా కాలం క్రితమే ఓ నిర్ణయం తీసుకున్నట్టు అర్థం అవుతోంది. అయితే గియితే ఆయన పార్టీ 2021 మేలో శాసనసభకు పోటీచేయాల్సి వస్తుంది. అప్పటికి ఆయన 70వ పడిలో ప్రవేశిస్తారు. రజనీకాంత్ ఎన్నికల్లో గెలుస్తారా అన్న ప్రశ్నకు తమిళనాడు రాజకీయ విశ్లేషకులు మాత్రం ఆయన తప్పకుండా గెలుస్తారనే ఢంకా బజాయించి చెబుతున్నారు. దేవుడు లేడనే పార్టీలు తప్ప విజయం సాధించని తమిళనాడులో దేవుడిని గట్టిగా నమ్మే రజనీకాంత్ గెలిచే అవకాశం ఉందా? ఆయన ఆధ్యాత్మిక రాజకీయాలు ఫలిస్తాయా అనే ప్రశ్నలు కూడా ఉదయించవచ్చు కానీ, వాటిని కూడా విశ్లేషకులు తీసి పక్కన పెట్టేస్తున్నారు.

ఆయన దాదాపు 20 ఏళ్ల క్రితం నుంచి తన సినిమాల్లో రాజకీయ సంబంధమైన డైలాగులు సంధిస్తున్నారు. ఇప్పటికి ఆయనకు పార్టీ పెట్టడానికి సమయం దొరికింది. ఒకపక్క జయలలిత ఆకస్మిక మరణంతో అఖిల భారత అన్నా ద్రావిడ మున్నేట్ర కళగంలో శూన్యం ఏర్పడడం, మరోపక్క డీఎంకె నాయకుడు ముత్తువేల్ కరుణానిధి వృద్ధాప్యం, అనారోగ్యాల కారణంగా క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకోవడం, అన్నిటికీ మించి అన్నాడీఎంకె తిరుగుబాటు అభ్యర్థి, శశికళ బంధువు అయిన టి.టి.వి. దినకరన్ గత డిసెంబర్ 24న జరిగిన ఆర్కే నగర్ ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించడం వగైరా పరిణామాలన్నీ ఆయన తక్షణం నిర్ణయం తీసుకోవడానికి చాలావరకు దోహదం చేశాయి. తన నిర్ణయాన్ని వాయిదా వేస్తూ పోవడం వల్ల ఇక ఉపయోగమేమీ లేదని ఆయనకు అర్థమైపోయింది. అభిమాన సంఘాల నాయకులతో చర్చించడానికి మూడు నాలుగు రోజుల సమయం తీసుకున్న తర్వాత ఆయన తన మనసులోని మాటను ఎట్టకేలకు బయటపెట్టేశారు.

నాలుగు దశాబ్దాల క్రితం ఆయన విలన్‌గా సినీరంగ ప్రవేశం చేశారు. తర్వాత కథానాయకుడుగా మారారు. తర్వాత సూపర్‌స్టార్‌గా ఓ వెలుగు వెలిగారు. 1995లో విడుదలైన బాషా చిత్రం ఆయనను ఎవరూ అందుకోలేని అందలాలు ఎక్కించేసింది. విచిత్రమేమిటంటే ఆయన హీరోగా వేసిన బాబా చిత్రం ఘోరంగా ఫెయిల్ అయింది. అందులో హీరో ఓ రాజకీయ నాయకుడికి మద్దతిస్తారు. ఆ తర్వాత తానే ఓ రాజకీయ నాయకుడిగా మారతారు. చివరి సీన్లో ఆయన రాజకీయాల్లో చేరాలనే నిర్ణయానికి వస్తారు. అయితే ఆ చిత్రం బాగా ఆడలేదు. నిజ జీవితంలో అయినా ఆయన విజయం సాధిస్తారా అన్నది వేచి చూడాలి. ఆయన తప్పకుండా గెలుస్తారని, తమిళనాడు రాజకీయ చరిత్రను తిరగ రాస్తారని రాజకీయ విశ్లేషకులే కాకుండా కోట్లాది మంది ఆయన అభిమానులు కూడా గట్టి నమ్మకంతో ఉన్నారు. ఆయన ఎలా గెలుస్తారు? ఎందుకు గెలుస్తారు? తమిళనాడు రాజకీయాలకు సంబంధించినంత వరకూ ఇవి జటిలమైన ప్రశ్నలే.



> ఆయన హీరోగా వేసిన బాబా చిత్రం ఘోరంగా ఫెయిల్ అయింది. అందులో హీరో ఓ రాజకీయ నాయకుడికి మద్దతిస్తారు. ఆ తర్వాత తానే ఓ రాజకీయ నాయకుడిగా మారతారు. చివరి సీన్లో ఆయన రాజకీయాల్లో చేరాలనే నిర్ణయానికి వస్తారు. అయితే ఆ చిత్రం బాగా ఆడలేదు. నిజ జీవితంలో అయినా ఆయన విజయం సాధిస్తారా అన్నది వేచి చూడాలి.

సినీనటులకు బ్రహ్మరథం పట్టడం ఆనవాయితీ

ఆయన విజయం సాధిస్తారని ఘంటాపథంగా చెప్పడానికి మొదటి కారణం-తమిళనాడులో సినిమా నటులకు బ్రహ్మరథం పట్టడం. ఈ ఆనవాయితీ తమిళనాడులో మొదటినుంచీ ఉన్నదే. ఎంజీఆర్ అని అభిమానులతో అభిమానంగా పిలిపించుకున్న మరుదూర్ గోపాలన్ రామచంద్రన్ ఈ కోవకు చెందిన వ్యక్తే. అలాగే ఇటీవలి వరకూ తమిళనాడు రాజకీయాలను శాసించిన జయలలిత కూడా సినీరంగానికి చెందిన వ్యక్తే. కరుణానిధి కూడా తమిళ చలన చిత్ర రంగంలో శక్తిమంతమైన డైలాగులు రాయడంలో సిద్ధహస్తులు. ఆయన రాసే తీరు, ఆయన మాట్లాడే తీరే ఆయనను సుదీర్ఘకాలం రాజకీయాల్లో నిలబెట్టాయి. ఆ గుణాలు ఆయన కుమారుడు ఎం.కె.స్టాలిన్‌కు పెద్దగా ఒంటబట్టలేదు. ఇక ఎంజీఆర్‌కు మహిళా అభిమానుల సంఖ్య బాగా ఎక్కువే. మహిళలే ఆయనకు ప్రధాన ఓటు బ్యాంకు. సినిమాల్లో మహిళల పట్ల వ్యవహరించే తీరు, వారిని ఓ తల్లిలా గౌరవించే విధం రజనీకాంత్ పట్ల మహిళల్లో కూడా అభిమానం పెరగడానికి, ముఖ్యంగా ఎంజీఆర్ ఓటు బ్యాంకు రజనీ కాంత్ వైపు మళ్లడానికి కారణమయ్యాయి. వృద్ధమహిళలే కాక, యువతుల్లో సైతం ఆయనకు విశేషాదరణ ఉంది.


అల్లుడూ నటుడే

ఆయన అమ్ముల పొదిలో ఆయన అల్లుడు, ప్రముఖ హీరో ధనుష్ ప్రధానాస్త్రం. ఆయనకు యువజనంలో బాగా అభిమానులు, అనుచరులు ఉన్నారు. ఇక రజనీకాంత్ స్నేహితులు, సన్నిహితుల్లో దేశంలోని సూపర్‌స్టార్లంతా ఉన్నారు. ఎన్నికలు ప్రకటించినప్పుడు లేదా దగ్గర పడుతున్నప్పుడు ఇవన్నీ రజనీకాంత్‌కు కలిసివచ్చే అంశాలే. ఆయన తరపున పలువురు నటులు తెరమీద కనిపించే అవకాశం ఉంది. ఇక రజనీకాంత్‌కు రికార్డు స్థాయిలో అభిమాన సంఘాలున్నాయి. ఇందులో నమోదు అయినవీ ఉన్నాయి, కానివీ ఉన్నాయి. నిజానికి ఇటువంటిది తమిళనాడులో మామూలే. ఈ సంఘాలన్నీ ఏకం కావాలని రజనీకాంత్ పిలుపునిచ్చారు. ఇతరవర్గాల ప్రజలను కూడా వీలైనంత మందిని అభిమాన సంఘాల్లో చేర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ అభిమాన సంఘాలని తమిళనాడులో రసిగర్ మండ్రంలంటారు. ఇవన్నీ ఆయన ఇమేజ్‌ని పెంచడానికి, ఆయన తరపున ప్రచారం చేయడానికే కాక, ప్రజలను కూడగట్టడానికి, సమీకరించడానికి కూడా ఉపకరిస్తాయి. 1972లో ఎంజీఆర్ డిఎంకే నుంచి చీలిపోయినప్పుడు ఇదే విధంగా జరిగింది. రానున్న మూడు సంవత్సరాలలో సూపర్‌స్టార్ కూడా ఇదే విధంగా ఎన్నికల రంగంలో ప్రవేశించి, ఓ రాజకీయ పార్టీగా పనిచేయడం ప్రారంభిస్తారు. అభిమానుల నుంచి కార్యవర్గాన్ని కూడా ఎంపిక చేస్తారు.

రజనీ మంచివక్త

రజనీ కాంత్ మంచి వక్త. తాము రాజకీయాల్లో ప్రవేశించడం దగ్గర నుంచి అధికారం చేపట్టే వరకూ ఆధ్యాత్మిక రాజకీయాలనే అనుసరిస్తామని, అధికారం చేపట్టిన తర్వాత నీతి నిజాయతీలతో కూడిన సమర్థమైన పారదర్శకమైన పాలన అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. నిజాయతీగా వ్యవహరించడం, కష్టపడడం, అభివృద్ధి చేయడం అనేవే తన పార్టీ సిద్ధాంతాలని ఆయన చెప్పారు. ఇటువంటి వా క్యాలు ఆయన అభిమానులనే కాక, యావత్ తమిళ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటాయి. ఇంతవరకూ నాస్తిక పార్టీల రాజకీయాలే చూసిన తమిళ ప్రజలు ఓ అవకాశం స్థానికమైన రజనీకాంత్ పార్టీకే ఇచ్చినా ఆశ్చర్యం లేదు. తాము పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేది లేదని రజనీకాంత్ స్పష్టంచేశారు. అయితే, తమ శక్తినీ, బలాన్నీ, బలగాన్నీ పరీక్షించుకోవడానికి ఆయన అభిమాన సంఘాలు ఈ ఎన్నికల్లో తీవ్రకృషి చేయడం ఖాయంగా కనిపిస్తోంది. పంచాయతీ ఎన్నికలను పార్టీపరంగా నిర్వహించడం జరగదు. అందువల్ల ఆయన అభిమానులు ఎన్నికల్లో పోటీచేసే అవకాశం ఉంది. ఈ పోటీలకు రజనీకాంత్ ఆమోదం తప్పనిసరిగా ఉంటుంది. రాజకీయ పాఠాలు నేర్చుకోవడానికి పంచాయతీ ఎన్నికలు రజనీకాంత్‌కు ఉపయోగపడతాయి. ఇటీవలి ఆర్కే నగర్ ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించిన దినకరన్ ఇక తన రాజకీయ సామర్థ్యం నిరూపించుకోవడానికి శాయశక్తులా కృషిచేస్తారనడంలో సందేహమేమీ లేదు. అంటే, ఎడప్పాడి పళనిస్వామి-పన్నీర్ సెల్వం ద్వయానికి ముందున్నది ముసర్ల పండగే. ఈ ప్రభుత్వం ఎంతోకాలం ఉండకపోవచ్చు కూడా. స్పీకర్ 18 మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను బర్తరఫ్ చేయడాన్ని కోర్టు అంగీకరిస్తుందా లేదా అన్నదాని మీద అంతా ఆధారపడి ఉంది.

వీరి బర్తరఫ్‌ను కోర్టు ధ్రువీకరిస్తే 18 స్థానాలు ఖాళీ అయి, వాటికి ఉప ఎన్నికలు జరపాల్సి వస్తుంది. వీటి ఫలితాలను బట్టి ప్రస్తుతం ఎడప్పాడి ప్రభుత్వం ఉంటుందా లేక కుప్పకూలుతుందా అన్నది తెలుతుంది. ఇంకా మూడేళ్లు కూడా గడవకుండానే ప్రభుత్వం కుప్పకూలితే రజనీకాంత్ పార్టీ అనివార్యంగా బాగా ముందునుంచే నడుం బిగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.



rediff.com ముఖాముఖి

'బ్రాహ్మణీయ పునరుత్థానం'


పూణెకు సమీపంలో భీమా-కోరేగాం నేడొక సామాజిక ప్రకంపన కేంద్రంగా మారింది. ప్రతి ఏటా భీమా-కోరేగాం వద్ద దళితులు మెహర్ అమరవీరుల స్మారక ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. 200 ఏళ్ల క్రితం ఈస్ట్ ఇండియా కంపెనీ దళాలకు, పీష్వా సైన్యానికి మధ్య జరిగిన యుద్ధంలో మెహర్ సైనికులు వీరోచితంగా పోరాడి బ్రిటిష్‌వాళ్ల గెలుపును నిరంకుశ, అమానవీయ సంప్రదాయాలతో వేధిస్తున్న పీష్వాలపై దళితులు సాధించిన విజయంగా భావిస్తూ ప్రతిఏడాది జనవరి 1న ఉత్సవం జరుపుకుంటారు. ఈ ఏడాది ఆ ఉత్సవాల సందర్భంగా జరిపిన సంఘపరివార్ శక్తుల విద్వేష దాడి, అందుకు నిరసనగా ఎగసిపడిన దళిత ధిక్కారంతో యావత్ భారతం ఒక్కసారి ఉలిక్కిపడింది. కోరేగాం చారిత్రక ఉదంతం ఒక చర్చనీయాంశంగా మారింది. 1818 జనవరి 1న చివరి మరాఠా యుద్ధం 'కోరెగాం సమరం'గా ప్రసిద్ధి చెందింది. ఈ యుద్ధంతో మరాఠా సామ్రాజ్యం పూర్తిగా పతనమైంది. భీమా-కోరేగాం యుద్ధంలో విజయానికి సంకేతంగా బ్రిటిష్ ప్రభుత్వం 60 అడుగుల విజయ స్థూపం నిర్మించింది. అయితే ఈ ద్విశత వార్షిక ఉత్సవాలలో గుజరాత్‌లో బీజేపీ ఆధిపత్యాన్ని ధిక్కరిస్తూ జిగ్నేష్ మేవాని అనే దళిత ఎమ్మెల్యే జయస్తంభ్‌ను సందర్శించిన సమయంలో పెద్ద ఎత్తున హింస, అల్లర్లు చెలరేగాయి. బ్రాహ్మణీయ పీష్వాలను దళిత మహర్‌లు మట్టిగరిపించిన విజయోత్సవాలు రక్తసిక్తంగా మారాయి. అయితే కోరెగాం సమరం దళితులకు సంబంధించినది కాదని, ఆ యుద్ధానికి సమకాలీన ప్రాముఖ్యం ఏమీ లేదని జనవరి 2వ తేదీన రీడిఫ్ డాట్ కాం విలేఖరి సయ్యద్ ఫిర్దౌస్ అష్రఫ్ చేసిన ఇంటర్వ్యూలో దళిత మేధావి డాక్టర్ ఆనంద్ తేల్‌తుంబ్డే అభిప్రాయపడ్డారు.

పీష్వాలపై బ్రిటిష్‌వాళ్లు విజయం సాధించిన ద్వి శతాబ్ది సందర్భం దళిత సామాజిక సమూహానికి ఎందుకు అంత ప్రాముఖ్యత? ఆ చారిత్రక సందర్భాన్ని వాళ్లు ఎందుకు ఉత్సవంగా జరుపుతున్నారు?

ఎందుకు జరుపుతున్నారో నిజంగా నాకు తెలియదు. అలాంటిదేమీ ఆనాడు జరగలేదు. వారు (దళితులు) పాలక వర్గ శక్తుల (బ్రిటిష్‌వాళ్ల) కోసం పోరాడారు. అంతకంటే ప్రాధాన్యత ఏమీ లేదు.

ఆ యుద్ధం గురించి చెప్పండి?

ప్రతి చరిత్ర పుస్తకం 1818లో ఆంగ్లో-మరాఠా యుద్ధం జరిగిందని చెబుతుంది. అది వాళ్ల మధ్య జరిగిన యుద్ధం. ఆ సమయంలో పీష్వాలు పూణేలో కూడా రాజ్యంలో లేరు. వాళ్ళు సైనికులను పెద్ద ఎత్తున సంఘటితం చేసుకొని పూణెపై దండయాత్ర చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఆ ప్రాంతంలో ఒక చిన్న సమరం నడిచింది. దాంతో మరాఠా సామ్రాజ్యం పూర్తిగా సమాప్తం అయింది. బ్రిటిష్ సామ్రాజ్యం విస్తరించింది. బ్రిటిష్ సైన్యపు బాంబే ఇన్‌ఫాంట్రీలో మెహర్‌లు అధికంగా ఉన్నారే గానీ, మెజారిటీగా లేరు. బ్రిటిష్ వైపునుంచి మరణించిన 49 మంది సైనికుల్లో 22 మంది మెహర్‌లు. అందువల్ల వారంతా కుల అణచివేత అజెండాతో పోరాడారని భావించడం పొరపాటు. ఈ విధమైన దృక్కోణం పూర్తి వక్రీకరణ మాత్రమే.



డాక్టర్ ఆనంద్ తేల్ తుంబ్డే

మరాఠా సామ్రాజ్యంలో దళితులపై వివక్ష సర్వసాధారణంగా కొనసాగిందా?

కొనసాగి ఉండొచ్చు. అదొక సామాజిక అంశం. దళితులపై వివక్ష బాగా కొనసాగిన మాట నిజం. పీష్వాల పాలనలో కుల వివక్ష పరాకాష్టకు చేరింది. అంతమాత్రాన కోరేగావ్ సమరంలో మహర్‌లు ప్రస్తుతం ప్రచారంలో ఉన్నట్లు కుల వివక్షకు వ్యతిరేకంగా ప్రతిస్పందించలేదు.

పీష్వాల పాలనలో దళితులు ఎలాంటి వివక్షలను ఎదుర్కొన్నారో చెప్పగలరా? పీష్వాల రాజ్యంలో తాము నడచిన బాటలోని మాలిన్యం లేకుండా చేసేందుకు దళితులు మూతికి ముంత, నడుముకు చీపురు కట్టుకునేవారని కొందరు భావిస్తున్నారు. అది నిజమేనా?

ఇవన్నీ జానపద కథలు మాత్రమే. దళితులు వీధుల్లో అడ్డంగా నడవకూడదు లేదా రహదారి పక్కన కూర్చోకూడదు. ఇలాంటి సన్నివేశాల గురించి మాట్లాడుతున్నారు. ఏ పుస్తకం లేదా చారిత్రక పత్రాల్లోనూ నేను ఇలాంటి ఉదంతాల గురించి వినలేదు. అయితే ఇండియాలో కుల అణచివేత లేదని చెప్పే మూర్ఖుడు ఎవరైనా ఉన్నారా! కుల అణచివేత ఇక్కడ బలంగా ఉంది.

దళితులపై అణచివేత ఉదంతాల్ని జానపద గాథలుగా మీరు పరిగణించడంలో, దళితులపై అమలైన వివక్షను అతిశయోక్తిగా భావించాలా?

పీష్వాల కాలంలో అమలైన శుద్ధ బ్రాహ్మణీయ పాలనలో కుల అణచివేత కొనసాగింది. ఈనాటికీ అది సాగుతూనే ఉంది. అదీ సత్యం. పీష్వాలు కొంతకాలం అధికారంలో లేరు. రాజ్యం సాధించేందుకు వారు తీవ్రంగా ప్రయత్నించారు. ఈ అంశాలు (కుల వివక్ష) జరుగుతూనే ఉంటాయి. అయితే ఇది (1818 యుద్ధం) అందుకే (దళితులపై వివక్ష) జరిగిందని అనగలమా....

బ్రిటిష్ వారు రావడం వల్ల దళితులకు మంచి జరిగిందని కొందరు దళిత మేధావులు రాసిన విషయాల్ని నేను చదివాను. భారత సమాజంలో లార్డ్ (థామస్ బాబింగ్టన్) మెకాలే ఇంగ్లీషు విద్యను ప్రవేశపెట్టడం వల్ల దళితుల అభ్యున్నతికి అది దోహదం చేసిందని వారి వాదన. అది నిజమేనా?

అది (సిద్ధాంతం) పూర్తిగా అర్థరహితమైనది. అస్తిత్వం (రాజకీయాలు)లో ఇలాంటి అంశాలన్నీ వక్రీకరణకు గురవుతున్నాయి. లార్డ్ మెకాలే దళితులను విముక్తి చేయాలని ఎన్నడూ ప్రయత్నించలేదు. వాళ్ళు తమకు తామే విముక్తి చెందాలి. వలసవాదం కోసం, వలసవాద ప్రయోజనాల కోసమే మెకాలే ఇంగ్లీషు విద్యను ఈ దేశంలో ప్రవేపెట్టాడు. ఇది సర్వవిదితమే. అయితే కొందరు ఈ విషయాన్ని ఎందుకు అర్థం చేసుకోలేకపోతున్నారో నాకర్థం కావడంలేదు.

పీష్వాల కాలంలో లాగా ఈనాడు కూడా బ్రాహ్మణీయ వ్యవస్థ పునరుత్థానమైందని మీరు భావిస్తున్నారా?

ఒక రకమైన (బ్రాహ్మణీయ) వ్యవస్థ పునరుత్థానమైన మాట నిజమే. పీష్వాల కాలంలోని బ్రాహ్మణీయ ఆధిపత్య వ్యవస్థ మాదిగానే నేడూ రూపొందుతుందని అనుకోలేం. పీష్వాల కాలంలో జరిగిన పరిణామం ప్రస్తుత కాలంలో ఏర్పడడం సాధ్యం కాదు. అయితే ఒక పునరుత్థానం సంభవించింది. వారు (బ్రాహ్మణీయ శక్తులు) అలాంటి పరిస్థితిని పునఃసృష్టించాలని చూస్తున్నారు.

దళితులు నేడు ఎలాంటి అణచివేతకు గురవుతున్నారు?

మీరు చూడలేకపోతున్నారా? హత్యాకాండలు జరుగుతున్నాయి. దళితులు మాత్రమే కాదు, పేదలెవరూ భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేయలేకున్నారు. వారు (రాజ్యాన్ని) ఎదిరించి నిలువలేకున్నారు. వారు దుర్మార్గంగా అణచివేతకు గురవుతున్నారు.


◆ సయ్యద్ ఫిర్దౌస్ అష్రఫ్
రీడిఫ్.కామ్ జర్నలిస్టు

చిరస్మరణీయుడు

కవిత

అతనో నిత్య సేవా న్యాయవాది
తొలితరం తెలుగు కళామతల్లి ముద్దు బిడ్డ
కవి పండితుల అత్యంత ఆప్త మిత్రుడు
నవరసాల మహానటనా సంపన్నుడు
పర్ణశాల సహజ స్వతంత్ర నటుడు!

నల్లని వ్యవస్థకు తొడిగిన గుడ్డను తొలగించి
రావు బహద్దూర్ బిరుదు తగిలించుకుని
తన పుట్టుకతో ఆంధ్రనాటక రంగానికి
పురుడుపోసి



తన నటనతో నాటగరంగంలో వెలుగు
బాటలు వేసి
ఆ గగన రంగస్థలంలో ప్రభాత సూర్యుడైనావు!

వెండితెర దుర్యోధనుడై ఎందరినో మెప్పించి
ప్రశంసలనొంది
రాజకీయం కుత్రాకుతంత్రాల రొంపి అని
తెలుసుకొని
జీవితాన్ని సీతాకోక చిలుక అద్దుకున్న రంగులను
తన దేహానికి పులుముకొని సమయం సంపదలు
లెక్కచేయక
కళామతల్లి ఒడిలో శాశ్వత విశ్రాంతి తీసుకున్నారు
అతనే ఆంధ్రుల చిరస్మరణీయుడు
బళ్లారి రాఘవుడు!!

-కుంచె చింతాలక్ష్మీనారాయణ
ఎద్దులపల్లి
9908830477

చరిత్ర

‘సుర’క్తి కథ



మద్యంతో మానవస్నేహం దాదాపు పదివేల ఏళ్ళ క్రితమే ప్రారంభమైంది. ఉత్తర చైనాలోని జియాహూ అనే గ్రామంలో పురావస్తు తవ్వకాల్లో బయల్పడిన కొన్ని పాత్రల్ని రసాయనికంగా పరీక్షిస్తే మానవ చరిత్రలో మద్యం చరిత్ర క్రీ.పూ 7000-6650ల కాలంలో మొదలైనట్టుగా నిర్ధారణ అయింది. ఆ తవ్వకాల్లో దొరికిన పాత్రల్లో అవశేషాల్ని పరీక్షిస్తే ద్రాక్ష, తేనె, వరి, మరికొన్ని రకాల పండ్లని పులియబెట్టి, మద్యాన్ని తయారు చేసినట్టుగా తెలిసింది. సరిగ్గా ఆ సమయంలోనే మధ్యప్రాచ్యదేశాల్లో బార్లీ నుంచి బీరును, ద్రాక్ష నుంచి వైన్‌ను తయారు చేయడం మొదలైందని కూడా చారిత్రకంగా తెలుస్తోంది. ఇరాన్‌లో క్రీ.పూ 5400 కాలంలో వైన్ ఉత్పత్తి ప్రారంభమైంది. ప్రాచీనకాలంలో ఈజిప్టు, మెక్సికో, సూడాన్‌లలో కూడా మద్యం తాలూకు ఆనవాళ్ళు బయల్పడ్డాయి. సుమేరియన్లు, ఈజిప్షియన్లు క్రీ.పూ 2100 నాటికే మద్యాన్ని వైద్యచికిత్సలో భాగంగా ఉపయోగించే వారు. మధ్యయుగాల నాటికి యూరోపులో దాదాపు నిత్యం ఒక గ్లాసు బీరు తీసుకోవడమన్నది అలవాటుగా మారింది. ఇన్ని మాటలెందుగ్గానీ, మనిషిగా రూపాంతరం చెందక ముందే వానరాలకు కూడా పులిసిన పండ్లని తినే అలవాటు ఉండేదట, ఇంకేం మాట్లాడగలం?!

మన మత్తు

సింధు నాగరికత కాలానికే భారత ఉపఖండంలో మద్యబాగోతం మొదలైందట. అంటే క్రీ.పూ 3000 నుంచి 2000 కాలంలో అన్నమాట! దానిపేరే ‘సురాపానం’. వరి, గోధుమ, చక్కెర, ద్రాక్ష, ఇంకా అనేకానేక పండ్లని పులియబెట్టి ‘సుర’ను తయారు చేసే వాళ్ళు. దాన్ని సమాజంలో అత్యున్నత స్థానంలో ఉన్న క్షత్రియవీరులు, ధనిక రైతులు సేవించే వారు. మన ఇతిహాసాల ప్రకారం ఇంద్రుడికి ప్రియమైన పానీయం ‘సుర’. ప్రాచీన భారతంలో పురోహిత వర్గానికి చెందిన వ్యక్తులే ‘సుర’ను తయారు చేసే వారట. ఆ వర్గాల ఆధిపత్యంలో ఉన్న భూముల నుంచి వచ్చే ఫలసాయంలో కొంత భాగాన్ని ‘సుర’ను తయారు చేయడానికి కేటాయించే వారట. ఆనాటి ఆయుర్వేద సాహిత్యంలో కూడా ఈ సురాపానం మితంగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని, అమితంగా తీసుకుంటే వ్యాధి కారకమవుతుందని పేర్కొన్నారు.

ఆధునికం

మద్యపాన ప్రియత్వమన్నది క్రమేణా పెరుగుతుండడంతో దీని వల్ల తలెత్తే దుష్ఫలితాల్ని సమాజం గుర్తించింది. అయినప్పటికీ 18వ శతాబ్దం, 19వ శతాబ్దాల నాటికి పారిశ్రామిక విప్లవం తీవ్రత పెరగడంతో పనిచేసే చోట వ్యక్తుల ప్రవర్తన, స్వీయక్రమశిక్షణలో లోపాలు బయట పడడం జరిగింది. దీంతో మద్యపాన నిషేధ ఉద్యమాలకు తెరలేచింది. మానవ మద్యచరిత్రలో అత్యంత ప్రాచీనమైంది ‘బీరు’. చిరుధాన్యాలన్నింటిలోను చక్కెర శాతం ఎక్కువగా ఉండటంతో, అవి పులియబెట్టడానికి అనువుగా ఉంటాయి. దాంతో చిరుధాన్యాల్ని పండించే తెగలన్నీ సొంతంగా బీరును తయారు చేసుకునే సామర్థ్యాన్ని కలిగి ఉండేవి. తత్ఫలితంగా ప్రపంచమంతటా ఈ పానీయం త్వరితగతిన విస్తరించింది. ఇరాక్‌లోని మెసపొటేమియాలో లభించిన క్రీ.పూ 3900 నాటి ఒకానొక సుమేరియన్ కావ్యంలో ‘నిన్కాసి’ అనే మద్యదేవత ప్రస్తావన కనిపిస్తుంది. ఆ కావ్యంలో బార్లీ నుంచి బీరును తయారు చేసే పద్ధతి గురించి వివరించారు. ఇలా బీరును తయారు చేసే విధానాన్ని రచించడం అదే తొలిసారి. క్రీస్తుపూర్వం నాలుగు వేల సంవత్సరాలకు ముందే చైనా, జార్జియా, ఇరాన్, గ్రీస్, సిసిలీ వంటి దేశాల్లో వైన్‌ను తయారు చేసే వారు. యూదు సంస్కృతిలో వైన్‌ను సేవించడాన్ని ఒక పవిత్ర వేడుకగా జరుపుకునే వాళ్ళు. యూరప్‌లో 15వ శతాబ్ద కాలానికి వైన్ ఉత్పత్తి బాగా విస్తరించింది. ప్రస్తుతం ప్రపంచమంతటా రకరకాల వైన్లు ఉత్పత్తి అవుతున్నాయి.

విపరీతం

విషామృతం

విషం మధురంగా ఉంటుందంటే మీరు నమ్ముతారా? మీరు నమ్మినా, నమ్మక పోయినా ‘స్నేక్ వైన్ ’ ప్రియులు మాత్రం నాగస్వరం ముందు పాముల్లాగా తలలూపుతారు. తైవాన్‌లోని ‘హాక్సీ స్ట్రీట్ టూరిస్ట్ నైట్ మార్కెట్’ (దీన్నే ‘స్నేక్ వాలీ’ అని కూడా పిలుస్తారు) అనే చోటుకు వెళితే, అక్కడ రోడ్ల మీద పానీయాలు అమ్మేవారు, మీ కళ్ళ ముందే ఒక పామును చంపి, దాని రక్తాన్ని ఒక గ్లాసులోకి పిండుతారు. ఆ గ్లాసులో ధాన్యంతో తయారు చేసిన వైన్ ఉంటుంది. ఇలా వైన్‌లో తాజాపాము‌రక్తం కలిస్తే ‘ఫలితం’ అద్భుతంగా ఉంటుందట!

పాము విషాన్ని మద్యంలో కలిపి తయారు చేసే వైన్‌ను ‘స్నేక్ వైన్’ అని పిలుస్తారు. స్నేక్‌వైన్‌కు వియత్నాం ప్రసిద్ధి. వరి నుంచి తయారు చేసిన మద్యంలో జీవించి ఉన్న పామును పడేసి, పులియబెట్టి ఈ స్నేక్‌వైన్‌ను తయారు చేస్తారు. చైనాలో క్రీ.పూ 1040 నుంచి 770 కాలంలోనే స్నేక్‌వైన్‌ను తయారు చేసే వారు. వైద్యచికిత్సలో ఉపయోగించడానికి ఈ మద్యాన్ని తయారు చేసినప్పటికీ, మద్యపాన ప్రియల మనసును కొల్లగొడుతోంది ఈ విషామృతం. మనదేశంలో గోవాలో కూడా దీన్ని తయారు చేస్తారు.

అత్యంత విషపూరితమైన పాముల్ని ఎంచుకుని, వాటిని నిలువ ఉంచుతారు. మద్యంలో పాము విషం కలవడం వల్ల దాన్ని తాగిన వ్యక్తికి ఎలాంటి ప్రాణహాని ఉండదు. పైపెచ్చు విషంలోని ప్రోటీన్లు మద్యంలో కలిసిన తరువాత మరింత ప్రభావపూరితంగా మారి, జీర్ణాశయంలో చేరిన తరువాత కూడా ఎలాంటి హాని కలిగించకుండా మద్యం సురక్షితంగా జీర్ణం కావడానికి దోహదపడతాయట.

వరి లేదా ఇతర తృణధ్యాన్యాల నుంచి తయారు చేసిన మద్యంతో పాటు మరికొన్ని మూలికల్ని కూడా కలిపి ఒక గాజు పాత్రలో ఉంచుతారు. ఆ మిశ్రమంలో పామును సజీవంగా పడేసి స్నేక్‌వైన్‌ను తయారు చేస్తారు. ఒక్కసారిగా మద్యంలో పడిన పాము దిమ్మెరపోయి ఉండగానే, దాన్ని బయటకు తీసి, దాని జీర్ణాశయాన్ని తొలగించి, దాని పొట్టకు మళ్ళీ కుట్లు వేసి, ఆ పామును మరోసారి మద్యంలోకి జారవిడుస్తారు. అప్పుడప్పుడే మత్తు వీడుతున్న పాము బాధతో లుంగచుట్టుకుని మద్యంలో మరణయాతన అనుభవిస్తుంది. కోపంతో బుసలు కొడుతుంది, విషాన్ని చిమ్ముతుంది. చివరికి ప్రాణాలు విడుస్తుంది. ఇది సాధారణంగా స్నేక్‌వైన్‌ను తయారు చేసే విధానం. మరో పద్ధతిలో పైన చెప్పినట్టుగా పామును చంపి, దాని రక్తాన్ని అప్పటికప్పుడే మద్యంలో కలిపి సేవిస్తారు. మరోరకమైన స్నేక్‌వైన్‌లో ఇంకా కొట్టుకొంటున్న పాము గుండెను మద్యంలో కలిపి సేవిస్తారు. సాధారణంగా స్నేక్‌వైన్ తయారీ కోసం తాచు పాముల్ని చంపుతుంటారు. కేవలం పాముల్ని మాత్రమే కాదు తేళ్ళు, జెర్రులు, తదితర విషపూరితమైన జీవుల్ని ఉపయోగించి కూడా ఇలాంటి పలురకాల మద్యాల్ని తయారు చేస్తున్నారు. వీటికి అంతర్జాతీయ వైన్ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

-కల్కి



అన్నింటికీ అతీతులు

ఆల్క‘హాలికులే’!



‘ప్రపంచంలో మద్యమే మనిషికి మొదటి శత్రువు. కానీ బైబిల్ మాత్రం నీ శత్రువును ప్రేమించు అని చెబుతుంది’ అంటూ నవ్వేస్తారు అమెరికన్ నటుడు, గాయకుడు ఫ్రాంక్ సినాత్రా. పెగ్గు అనే మాట వినబడితేనే కిక్కు తలకెక్కి అంతా ‘మరచి’ ఊగిపోతుంటారు ఆల్క ‘హాలికులు’. ఆల్కహాల్ (మద్యం), అవివేకం దొందూ దొందేనట! ఎక్కువయ్యే కొద్దీ, వాటి ప్రభావాన్ని మనిషి గుర్తించలేడు మరి! చలికి వెచ్చని పెగ్గు, ఎండకి చల్లని బీరు, ఇంకా ఇంకా అనేకానేక కారణాలకు బార్ల ముందు బారులు తీరడమన్నది ఇవాల్టి విషాదహాస్యం. ఏదో ఒక కారణంతో మొదలవుతుంది, ఇక మందుకొట్టడానికి ప్రతిదీ కారణమే... క్షమించాలి..., ప్రతిదీ సాకే! మద్యపానప్రియులకు దొరకని సాకంటూ ఏదీ ఉండదు. ఇంటికొక్కరైనా కిక్కుబాబులు లేకుండా ఉండడమన్నది ఇవాల్టి యుటోపియన్ డ్రీమ్. మొన్నటికి మొన్న కొత్త సంవత్సరం సందర్భంగా నగరంలో మద్యం ప్రవహించిన సంగతి, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ప్రముఖులు పట్టుబడిన విషయం అందరికీ విదితమే కదా? అందుకే ఇవాళ ‘మైత్రి’ మీతో సరదాగా కాసిని మందు ముచ్చట్లని పంచుకుంటోంది. – మీ ‘మైత్రి’



- ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం మద్యం సేవించడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఏటా 3.3 మిలియన్ల మంది మరణిస్తున్నారు.
- ప్రపంచవ్యాప్తంగా 2015వ సంవత్సరంలో 78,529 మంది మద్యం సేవించడం వల్ల కాలేయవ్యాధితో మరణించారు. వీరిలో 12 ఏళ్ళ పిల్లలు కూడా ఉన్నారు.



- పురుషుల్లో 49.5 శాతం మంది మద్యపాన ప్రియుల్లో 49,695 మంది కాలేయ వ్యాధితో మరణించగా, మహిళల్లో 43.5 శాతం మంది మద్యపానప్రియుల్లో 28,834 మంది కాలేయవ్యాధితో మరణించారు. ఇది 2015 నాటికి ప్రపంచ ఆరోగ్య సంస్థ తేల్చిన నిజం.
- దాదాపు 200 రకాల వ్యాధులకు మద్యపానమే కారణంగా ఉంది.




• జిమ్ ముర్రే

విస్కీ బైబిల్

పవిత్రం



తాగుబోతుల మతం మద్యం, అభిమతం మత్తు. ఈ మతస్తులకు పవిత్రగ్రంథం కూడా ఉందండోయ్, దాని పేరు ‘జిమ్ ముర్రేస్ విస్కీ బైబిల్’. బ్రిటన్‌లో జన్మించిన ఈ ముర్రే మహాశయుడు పూర్వాశ్రమంలో జర్నలిస్టు, ఇప్పుడైతే ప్రపంచ ప్రసిద్ధి గాంచిన విస్కీ విమర్శకుడు! మొట్టమొదటి సారిగా ఈయన 1975లో టలిస్కర్ సమీపంలోని ఒక విస్కీ తయారీ కేంద్రాన్ని సందర్శించారట. ఇక అప్పట్నుంచీ ఆయన సందర్శించని విస్కీ తయారీ కేంద్రాలు లేనే లేవట! ప్రపంచంలో ఇన్ని విస్కీ తయారీ కేంద్రాల్ని సందర్శించిన ఏకైక ఘనుడు జిమ్ ముర్రేనే! ప్రారంభంలో విస్కీ గురించి పుంఖానుపుంఖాలుగా పుస్తకాలు రాశాడు, అటు తరువాత విస్కీ నాణ్యతను నిర్ధారించే పని పెట్టుకున్నాడు. దాని ఫలితమే 2003 నుంచి క్రమం తప్పకుండా వెలువడుతున్న ‘జిమ్ ముర్రే విస్కీ బైబిల్’! ఈ ఘనకార్యానికిగాను ‘గ్లెన్‌ఫిడిక్ విస్కీ రైటర్’ అవార్డు మూడుసార్లు ఆయనను వరించింది. ఏటా ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న విస్కీబ్రాండ్లని ఒక్కటి కూడా వదలకుండా జిమ్ ముర్రే రుచిచూస్తారు. తరువాత మొదటి వందలో ఏఏ బ్రాండ్లు ఏఏ స్థానాల్ని ఆక్రమించించాయో ఆయన నిర్ణయిస్తారు. ఈ విస్కీ బైబిల్‌లో ప్రపంచవ్యాప్తంగా లభించే విస్కీ బ్రాండలన్నింటి గురించిన సమాచారం కూలంకషంగా ఉంటుంది. జిమ్ ముర్రేస్ విస్కీబైబిల్ 2017 వ సంవత్సరానికి గాను తాజాగా ‘బుకర్స్ రై 13 ఇయర్స్ ఓల్డ్’ను ‘వరల్డ్ విస్కీ ఆఫ్ ది ఇయర్’ ప్రకటించింది.



విపత్కరం

మత్తులో మహిళలు

భారతదేశంలో రానున్న ఐదేళ్ళలో మహిళా మద్యపానప్రియుల సంఖ్య 25 శాతం పెరగనుందని ఒక అధ్యయనంలో తేలింది. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న మహిళల సంఖ్య మెట్రోనగరాల్లో క్రమేణా పెరుగుతోంది. మద్యం మహిళలపై ఎలాంటి ప్రభావాన్ని కలిగి ఉంటుందో చూద్దాం.

మహిళ శరీరంలో నీటి శాతం పురుషుని కన్నా తక్కువగా ఉండడం వల్ల మహిళ మీద మద్యం ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఒక అధ్యయనంలో తేలింది.

ఒకే శరీరబరువు కలిగిన మహిళ, పురుషుడు ఒకే మోతాదులో ఆల్కహాల్‌ను సేవిస్తే, పురుషుని కన్నా మహిళ రక్తంలోనే ఎక్కువశాతం ఆల్కహాల్ చేరుతుంది.

ఆల్కహాల్‌ను జీర్ణం చేసుకోవడానికి అవసరమైన ఒకానొక ఎంజైమ్ మహిళల శరీరంలో తక్కువగా ఉంటుంది. కాబట్టి పురుషుని కన్నా 30 శాతం ఎక్కువగా ఆల్కహాల్ మహిళ శరీరంలో చేరుతుంది.



పెట్టని కోటలు

ఉత్పత్తి

ఆరేళ్ళ క్రితం వరకు విస్కీ ఉత్పత్తిలో స్కాట్లాండ్, ఐర్లాండ్, అమెరికాలదే పైచేయిగా ఉండేది. కానీ తరువాత ఎవ్వరూ ఊహించని విధంగా జపాన్ విస్కీ ఉత్పత్తిలో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచింది. రెండేళ్ళ క్రితం జపాన్‌కు చెందిన సంటోరీ వారి యమజకి సింగిల్ మాల్ట్ షెర్రీ కాస్క్ 2013ను జిమ్‌ముర్రే విస్కీబైబిల్ ప్రపంచ అత్యుత్తమ విస్కీగా ప్రకటించింది. ఆ తరువాత జపాన్ ఇక ఈ రంగంలో వెనుదిరిగి చూడవలసిన అవసరం లేకపోయింది.



ఇస్లామిక్ దేశాల్లో మద్యపానం అంటే అన్ని పాపాలకు మూలహేతువు. ఉత్తర ఆఫ్రికా దేశమైన మొరాకోలో 98 శాతం మంది ముస్లింలే ఉన్నప్పటికీ ఇప్పుడు ఆ దేశం వైన్ ఉత్పత్తిలో ముందంజలో ఉంది.

రోమన్ కాథలిక్కులకు చెందిన మతపరమైన ఆశ్రమాల్లో బీరును తయారు చేయడమన్నది ఆచారం. ఇది ఫ్రాన్స్‌కు చెందిన ప్రాచీన కాథలిక్ మత ఆచారం. ఇలా బీరును తయారు చేసే ఆశ్రమాలు బెల్జియంలో ఆరు, నెదర్లాండ్స్‌లో రెండు, ఇటలీ, ఆస్ట్రియా, అమెరికాల్లో ఒక్కొక్కటి ఉన్నాయి. ఈ ఆశ్రమాలలో ఉత్పత్తి అయ్యే బీరును ‘ట్రాపిస్ట్ బీర్’ అంటారు. ట్రాపిస్ట్ బీరును ఉత్పత్తి చేయడంలో బెల్జియం మొదటి స్థానంలో ఉంది.

అల్బేనియాలో ‘మూన్‌షైన్’ అనే విస్కీ ఉత్పత్తి ఎక్కువ. ఇది స్థానికంగా ఇళ్ళలో తయారు చేసే రకియా అనే బ్రాందీ రుచిని కలిగి ఉంటుంది. ఇలా ఇళ్ళలో తయారు చేయడం వల్ల దీనిలో కల్తీ జరిగే అవకాశం ఎక్కువగా ఉండడంతో మూన్‌షైన్‌ను గతంలో నిషేధించారు కూడా. అయినప్పటికీ ఇటీవలి కాలంలో కొన్ని దేశాల్లో దీనిపై నిషేధాన్ని రద్దు చేసేశారు.

‘జిన్’ అనే మద్యం రకాన్ని ఉత్పత్తి చేయడంలో ఉగాండాది పైచేయిగా ఉంది. ఈ దేశంలో స్థానికంగా ఉండే పేర్లతో పలు రకాల జిన్ లభ్యమవుతుంది. ‘వరాగి’, ‘కసెసె’, ‘లీరాలీరా’ అంటూ ఈ దేశంలో జిన్‌కు పలు రకాల పేర్లు ఉన్నాయి. దీనిని అరటిపండ్లు, చెరకు, తదితర పదార్థాలను కలిపి చేస్తారు. దీని తయారీలో వాడే పదార్థాల్లో ఇథనాల్ ఎక్కువగా ఉంటుంది. వరాగిని తాగి ఆ దేశంలో 2010లో 80 మంది మరణించారు కూడా.

- కొత్తసంవత్సరాది నాడు 2,499 మందిని పట్టుకుని హైదరాబాద్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు.
- వంద మిల్లీలీటర్ల రక్తంలో 30 మైక్రోగ్రాముల ఆల్కహాల్ ఉంటే అది అనుమతికి లోబడి ఆల్కహాల్ సేవించినట్టవుతుంది. అంతకు మించితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు కింద బుక్కయినట్టే!





1న కేంద్ర బడ్జెట్!

(మొదటి పేజీ తరువాయి)

మంత్రిమండలి సభా వ్యవహారాల కమిటీ సిఫారసు చేసింది. సభా వ్యవహారాల శాఖ మంత్రి అనంతకుమార్ శుక్రవారం ఈ విషయాన్ని విలేకరులకు వివరించారు. దీని ప్రకారం.. సమావేశాలు రెండుదశల్లో సాగుతాయి. తొలిదశలో తొలిరోజు ఉభయసభల సంయుక్త భేటీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగిస్తారు. అదే రోజున ఆర్థిక అధ్యయన (ఎకనమిక్ సర్వే) నివేదిక పార్లమెంటు ముందుకొస్తుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అటుపైన 9వ తేదీతో తొలిదశ సమావేశాలు ముగుస్తాయి. మూడువారాలకుపైగా విరామం తర్వాత మళ్లీ మార్చి 5 నుంచి మొదలయ్యే సమావేశాలు ఏప్రిల్ 6దాకా కొనసాగుతాయి

ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ పూర్తి నిజాయితీతో వ్యవహరించారని చెప్పారు. ఈ అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. వర్గీకరణపై అఖిలపక్ష బృందానికి అపాయింట్‌మెంట్ ఇవ్వాలని ప్రధాని నరేంద్ర మోదీని సీఎం పలుమార్లు కోరార ని గుర్తుచేశారు. కానీ, ప్రధాని సమయం ఇవ్వకపోవడాన్నిబట్టి వర్గీకరణపై కేంద్రానికి చిత్తశుద్ధిలేదన్న అనుమానం కలుగుతోందన్నారు. వర్గీకరణపై నిర్ణయం తీసుకోవడంతోపాటు అమలు చేయాల్సింది కేంద్రమేనని చెప్పారు. ఈ దిశగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఏం చేయాలనుకున్నా ఢిల్లీలోనే చేయాలని సూచించారు. కేంద్రంపై ఆయన పోరాడితే తగిన ఫలితం ఉండవచ్చునని సలహా ఇచ్చారు. కాంగ్రెస్, టీడీపీ నేతలు తమ రాజకీయ లబ్ధికోసమే ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పుబడుతున్నాయని మండిపడ్డారు. అధికారంలో ఉండగా వర్గీకరణ సమస్యను పరిష్కరించని ఆ రెండు పార్టీలూ ఇపుడు మొసలి కన్నీళ్లు కారుస్తున్నాయని దుయ్యబట్టారు.

దివ్యాంగులకు ప్రత్యేక ఐటీ పార్కు



(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ప్రకటించారు. దీంతో పాటు గ్రేటర్ హైదరాబాద్‌లో నిర్మించే లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లలో మూడు శాతం ఇళ్లను దివ్యాంగులకు కేటాయించడంతోపాటు రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లలో దివ్యాంగులకు ప్రత్యేక పార్కులను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. మలక్‌పేట్‌లో రూ. కోటి 77లక్షల వ్యయంతో దివ్యాంగులకు నిర్మించిన ప్రత్యేక పార్కును మంత్రి శుక్రవారం ప్రారంభించారు. నగర మేయర్ బొంతు రామ్మోహన్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ దివ్యాంగులకు పలు రకాల చికిత్సలకు ప్రత్యేక కేంద్రాలతో కూడిన ఈ జాతీయ ఉద్యానవనం దేశంలో మరే రాష్ట్రంలోలేదని కితాబునిచ్చారు. హైదరాబాద్ నగరంలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు దివ్యాంగులకు ఇలాంటి పార్కులను ఏర్పాటు చేయడానికి ముందుకువస్తే తప్పనిసరిగా ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. దేశంలో మరెక్కడా లేకుండా తెలంగాణలో దివ్యాంగులకు ప్రత్యేకంగా ఐటీ పార్కును ఏర్పాటు చేస్తున్నామని, దీని వల్ల ఐటీ రంగంలో మొట్టమొదటిసారిగా పెద్ద ఎత్తున దివ్యాంగులకు ఉపాధి అవకాశం ఏర్పడుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అన్ని వర్గాలవారికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, దాదాపు 50కి పైగా సంక్షేమ పథకాలు అమలులో ఉన్నాయని వివరించారు ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు సమాన స్థాయిలో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం అన్నారు. అభివృద్ధి, సంక్షేమంతదితర రంగాల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు. హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి మాట్లాడుతూ మొత్తం దేశానికే ఆదర్శవంతంగా ఉన్న ఈ నేషనల్ పార్కు ఏర్పాటుతో దివ్యాంగులకు ఆత్మస్థైర్యం కల్పించినట్లు అయ్యిందని అన్నారు. కేవలం పార్కే కాకుండా వినికిడి, మూగ, శారీరక వైకల్యం ఉన్నవారికి ప్రత్యేక వైద్య పరిక్ష, చికిత్సల కేంద్రాలను కూడా ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. మేయర్ రామ్మోహన్ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌లో కేవలం దివ్యాంగులకు వెయ్యి స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేశామని, 13వేల మంది సభ్యులు ఉన్న ఈ దివ్యాంగుల స్వయం సహాయక బృందాలకు 13కోట్ల రూపాయలు బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించడానికి నిర్ణయించినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ దేశంలోనే మరే రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలవారికి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని కితాబునిచ్చారు. గతంలో గార్బేజ్ కలెక్షన్ పాయింట్ కలిగిన స్థలంలో దేశానికే ఆదర్శవంతంగా ఉండే జాతీయ పార్కును ఏర్పాటు చేయడం పట్ల జీహెచ్‌ఎంసీ అధికారులను అభినందించారు. మలక్పేట్ ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో అత్యధిక దివ్యాంగులు కలిగిన నియోజకవర్గం మలక్‌పేట్ అని అన్నారు. వికలాంగుల ఆర్థికాభివృద్ది సంస్థ ఛైర్మన్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 10,50,000మంది దివ్యాంగులు ఉన్నారని, వీరిలో ఐదు లక్షల మందికి పైగా సామాజిక భద్రతా పింఛన్లు అందుతున్నాయని పేర్కొన్నారు. దివ్యాంగుల వివాహానికి అందించే ఆర్థిక సహాయాన్ని లక్ష రూపాయలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ డా.బి. జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులందరికీ ప్రత్యేకంగా వికాసం గుర్తింపు కార్డులు జారీ చేయడం ద్వారా నగరంలోని అన్ని పార్కులలో ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి నగర మేయర్ బొంతు రామ్మోహన్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే బలాల, మూసి అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రేమ్‌సింగ్ రాథోడ్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ బి జనార్దన్‌రెడ్డి, వికలాంగుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గజల్ శ్రీనివాస్‌కు బెయిల్ నిరాకరణ

హైదరాబాద్, జనవరి 4 (మనం లీగల్ ప్రతినిధి):

ఓ మహిళను లైంగికంగా వేధించిన ఆరోపణల కేసులో గజల్ గాయకుడు కె. శ్రీనివాస్‌కు తీవ్ర నిరాశ ఎదురైంది. తనకు బెయిల్ ఇప్పించాలంటూ ఆయన దాఖలుచేసుకున్న పిటిషన్‌ను నాంపల్లి కోర్టు జడ్జి శుక్రవారం కొట్టేశారు. కేసు ప్రాథమిక విచారణ దశలో ఉండగానే.. ప్రధాన నిందితుడైన శ్రీనివాస్‌కు బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని.. పైపెచ్చు ఈ కేసులో రెండో నిందితురాలైన పార్వతి పరారీలో ఉన్నందున ఈయనకు బెయిల్ మంజూరు చేయరాదని ప్రాసిక్యూషన్ తరపు న్యాయవాది వాదించారు. పార్వతిని పోలీ సులు అరెస్టు చేస్తే కేసులో కీలకమైన ఇతర సమాచారం, మరిన్ని ఆధారాలు లభించే వీలుం దని పోలీసుల వాదన. దాంతో గజల్ శ్రీనివాస్ బెయిల్ పిటిషన్‌ను కొట్టేస్తూ నాంపల్లి కోర్టు తీర్పుచెప్పింది.

లైంగిక వేధింపుల కేసులో ఫిర్యాదు రావడంతో.. గజల్ శ్రీనివాస్‌ను ఈ నెల 2న పంజా గుట్ట పోలీసులు అరెస్టు చేసి 354, 354 ఏ, 509 సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. అనంతరం వైద్యపరీక్షలు నిర్వహించి నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు ఆదేశాలతో ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. శ్రీనివాస్‌ను నాలుగు రోజులపాటు తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు చేసుకున్న విజ్ఞప్తిని కోర్టు గురువారమే కొట్టేసింది.

ఈ కేసులో శ్రీనివాస్‌ను 354 సెక్షన్ కింద జైలుకు తరలించడం అన్యాయమని.. అసలు ఆ సెక్షన్ వర్తించదని ఆయన తరపు న్యాయవాది వాదించారు. కేసు విచారణ పూర్తయ్యాక ఆయన నిర్దోషిగా తేలితే.. ఇన్నాళ్లూ ఆయన జైల్లో ఉన్న కాలానికి మూల్యం ఎవరు చెల్లిస్తారని అడిగారు. కావాలని శ్రీనివాస్‌పై కుట్ర చేసి కేసులో ఇరికిం చారని ఆరోపించారు. పైగా, స్టింగ్ ఆపరేషన్‌లో బాధితుల దగ్గరే సాక్ష్యాలన్నీ ఉంటాయని.. అందు వల్ల శ్రీనివాస్ బయటకు వచ్చినా సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ఏమాత్రం అవ కాశం ఉండదన్నారు. పోలీసులు గజల్ శ్రీనివా స్‌ను అరెస్ట్ చేసినప్పుడు తమ వద్ద అన్ని ఆధా రాలు ఉన్నాయని చెప్పారని, అందుకే నోటీసు కూడా ఇవ్వకుండా నేరుగా అరెస్ట్ చేశామని, కోర్టులో హాజరుపరిచామని చెప్పడాన్ని గుర్తుచేశారు. బెయిల్ ఇవ్వరాదని పోలీసుల తరపు న్యాయవాది వాదిస్తున్నప్పుడు కోర్టు.. ఒక దశలో పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అసలు కోర్టు అనుమతి లేకుండా సీడీలను ఎఫ్ఎస్ఎల్‌కు ఎలా పంపిస్తారని ప్రశ్నించింది. బెయిల్ ఇవ్వాలన్న వాదనలపై పోలీసులు తమ వాదనతో కౌంటర్ పిటిషన్ వేయాలని కోర్టు ఆదేశించింది.



పంట కొంటం

(మొదటి పేజీ తరువాయి)

ధర రావాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే... ''తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యలవల్ల కొంత మార్పు వచ్చింది. రైతులకు మేలు జరుగుతున్నది. ఏదేమైనా రైతులు ఆరుగాలం పడిన కష్టానికి తగిన ఫలితం దక్కాలి. ఇదే ఇప్పుడు ప్రభుత్వం ముందున్న లక్ష్యం. అన్ని పంటలకూ కనీస మద్దతు ధర వచ్చేలా ప్రభుత్వం సకల చర్యలూ తీసుకుంటుంది. ఆ మేరకు అత్యంత పట్టుదలతో, కృతనిశ్చయంతో వ్యవహరిస్తుంది. వరి, మక్కల లాంటి దిగుబడులకు ప్రస్తుతం కనీస మద్దతుధర లభిస్తుంది. పత్తి లాంటి ఇతర పంటలకు మద్దతు ధర విషయంలో అనిశ్చితి నెలకొంటున్నది. అంతర్జాతీయ మార్కెట్లు, కేంద్ర ప్రభుత్వ విధానాలు దీనిపై ప్రభావం చూపుతున్నాయి. సీసీఐ లాంటి సంస్థలు కొనుగోలు చేస్తున్నా కొన్ని ఇబ్బందులున్నాయి. ఈ పరిస్థితిని నివారించే వ్యూహం రూపొందించాలి. రైతు సమన్వయ సమితుల ద్వారా ప్రభుత్వమే నేరుగా రైతుల నుంచి పంటలు కొనుగోలు చేసి, తిరిగి అమ్మాలి. ఇలా చేయడం వల్ల ఏమైనా నష్టం వచ్చినా ప్రభుత్వమే భరించాలి'' అన్నారు. రాష్ట్రంలో పండిన ప్రతి పంట మార్కెట్ నెట్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ''వివిధ రాష్ట్రాల్లో ఆయా పంటలకు మద్దతు ధర ఇవ్వడంలో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాల్సి ఉంది. ఇందుకోసం అధికారులు మహారాష్ట్ర, కర్ణాటకలాంటి రాష్ట్రాల్లో పర్యటించాలి. ఈ దిశగా మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు నాయకత్వంలో అధికారుల బృందం దేశవ్యాప్తంగా మద్దతు ధరకు సంబంధించిన విధానాలను అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలి. మద్దతు ధర విషయంలో ప్రభుత్వం నిజాయితీగా వ్యవహరిస్తుంది. ధాన్యం, మక్కలు, పప్పులులాంటి సంప్రదాయ పంటలే కాకుండా పసుపు, మిర్చి, పత్తిలాంటి వాణిజ్య పంటలుసహా మామిడి, నిమ్మ, బత్తాయిలాంటి ఉద్యాన పంటలకూ మంచి ధర రావాలన్నదే మా లక్ష్యం. అందుకను గుణంగానే ప్రభుత్వ విధానం ఉంటుంది'' అని ముఖ్యమంత్రి విశదీకరించారు.

ఆహార పదార్థాలపై అధ్యయనం

రాష్ట్ర ప్రజలు వినియోగించే ఆహార పదార్థాలపై కేంద్ర ప్రభుత్వరంగ సంస్థతో అధ్యయనం చేయిస్తున్నామని సీఎం తెలిపారు. తదనుగుణంగా క్రాప్ కాలనీలను నిర్ధారించి మంచి మార్కెట్ ఉన్న పంటలను, నాణ్యమైన రకాలను ఎంపిక చేసుకుని సాగుచేసేలా రైతులకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. నకిలీ విత్తనాలను అరికట్టే దిశగా ప్రభుత్వం పీడీ యాక్టు తెచ్చిందని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా దీనిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఎరువుల కొరత రాకుండా ముందే స్టాక్ పెట్టుకున్నారని, అయినప్పటికీ ఎక్కడా ఏ ఇబ్బందీ రాకుండా చూసుకోవాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించుకోవాలని సీఎం కోరారు. రాష్ట్రంలో మార్కెటింగ్ శాఖ కొత్త గోదాములు నిర్మిస్తున్నందున 22.5 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం అందుబాటులోకి వస్తుందన్నారు. వేర్ హౌజింగ్, ఎఫ్‌సీఐ గోదాములు కూడా కలిపితే 53 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాలో ఏయే పంటలు వేశారన్న లెక్కలు వ్యవసాయ శాఖ వద్ద ఉండాలన్నారు. ఈ మేరకు వ్యవసాయ విస్తరణాధికారులతో సమాచారం తెప్పించుకోవాలని సూచించారు. సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సలహాదారు అనురాగ్ శర్మ, హార్టికల్చర్ కమిషనర్ వెంకట్రామ్ రెడ్డి, సీఎంవో ముఖ్య కార్యదర్శి ఎస్.నర్సింగ్ రావుసహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

అధికారులకు సీఎం అభినందనలు

రాష్ట్రంలో తొలిదశ భూ రికార్డుల ప్రక్షాళన పూర్తయినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన డైరెక్టర్ వాకాటి కరుణ, రెవెన్యూ అధికారులు, జిల్లాల కలెక్టర్లు, ఇతర సిబ్బందిని ఈ సందర్భం గా అభినందించారు. వీలైనంత త్వరగా రైతుల కు కొత్త పాస్ పుస్తకాలు ఇస్తామని ప్రకటించారు. ఇకపై భూముల క్రయవిక్రయాలు జరగ్గానే రాష్ట్ర అధికారులవద్ద కూడా ఆ వివరాలు నమోదు కావాలని చెప్పారు. భూముల మ్యుటేషన్ అధికారం కూడా ఎమ్మార్వోలకే అప్పగిస్తున్నామని, ఇక ఆర్డీవోల దగ్గరికి వెళ్లాల్సిన అవసరం లేదని చెప్పారు. ఇక రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించడంలో వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, ముఖ్య కార్యదర్శి పార్థసారథి నాయకత్వం అధికారులు విశేష కృషి చేశారని కొనియాడారు. పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులతోపాటు, పాలమూరు-రంగారెడ్డి, కాళే శ్వరం, సీతారామ, దేవాదుల ప్రాజెక్టుల పనుల ను శరవేగంగా పూర్తి చేయించేందుకు కృషిచేస్తున్నారంటూ మంత్రి హరీశ్‌రావుతోపాటు నీటిపారుదల శాఖ అధికారులను ప్రశంసించారు. రాష్ట్ర విద్యుత్ రంగంలో అత్యుత్తమ సేవలతో సీబీఐపీ అవార్డు అందుకున్న జెన్‌కో/ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్ రావును సీఎం అభినం దించారు.



ఇక వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్

రైతులను ఆదుకునే దిశగా చర్యలు తీసుకో వడంలో నిధుల కొరత లేదని సీఎం స్పష్టం చేశారు. ఈ ఏడాదినుంచే వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెడతామని ప్రకటించారు. రైతులకు పెట్టుబడిగా అందించే నిధులతోపాటు మద్దతు అందించడం కోసం కొంత నిధిని కూడా కేటాయిస్తామని చెప్పారు. వ్యవసాయాభివృద్ధికి అయ్యే ఖర్చును ముందే అంచనా వేసి బడ్జెట్లో పొందుపరుస్తామని, దీనివల్ల నిధుల సమస్య ఉండదని సీఎం అన్నారు. ''మద్దతు ధర విషయంలో కేంద్రం కూడా మరింత ఉదారంగా వ్యవహరించాల్సి ఉంది. వరి, మక్కలకు ప్రస్తుతం ప్రకటించిన మద్దతు ధర పెరగాల్సి ఉంది. ఈ రెండింటికీ రూ.2వేల మద్దతు ధర ప్రకటించాలి. కొన్ని వ్యవసాయ ఉత్పత్తులకు అసలు మద్దతు ధరే లేదు. కాబట్టి దేశంలో పండే ప్రతి పంటకూ మద్దతు ధర ప్రకటించేలా కేంద్ర విధానం ఉండాలి. దీనికోసం తెలంగాణ తరపున కేంద్రంతో మాట్లాడుతాం. టీఆర్ఎస్ పార్టీపరంగా పార్లమెంటులో కూడా ఈ విషయం ప్రస్తావిస్తాం'' అని సీఎం ప్రకటించారు.

రైతులకు వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకం (ఇన్వెస్ట్‌మెంట్ సపోర్ట్ స్కీం) ఈ ఏడాది నుంచే అమలవుతుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. మే 15 నాటికి మొదటి విడతగా ఎకరానికి రూ.4 వేల చొప్పున పెట్టుబడిని రైతులకు అందిస్తామన్నారు. ఇందులో భాగంగా వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకాన్ని ఎలా అమలు చేయాలి? రైతులకు డబ్బు నేరుగా ఇవ్వాలా? బ్యాంకుల ద్వారా పంపిణీ చేయాలా? సాగు చేస్తున్న భూములను గుర్తించడం ఎలా? ఏ ప్రాతిపదికన పెట్టుబడి అందించాలి? తదితరాలపై అధ్యయనానికి వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించారు. మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, జగదీష్‌రెడ్డి, మహేందర్ రెడ్డి కూడా ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు.

గవర్నర్ వర్సెస్ కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

మీరే ప్రభుత్వానికి సహకరించాలని కాంగ్రెస్ నేతలకు సూచించనట్లు తెలిసింది. దాంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నేతలు.. దళితుల పట్ల ప్రభుత్వం ఇంత దారుణంగా వ్యవహరిస్తుంటే ఎలా సహకరించాలని ప్రశ్నించారు. సోనియా దయతోనే గవర్నర్ అయ్యారనే విషయాన్ని విస్మరించొద్దని కూడా వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఒకదశలో కాంగ్రెస్ నేతలు గవర్నర్‌తో ఘర్షణ పడినంత వాతావరణం ఏర్పడిందని సమాచారం. ఈ దశలో పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి జోక్యం చేసుకుని నేతలకు సర్దిచెప్పినట్లుగా పార్టీ నేతలు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ నేతల తీరుపై గవర్నర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం.

ప్రభుత్వం కనుసన్నలలోనే ఇసుక మాఫియా: ఉత్తమ్

ప్రభుత్వం కనుసన్నలలోనే రాష్ట్రంలో ఇసుక మాఫియా యథేచ్ఛగా సాగుతుందని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలని, మంద కృష్ణ మాదిగను విడుదల చేయాలని కోరుతూ టీపీసీసీ ఆధ్వర్యంలో రాజ్‌భవన్‌లో శుక్రవారం గవర్నర్‌ను క లిశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ గవర్నర్‌కు వినతి పత్రాన్ని అందజేసినట్టు తెలిపారు. ఇసుక మాఫియా అన్యా యంగా కామారెడ్డి జిల్లాలో ఒక ప్రభుత్వ ఉద్యోగిని బలి తీసుకుందన్నారు. ఇంతకు ముందు నేరళ్లలో మాఫియా ప్రోత్సాహంతోనే దళితులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి హింసించారన్నారు. ఇసుక మాఫియా తీరుతో పర్యావరణానికి హాని కలుగుతుందని, భూగర్భ జలాలు అడుగంటుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికార పార్టీ అండదండలతోనే ఇసుక మాఫియా తన దందాను కొనసాగిస్తుందని ఆరోపించారు. ట్రాక్టర్ కింద తొక్కి చంపిన ఇసుక మాఫియాకు అండగా పోలీసులు ఉండటం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇసుక దందాను ప్రభుత్వం ప్రోత్సహించటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకే నంబర్‌తో పలు వాహనాల ద్వారా ఇసుక తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. ఇసుక దందాపై ఏసీబీ చే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో ఇసుకను రవాణా చేస్తున్నా అధికారులు పట్టీపట్టనట్టుగా వ్యవహరిస్తున్నారన్నారు. అధిక లోడ్‌తో అతి వే గంగా వెళ్తూ పేదల ప్రాణాలను ఇసుక వాహనాలు తీసుకుంటున్నాయన్నారు. నిబంధనలను తుంగలో తొక్కి ఇసుక రవాణా చేస్తున్న విషయమై ప్రభుత్వం స్పందించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరినట్టు తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు పోరాడుతున్న ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయించిందని ఆరోపించారు. మందకృష్ణతో పాటు అక్రమంగా అరెస్టు చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులను పోలీసులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు జానారెడ్డి, షబ్బీర్ అలీ, డి.శ్రావణ్‌కుమార్. డీకే అరుణ, మల్లురవి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పాక్ తోక కట్!

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగిస్తున్న అఫ్ఘాన్ తాలిబన్లు, హక్కానీ నెట్‌వర్క్ లాంటి ఉగ్రవాద సంస్థలపై నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడంలో విఫలమైనందుకు రూ. 7290 కోట్ల రక్షణపరమైన సాయాన్ని నిలిపివేసింది. కొత్త సంవత్సరం రోజున అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఒక ట్వీట్‌లో.. గత 15 ఏళ్లుగా తాము ఇచ్చిన రూ. 2,09,000 కోట్ల సాయానికి బదులు పచ్చి అబద్ధాలు మాత్రమే చెబుతూ మోసం చేసిందని, ఉగ్రవాద సంస్థలకు స్వర్గధామంగా తమ దేశాన్ని మార్చిందని ఆయన మండిపడిన నేపథ్యంలోనే ఈ తాజా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇన్నాళ్లుగా విదేశీ సైనిక సాయం కింద ఇస్తున్న మొత్తంతో పాటు.. సంకీర్ణ మద్దతు నిధులను ఊడా ఆపేశారు. అఫ్ఘాన్ తాలిబన్లు, హక్కానీ నెట్‌వర్క్ లాంటి ఉగ్రవాద సంస్థలపై తగిన నిర్ణయాత్మక చర్యలు తీసుకునేవరకు ఈ నిధుల సస్పెన్షన్ కొనసాగుతుందని అమెరికా హోం శాఖ అధికార ప్రతినిధి హీతర్ న్యూర్ట్ మీడియాకు చెప్పారు. ఆయా ఉగ్రవాద సంస్థలు ఆ ప్రాంతంలో అస్థిరతను కలగజేయడంతో పాటు అమెరికా సిబ్బందిని కూడా లక్ష్యంగా చేసుకుంటున్నాయని, అందువల్ల పాకిస్థాన్‌కు అన్ని రకాల రక్షణ సాయాన్ని నిలిపివేస్తున్నామని ఆమె తెలిపారు. అప్పటివరకు పాకిస్థాన్‌కు ఎలాంటి సైనిక పరికరాలు ఇవ్వబోమని, రక్షణ సంబంధిత నిధులను ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. ట్రంప్ ప్రభుత్వం ఎంత కఠినమైన ఆంక్షలు పెట్టినా.. తాలిబన్లు, హక్కానీలు మాత్రం పాకిస్థాన్‌లో సురక్షితంగానే ఉంటున్నారని ఆమె అన్నారు. ఒకవేళ నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకుంటే మాత్రం ఈ డబ్బు మళ్లీ పాకిస్థాన్‌కు వెళ్లే అవకాశం లేక పోలేదని సూచనప్రాయంగా తెలిపారు. ఇన్నాళ్లుగా పాకిస్థాన్ మీద ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని అందరూ అడిగేవారని.. దానికి ఇదే సమాధానమని అన్నారు.



సయీద్‌పై చర్యలతో సంబంధం లేదు

అయితే అదే సమయంలో ముంబై ఉగ్రవాద దాడుల సూత్రధారి, జమాత్ ఉద్ దవా అధినేత హఫీజ్ సయీద్ మీద చర్యలు తీసుకోకపోయే విషయంతో మాత్రం తమకు ఏమాత్రం సంబంధం లేదని న్యూర్ట్ తెలిపారు. అప్పటివరకు గృహనిర్బంధంలో ఉన్న సయీద్‌ను పాక్ గత సంవత్సరం నవంబరు నెలలో విడుదల చేసిన విషయం తెలిసిందే. అతడిని మళ్లీ అరెస్టుచేయడానికి తగిన సమాచారం ఎవరైనా ఇస్తే వాళ్లకు 10 మిలియన్ డాలర్ల రివార్డు మాత్రం ఉందని ఆమె చెప్పారు.

భారత్ మోసం చేస్తోంది: పాక్

ఒకవైపు అమెరికా తమకు పూర్తిగా తలంటినా పాకిస్థాన్ బుద్ధి మాత్రం మారలేదు. అవతలి వాళ్ల మీద దుమ్మెత్తి పోసే విధానాన్ని మానుకోలేదు. భారతదేశమే అబద్ధాలు చెబుతూ మోసం చేస్తోంది తప్ప తాము కాదని పాకిస్థాన్ విదేశాంగ శాఖ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ అన్నారు. భారత్ ఆడుతున్న అబద్ధాలకు, చేస్తున్న మోసాలకు అమెరికా వంత పాడుతోందని ఆయన ఆరోపించారు. అమెరికా - భారత్ చేతులు కలిపాయని, అందుకే అమెరికా కూడా భారతీయుల భాషే వాడుతోందని మండిపడ్డారు. ఈ ప్రాంతంలో వాళ్లిద్దరి ప్రయోజనాలు ఒకేటనని జియో టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసిఫ్ చెప్పారు.



రుణ మాఫీ హామీలు ప్రమాదకరం

- స్థోమత ఉన్న వాళ్లూ చెల్లించడం లేదు
- ఈసీకి ఆర్బీఐ మాజీ గవర్నర్ లేఖ
- లోక్‌సభకు తెలిపిన అరుణ్ జైట్లీ

న్యూఢిల్లీ, జనవరి 5: రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో రుణ మాఫీ హామీలు ఇవ్వడం బ్యాంకింగ్ రంగానికి ప్రమాదకరమని రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ ఒకరు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. పార్టీల వాగ్దానాల వల్ల రుణాలు చెల్లించగల స్థోమత ఉన్న వారు కూడా బ్యాంకులకు తిరిగి కట్టడం లేదని ఆయన పేర్కొన్నారు. ఇది రుణ గ్రహీత క్రమశిక్షణను దెబ్బతీస్తుందని చెప్పారు. ఈ వివరాలను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ లోక్‌సభకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. అయితే ఆ మాజీ గవర్నర్ పేరు కానీ, ఆ లేఖ ఎప్పుడు రాశారనేది కానీ జైట్లీ వెల్లడించలేదు.

'మహా' హింసపై మోదీ నోరు విప్పాలి

- బీజేపీ, ఆరెస్సెస్ నన్ను టార్గెట్ చేస్తున్నాయి: మేవానీ

న్యూఢిల్లీ, జనవరి 5: 'భీమ్-కోరేగావ్' సంస్మరణ దినోత్సవం సందర్భంగా మహారాష్ట్రలో దళితులపై హింస గురించి ప్రధాని నరేంద్రమోదీ నోరు విప్పాల్సిందేనని దళిత నేత, గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీ డిమాండ్ చేశారు. పుణెలో తాను ఎలాంటి రెచ్చగొట్టే ప్రసంగం చేయలేదని, అయినా పోలీసులు తనపై ఉద్దేశపూర్వకంగా కేసులు పెట్టారని ఆరోపించారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఆరెస్సెస్, బీజేపీలు దురుద్దేశంతోనే తనను లక్ష్యం



చేసుకున్నాయని ఆరోపించారు. తనకు ప్రజాదరణ పెరుగుతుండటాన్ని సహించలేక కుట్రలు పన్నుతున్నాయని, తనపై దాడులకు పాల్పడుతున్నాయని అన్నారు. గుజరాత్ ఎన్నికల్లో 150 స్థానాలు సాధించాలన్న బీజేపీ లక్ష్యం నీరుగారి 99 సీట్లకే పరిమితమవడాన్ని తట్టుకోలేకపోతోందని చెప్పారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ తాను దెబ్బకొట్టడం ఖాయమని భావించే ఇలా అనవసర కేసులు బనాయిస్తున్నాయని ఆరోపించారు.

సొంత నగరంపై దాడిచేసిన ఉత్తర కొరియా

- ప్రమాదవశాత్తు దాడి ?

లండన్, జనవరి 5: తనకోపమే తనశత్రువు... అన్న నానుడి అక్షరాలా ఉత్తర కొరియాపాలిట నిజమైంది. శత్రుదేశంపై దాడి చేయాలన్న ఆవేశంతో అట్టుడుకుతున్న ఉత్తర కొరియా చేసిన క్షిపణి ప్రయోగం, ఏకంగా సొంత నగరాన్నే లక్ష్యంగా చేసుకుంది. రాజధాని ప్యాంగ్యాంగ్‌కు 90 మైళ్ల దూరంలోని రెండు లక్షల జనాభా ఉన్న టంక్చన్ అనే నగరంపై క్షిపణి దూసుకుపోయింది. గతేడాది ఏప్రిల్ 28వ తేదీన ఈ ప్రమాదం జరిగినట్టు అమెరికా ఇంటెలిజెన్స్ అధికారులు వెల్లడించినట్టు 'ద డిప్లమాట్' పత్రిక వెల్లడించింది. మరో ఖండాంతర క్షిపణి ప్రయోగానికి ఉత్తరకొరియా సిద్ధంగా ఉందని, రానున్న రోజుల్లో ఈ ప్రయోగం జరగనుందనే కచ్చితమైన సమాచారం తమకు అందినట్టు ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారి నిక్కి హేలీ గతవారమే ప్రకటించారు. మరోవైపు తమకు ఉత్తరకొరియా క్షిపణుల ప్రయోగంతో తమదేశానికి పెద్ద ప్రమాదముం పొంచి ఉందని జపాన్ తన భయాందోళనలు వ్యక్తంచేస్తూ, ఉత్తర కొరియాకు వ్యతిరేకంగా ప్రపంచ దేశాల మద్దతు కూడగడుతోంది. 'న్యూక్లియర్ బటన్ ఎప్పుడూ నా టేబుల్‌పైనే ఉంటుంది' అన్న ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ప్రకటనపై స్పందించిన అమెరికా దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'నా దగ్గర అంతకంటే పెద్ద, పవర్‌ఫుల్ న్యూక్లియర్ బటన్ ఉంది, నా బటన్ పనిచేస్తుంది!' అంటూ వ్యాఖ్యానించడంతో ఇరుదేశాలమధ్య మరింత సెగ రాజేసినట్లైంది.

చర్చలకు సై

- ఈ నెల 9న ఉభయ కొరియాల భేటీ

సియోల్, జనవరి 5: ఆ రెండు దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. మాటల తూటాలు, కవ్వింపు చర్యలతో ఇరుదేశాల మధ్య పరిస్థితి కొంతకాలం నుంచి యుద్ధ వాతావరణాన్ని తలపిస్తోంది. అయితే, దాదాపు రెండేళ్ల తర్వాత ఆ రెండు దేశాలు ఒకచోట సమావేశమై చర్చలు జరపనున్నాయి. ఈ మేరకు దాయాదులైన ఉత్తర కొరియా, దక్షిణ కొరియా ప్రతినిధులు ఈ నెల 9న సమావేశం కానున్నారు. ఈ చర్చల కోసం సియోల్ పంపిన అభ్యర్థనకు ప్యాంగ్యాంగ్ అంగీకారం తెలపడంతో భేటీకి మార్గం సుగమమైంది. అమెరికా, దక్షిణ కొరియా నిర్వహించే సంయుక్త సైనిక విన్యాసాలు వాయిదాపడిన కొన్ని గంటల్లోనే ఈ సమావేశానికి ముహూర్తం ఖరారు కావడం గమనార్హం. సరిహద్దు ప్రాంతంలోని పెన్మంజోమ్ గ్రామంలో ఇరు దేశాల ప్రతినిధులు సమావేశమై ప్యాంగ్‌యాంగ్ వింటర్ ఒలింపిక్స్ నిర్వహణపై చర్చించనున్నట్లు సమాచారం. అలాగే ఇరు దేశాల సంబంధాలపైనా చర్చించే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. చివరిసారిగా ఇరు దేశాల ప్రతినిధుల మధ్య 2015 డిసెంబరులో సమావేశం జరిగింది.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

- ఇద్దరు నక్సల్స్ మృతి

రాయపూర్, జనవరి 5: ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు నక్సల్స్ హతమయ్యారు. మృతుల్లో ఒక మహిళా నక్సల్‌కూడా ఉంది. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు బీజాపూర్ జిల్లాలోని ముదువండి-కవడ్గావ్ అటవీప్రాంతంలో నక్సల్స్‌కోసం విస్తృతంగా గాలింపులు జరుగుతున్న భద్రతాదళాలపై హఠాత్తుగా నక్సల్స్ కాల్పులకు తెగబడ్డారు. దీంతో భద్రతాదళాలు ఎదురుకాల్పులు జరిపినట్టు బస్తర్ రేంజ్ డీఐజీ సుందర్‌రాజ్ వెల్లడించారు. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డులతోపాటు కోబ్రా కమాండోలు కూడా కూంబింగ్ ఆపరేషన్‌లో పాల్గొన్నట్టు డీఐజీ వివరించారు.

మేం మోదీ ఫొటో పెట్టుకోం

- ఉత్తరాఖండ్ మదర్సాల వెల్లడి

డెహ్రాడూన్, జనవరి 5: ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోలను తమ సంస్థల ప్రాంగణంలో పెట్టడం కుదరదని ఉత్తరాఖండ్‌లోని మదర్సాలు వెల్లడించాయి. ఇది ఇస్లాం మత విధానాలకు వ్యతిరేకమని స్పష్టం చేశాయి. గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 2022 నాటికి నవ భారతాన్ని నిర్మించాలని మోదీ ఇచ్చిన పిలుపునకు అనుగుణంగా ప్రతిజ్ఞ చేయాలని, ఆయన ఫొటోలను మదర్సాల్లో పెట్టాలని ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఉత్తర్వులను మైనారిటీ శాఖ ఆయా జిల్లాల్లోని సంస్థకు పంపింది. అయితే ఇస్లాం విధానాల ప్రకారం ఎవరి చిత్రపటాలనూ మదర్సాల్లో ఉంచరాదని ఉత్తరాఖండ్ మదర్సా ఎడ్యుకేషన్ బోర్డు డిప్యూటీ రిజిస్ట్రార్ హాజీ అక్లఖ్ అహ్మద్ తెలిపారు.

లఖ్‌నవ్ హజ్ హౌస్‌కు కాషాయ రంగు!


- యూపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల ఆగ్రహం

లఖ్‌నవ్, జనవరి 5: ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవ్‌లో గల హజ్ హౌస్ ప్రహరీ గోడకు కాషాయ రంగును వేశారు. దీనిపై ప్రతిపక్షాలు, కొన్ని ముస్లిం సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ముస్లింల మక్కా యాత్రకు సంబంధించిన కీలక కార్యాలయమైన హజ్ హౌస్‌కు కాషాయ రంగు అద్దడమేంటని ప్రశ్నిస్తున్నారు. అయితే దీనిపై స్పందించిన ఉత్తరప్రదేశ్ మంత్రి మొహ్సిన్ రజా ఇందులో తప్పేంలేదని చెప్పారు. ప్రతిపక్షాలకు ఏ అంశమూ దొరక్క ఇలా రాద్ధాంతం చేస్తున్నాయని అన్నారు. కాషాయ రంగుతో భవనం అందంగా కనిపిస్తోందన్నారు. ఇదిలా ఉండగా గత సెప్టెంబరు నుంచి సచివాలయంలోని పలు కార్యాలయాలు, ఐఏఎస్‌ల భవనాలు, బస్సులకూ యూపీ ప్రభుత్వం కాషాయ రంగులు అద్దుతోంది.

రజనీ అంటే మంచి మాత్రమే

- 'ఆధ్యాత్మిక రాజకీయాలు'పై రహ్మాన్ వ్యాఖ్య





చెన్నై, జనవరి 5: తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ మంచి వ్యక్తి అని స్వర మాంత్రికుడు ఏఆర్ రహ్మాన్ అన్నారు. రాజకీయాల్లోకి వస్తానని ఇటీవల ప్రకటించిన రజనీకాంత్.. కులమతాలకు అతీతంగా ఆధ్యాత్మిక రాజకీయాలు చేస్తానన్న వ్యాఖ్యపై ఆయన స్పందించారు. ''లౌకికవాద భావజాలంతో ఆధ్యాత్మిక రాజకీయాలు చేస్తానని రజనీ అన్నారు. నా దృష్టిలో రజనీ అంటే మంచి మాత్రమే'' అని రహ్మాన్ అన్నారు. రజనీ రాజకీయ ప్రవేశంపై మీడియా ప్రశ్నకు సమాధానంగా.. మంచి నాయకత్వం అవసరమన్న భావన ఉందని చెప్పారు. రాజకీయాల్లోకి వెళ్లినవారు ఎవరైనా ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలని సూచించారు. మౌలిక వసతుల కల్పనకు, రైతుల సమస్యలు తీర్చడానికి కృషి చేయాలని రహ్మాన్ అన్నారు. కాగా, ఆధ్యాత్మిక రాజకీయాలు అనే మాటపై గందరగోళం ఏర్పడటంతో రజనీ వివరణ ఇస్తూ.. నిజాయితీతో కూడిన లౌకక రాజకీయాలు అని అర్థమని చెప్పారు.

'శీతాకాలం' సమాప్తం

పార్లమెంటు ఉభయ సభల నిరవధిక వాయిదా

- ట్రిపుల్ తలాక్‌పై తేల్చని రాజ్యసభ
- ఆమోదించకుండానే వాయిదా
- వచ్చే సమావేశాల్లో చర్చకు అవకాశం

న్యూఢిల్లీ, జనవరి 5: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు శుక్రవారం ముగిశాయి. ఈ మేరకు ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. అయితే.. ముమ్మారు తలాక్‌ను నేరంగా పరిగణించే బిల్లుపై ఎటూ తేల్చకుండానే రాజ్యసభ వాయిదా పడింది. దాంతో దీంతో తలాక్ బిల్లు ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ సమావేశాల్లో చర్చకు వచ్చే అవకాశం ఉంది. చివరిరోజు రాజ్యసభలో తలాక్ బిల్లుకు ఆమోదింపజేసుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నించినప్పటికీ సాధ్యపడలేదు. దీంతో తలాక్ బిల్లుపై ఎటువంటి చర్చ జరగకుండానే సభ వాయిదా పడింది. నేరుగా, రాతపూర్వకంగా లేదా ఇక ఏ విధంగానైనా ముస్లిం మహిళకు భర్త తలాక్ చెప్పడాన్ని నేరంగా పరిగణిస్తూ కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును రూపొందించింది. దీని ప్రకారం తలాక్ చెప్పిన భర్తకు మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. దీంతోపాటు బాధిత మహిళకు భర్త నుంచి భరణం పొందే అవకాశమూ ఉంటుంది. ఈ బిల్లును గత డిసెంబర్‌లో లోక్‌సభలో ప్రవేశపెట్టగా... మూజువాణి ఓటు ద్వారా ఆమోదం లభించింది. అనంతరం ఈ బిల్లు రాజ్యసభకు చేరింది. కానీ ఈ బిల్లును విపక్ష నేతలు తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్లును సెలక్టు కమిటీకి పంపించాల్సిందేనని విపక్షాలు పట్టుబట్టాయి. దీంతో శుక్రవారం కూడా రాజ్యసభలో గందరగోళం నెలకొంది. రాజ్యసభలో తలాక్ బిల్లును వ్యతిరేకించడంపై అధికార పార్టీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభలో మద్దతు ఇచ్చారు.. మరి రాజ్యసభలో మద్దతు ఇవ్వడానికి ఎందుకు అభ్యంతరం చెబుతున్నారంటూ అధికారపక్ష నేతలు నిలదీశారు.





లోక్‌సభలో 12 బిల్లులకు ఆమోదం

శీతాకాల సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 16 బిల్లుల్లో 12 లోక్‌సభ ఆమోదం పొంద గా- పలువురు ఎంపీలు 98 ప్రైవేటు బిల్లులు సమర్పించారు. సభను నిరవధికంగా వాయిదా వేస్తూ స్పీకర్ సుమిత్రా మహాజన్ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి... డిసెంబరు 15న మొదలైన సమావేశాల్లో భాగంగా 13 రోజులు సభ భేటీకాగా, మొత్తం 61 గంటల 48 నిమిషాలపాటు కార్యకలాపాలు కొన సాగాయి. అంతరాయాలు, వాయిదాల ఫలితంగా 14 గంటల 51 నిమిషాల సమయం వృథా అయింది. అయితే, కొన్ని ముఖ్యమైన అంశాలపై చర్చకోసం అదనంగా 8 గంటల 10 నిమిషాలు సమావేశాలు కొనసాగాయి. ముస్లిం మహిళల వైవాహిక హక్కుల పరిరక్షణ బిల్లు-2017సహా ఉన్నత న్యాయస్థానాల జడ్జిల వేతనాల పెంపు తదితర ప్రధాన బిల్లులకు సభ ఆమోదముద్ర వేసింది. అత్యవసర ప్రజాప్రయోజనాలకు సంబంధించి 198 అంశాలను సభ్యులు సభలో ప్రస్తావించారు. ఇక పార్లమెంటు స్థాయి సంఘాలు 41 నివేదికలను సమర్పించాయి. ఇక రాజ్యసభను నిరవధిక వాయిదా వేస్తూ 9 బిల్లులకు సభ్యులు ఆమోదముద్ర వేసినట్లు చైర్మన్ వెంకయ్యానాయుడు ప్రకటించారు.

లోక్‌సభలో అపరిచితుడు నినాదం

లోక్‌సభ సమావేశాల సందర్భంగా విజిటర్స్ గ్యాలరీలో ఓ వ్యక్తి నినాదం చేయడం కలకలం రేపింది. ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ రుణమాఫీ అంశంపై మాట్లాడిన తర్వాత విజిటర్స్ గ్యాలరీలో కూర్చున్న ఓ వ్యక్తి 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదం చేశాడు. భద్రత సిబ్బంది వెంటనే ఆయన్ను అక్కడి నుంచి తీసుకెళ్లింది. ఆయన ఎవరన్నది తెలియరాలేదు. ఆయనపై కేసు న మోదు చేయాలా వద్దా అన్న విషయంపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని భద్రత సిబ్బంది తెలిపింది. 2016 నవంబరు 25న విజిటర్స్ గ్యాలరీలో ఉన్న ఓ వ్యక్తి లోక్‌సభ చాంబర్‌లోకి దూకేందుకు ప్రయత్నించగా భ ద్రత సిబ్బంది అప్రమత్తమై అదుపులోకి తీసుకుంది.

మన్మోహన్‌తో మోదీ కరచాలనం

రాజ్యసభ వాయిదా పడిన తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ.. ప్రతిపక్ష సభ్యుల బెంచ్ వద్దకు వెళ్లి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌తో కరచాలనం చేశారు. మన్మోహన్‌తో పాటు డిప్యూటీ చైర్మన్ పీజే కురియన్, కాంగ్రెస్ సీనియర్ నేత కరణ్ సింగ్, మరి కొందరు నేతలకు అభివాదం చేశారు. గుజరాత్ ఎన్నికల సందర్భంగా మన్మోహన్‌పై మోదీ తీవ్ర ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. గుజరాత్‌లో గెలవడానికి పాకిస్థాన్‌తో కలసి మన్మోహన్ కుట్ర పన్నారని మోదీ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్ సమావేశాల్లో వరుసగా కాంగ్రెస్ ఎంపీలు నిరసన తెలిపారు.

పెద్దల సభలో 34 గంటలు వృథా!

- వాయిదాలు, వాదనలతో సరా?
- ఎంపీలు ఆత్మావలోకనం చేసుకోవాలన్న వెంకయ్య
- నిరవధిక వాయిదా పడ్డ రాజ్యసభ

న్యూఢిల్లీ, జనవరి 5: సభాకార్యక్రమాలను పదేపదే అడ్డుకోవడంతో 34 గంటల విలువైన సభాసమయం వృథాగా పోయిందని రాజ్యసభ చైర్మన్ ముప్పవరపు వెంకయ్యానాయుడు ఆవేదన వ్యక్తంచేశారు. డిసెంబరు 15న ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో 13 సార్లు సమావేశాలు జరగ్గా, పెద్దల సభలో కేవలం 9 ప్రభుత్వ బిల్లులు మాత్రమే ఆమోదం పొందాయన్నారు. సమావేశాలను సభ్యులు పదేపదే అడ్డుకోవడంతో వృథాగా పోతున్న విలువైన సభాసమయంపై ఎంపీలు ఆత్మావలోకనం చేసుకోవాలని, ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో ఈమేరకు వెంకయ్యానాయుడు సభికులకు విజ్ఞప్తి చేశార్తు, అనంతరం సభ నిరవధికంగా వాయిదా పడింది. 'పార్లమెంట్ రాజకీయ సంస్థ అయినప్పటికీ ఇక్కడకూడా రాజకీయాలను తీసుకురావద్దని..దేశ అవసరాలను గుర్తిస్తూ సభ సజావుగా సాగేలా చూడాలి, దేశ సాంఘిక, ఆర్థిక లక్ష్యాల సాకారానికి తోడ్పడే పార్లమెంట్ ముఖ్యమైన సంస్థ, పౌరుల ఆకాంక్షలను నెరవేర్చేలా సభ ఉండాలి' అని ఆయన పేర్కొన్నారు. ఈసారి సమావేశాల్లో మొత్తం 19 ప్రైవేటు బిల్లులు ఎగువసభలో ప్రవేశపెట్టగా వీటిలో ఒక్క బిల్లు మాత్రం సదీర్ఘంగా పూర్తిస్థాయి చర్చకు నోచుకుందని వెంకయ్య వివరించారు.



41 గంటలు పనిచేశాం

శీతాకాల సమావేశాల్లో భాగంగా రాజ్యసభ మొత్తం 41 గంటలు పనిచేసిందని, 5 రోజులపాటు ప్రశ్నోత్తరాల కార్యక్రమం జరిగిందన్నారు. ఈ సందర్భంగా 46 ముఖ్యమైన ప్రశ్నలకు కొశ్చన్ అవర్‌లో మౌఖిక సమాధానం లభించిందన్నారు. 51 మంది సభ్యులు జీరో అవర్ సబ్‌మిషన్స్ చేయగా, మరో 28 మంది సభ్యులు స్పెషల్ మెన్షన్స్ చేశారన్నారు. చైర్మన్‌గా తాను బాధ్యతలు చేపట్టాక జరిగిన తొలి పూర్తి స్థాయి సమావేశాలు ఇవేననికూడా వెంకయ్యానాయుడు గుర్తుచేశారు.

రాహుల్‌పై హక్కుల తీర్మానంపై త్వరలో నిర్ణయం: వెంకయ్య

న్యూఢిల్లీ, జనవరి 5: ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీపై బీజేపీ ఎంపీ భూపిందర్ యాదవ్ జారీ చేసిన సభా హక్కుల ఉల్లంఘన తీర్మానంపై త్వరలో కచ్చితంగా నిర్ణయం తీసుకుంటానని ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు అన్నారు. కాగా ఈ అంశం పూర్తిగా లోక్‌సభకు సంబంధించినదని స్పష్టం చేశారు. రాహుల్ లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం తెలిసిందే. శుక్రవారం రాజ్యసభ జీరో అవర్‌లో యాదవ్ హక్కుల తీర్మానం గురించి ప్రస్తావించగా.. ఈ అంశం తన పరిశీలనలో ఉందని వెంకయ్య చెప్పారు. ''ఈ విషయం గురించి మీకు ముందే చెప్పాను. నేను వెంటనే చర్యలు తీసుకోగలను. అయితే ఈ అంశం లోక్‌సభ పరిధిలోనిది కనుక నిర్ణయం తీసుకోలేదు. చివరకు ఈ తీర్మానం లోక్‌సభకు వెళ్తుంది. వీలైనంత త్వరగా నేను నిర్ణయం తీసుకుంటా'' అని వెంకయ్య నాయుడు అన్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. కాగా రాజ్యసభ నాయకుడు, కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని అగౌరవ పరిచేలా, ఉద్దేశపూర్వకంగా రాహుల్ ట్విటర్‌లో వ్యాఖ్యలు చేశారంటూ.. డిసెంబరు 28న యాదవ్ హక్కుల తీర్మానం ఇచ్చారు.

లాలూకు శిక్ష ఖరారు మళ్లీ వాయిదా

- నేడు తీర్పు ప్రకటించే అవకాశం



రాంచీ, జనవరి 5: దాణా కుంభకోణం కేసు తుది తీర్పులో హైడ్రామా కొనసాగుతున్నది. ఇవాళ, రేపు అంటూ సీబీఐ ప్రత్యేక కోర్టు తుది తీర్పు తేదీలను మారుస్తోంది. దాణా కేసులో ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌తోపాటు మరో అయిదుగురికి శుక్రవారం శిక్ష ఖరారు చేయాల్సి ఉంది. కానీ, న్యాయమూర్తి తీర్పును శనివారానికి వాయిదా వేశారు. తదనుగుణంగా ఎవరెవరికి ఏయే శిక్ష వేయాలన్నది శనివారం మధ్యాహ్నం 2గం.లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వెల్లడించనున్నారు. ఈ విషయాన్ని లాలూ తరపు న్యాయవాది చిత్తరంజన్ సిన్హా తెలిపారు. దాణా కేసులో కోర్టు శుక్రవారం రెండుపక్షాల వాదనలను విన్నది. ఆరోగ్యం, వయసు దృష్ట్యా.. తనకు తక్కువకాలం శిక్ష ఖరారు చేయాలని కోరుతూ అంతకుముందు లాలూ అభ్యర్థన దాఖలు చేశారు. రూ.900 కోట్ల దాణా కుంభకోణం కేసులో బిహార్ మాజీ సీఎం, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌ను కోర్టు దోషిగా తేల్చిన రోజునుంచే జైలులో ఉన్నారు.



అమెరికాకే ఇబ్బంది!

హెచ్-1బీ విధానంలో మార్పులొద్దు.. భారత నిపుణులు వెనక్కి వెళ్తే నష్టం

మిత్ర దేశంతో సంబంధాలకూ చేటు.. కొత్త విధానంపై కాంగ్రెస్ సభ్యుల వ్యతిరేకత

వాషింగ్టన్, జనవరి 5: హెచ్-1బీ వీసా విధానంలో మార్పులతో అమెరికాకే నష్టమని కొందరు నేతలు గళం విప్పారు. కొత్త విధానంతో 5 లక్షల నుంచి 7.5 లక్షల మంది భారత అమెరికన్లు వెనక్కి వెళ్లాల్సి వస్తుంది. ఇంత భారీ సంఖ్యలో నిపుణులు వెనుదిరిగితే అమెరికా ఆర్థికంగా నష్టపోతుందని కాంగ్రెస్ సభ్యులు పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదిస్తున్న వీసా మార్పులను వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం మేలని అభిప్రాయపడుతున్నారు. అమెరికాలోని కంపెనీల్లో నిపుణులను నియమించుకునేందుకు విదేశీయులకు హెచ్-1బీ వీసాను జారీ చేస్తారు. ఇలా భారీ సంఖ్యలో భారతీయులు అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చాక 'అమెరికా వస్తువులనే కొనాలి... అమెరికన్లనే నియమించుకోవాలి' అన్న విధానంతో ముందుకెళ్తున్నారు. ఇందులో భాగంగానే ఆయన యంత్రాంగం తాజాగా హెచ్-1బీ వీసాల పొడిగింపునకు నిరాకరణ, గ్రీన్ కార్డుల్లో కోతను ప్రతిపాదించింది. అయితే వీసాలను పొడిగించని పక్షంలో భారతీయులు స్వదేశాలకు వెళ్తే అమెరికాలో నిపుణుల కొరత ఏర్పడుతుందని డెమొక్రటిక్ నేత, కాంగ్రెస్ సభ్యురాలు తులసీ గబ్బార్డ్ అభిప్రాయపడ్డారు. ఈ నిబంధనలతో ఎన్నో భారతీయ కుటుంబాలు కంటతడి పెట్టే పరిస్థితి వచ్చిందన్నారు. ఇక్కడ ఉద్యోగాలు కల్పిస్తున్న చిన్న చిన్న వ్యాపారాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిపుణుల కొరత ఏర్పడితే 21వ దశాబ్దంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో పోటీపడగల సామర్థ్యం కోల్పోతామన్నారు. అలాగే అమెరికాకు ప్రధాన మిత్ర దేశమైన భారత్‌తో సంబంధాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు. భారత అమెరికన్ కాంగ్రెస్ సభ్యుడు రాజా కృష్ణమూర్తి కూడా హెచ్-1బీ వీసా మార్పులను వ్యతిరేకించారు. ట్రంప్ యంత్రాంగం ఈ ప్రతిపాదనను వెనక్కి తీసుకుంటుందని ఆశిస్తున్నానని అన్నారు. హెచ్-1బీపై ఈ తరహా వైఖరి వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థకే నష్టమని అన్నారు. వీసా విధానంలో మార్పులతో ముఖ్యంగా సాంకేతిక రంగంలో అమెరికా తీవ్రంగా నష్టపోతుందని కాలిఫోర్నియాకు చెందిన ఇమిగ్రేషన్, బిజినెస్ లాయర్ టిసన్ చెప్పారు. కాగా, అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కు మద్దతు తెలిపిన హిందు అమెరికన్ ఫౌండేషన్ (హెచ్ఏఎఫ్) అధ్యక్ష యంత్రాంగం ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకించింది. టెక్నాలజీ రంగంలో అమెరికాకు వెన్నెముకలా ఉన్న లక్షల మంది భారతీయులను వెనక్కి పంపడం ద్వారా అమెరికాకు ఎలా మంచి జరుగుతుందని ఆ సంస్థ ప్రశ్నించింది. ఈ నిర్ణయంతో 'అమెరికా ఫస్ట్' అజెండాను ఎలా ముందుకు తీసుకెళ్లగలదని అసహనం వ్యక్తం చేసింది. ఇది అర్థం లేని నిర్ణయమని పేర్కొంది.

మేం లేకుండా అమెరికా ఎక్కడ?

హెచ్-1బీపై తాజా ప్రతిపాదనలు వలసలకు వ్యతిరేకంగా ఉన్నాయని మరో కాంగ్రెస్ సభ్యుడు రో ఖన్నా అన్నారు. ''సుందర్ పిచయ్, సత్యా నాదెళ్ల వంటి వారెందరో గ్రీన్ కార్డుతో అమెరికాలో స్థిరపడ్డారు. ఇప్పుడు ట్రంప్.. వలస వచ్చిన వారికి ఇక్కడ చోటులేదంటున్నారు. ఇది మూర్ఖత్వం. మేం లేకుండా నిజంగా అమెరికా ఇంత గొప్పగా ఎదిగేదంటారా?'' అని ఖన్నా ప్రశ్నించారు.

పోలెండ్ కుర్రాడి నోట.. పవన్ పాట



'బాహుబలి' ఎఫెక్ట్ విదేశాల్లో ఎలా ఉందో మనం చూశాం. ఆ చిత్రంలోని పాటల్ని విదేశీయులు సైతం నేర్చుకుని పెర్‌ఫార్మ్ చేయడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. సోషల్ మీడియాని ఫాలో అయ్యే వారికి జిజిగ్జ్ గురించి తెలిసే ఉంటుంది. తెలుగు భాషలోని తీయదనాన్ని గుర్తించిన ఈ పోలెండ్ కుర్రాడు కష్టపడి తెలుగు నేర్చుకొని పాటలు పాడడం, తెలుగు డైలాగులు చెప్పడం ద్వారా సోషల్ మీడియాలో చాలా పాపులర్ అయిపోయాడు. తాజాగా పవన్ కళ్యాణ్ కొత్త సినిమా 'అజ్ఞాతవాసి'లోని పాట పాడి మరోసారి వార్తల్లోకి ఎక్కాడు జిజిగ్జ్. పవన్ కళ్యాణ్ పాడిన 'కొడకా కోటేశ్వర్రావు' పాటని జిజిగ్జ్ పాడి సోషల్ మీడియాలో పవన్‌కళ్యాణ్ అభిమానుల్ని ఖుషీ చేశాడు. అతని పాట విన్న పవన్ కూడా చాలా హ్యాపీగా ఫీల్ అయ్యాడట. 'చిన్నారి నేస్తం. నీ పాట విన్నాను. కొత్త సంవత్సరం నువ్వు ఇచ్చిన కానుకకు థాంక్స్' అంటూ పవన్ ట్వీట్ చేశారు. ఇంతకుముందు అఖిల్ సినిమా 'హలో'లోని పాటను కూడా పాడి నాగార్జునను ఆకట్టుకున్నాడు జిజిగ్జ్.



• పవన్ కళ్యాణ్



గోపీచంద్ పంతం

గోపీచంద్ 25వ సినిమా చిత్రీకరణ దశలో ఉంది. ఈ సినిమాను చక్రి అనే కొత్త దర్శకుడు తెరకెక్కిస్తున్నారు. కె.కె.రాధామోహన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. మంచి సోషల్ మెసేజ్‌తో పాటు కమర్షియల్ వేల్యూస్‌తో సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో గోపీచంద్ జతగా మెహరీన్ నటిస్తుంది. గోపీచంద్ తన సినిమా టైటిల్స్ విషయంలో ఓ సెంటిమెంట్‌ను ఫాలో అవుతూ వస్తున్నారు. ఆయన టైటిల్ చివరి అక్షరం సున్నాతో ముగుస్తుంది. ఇప్పుడు అదే సెంటిమెంట్‌ను తన 25వ సినిమాకు ఫాలో అవుతున్నారట గోపీచంద్. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ సినిమాకు 'పంతం' అనే టైటిల్ పరిశీలనలో ఉంది.

రవితేజ సినిమా మొదలైంది



'రాజా ది గ్రేట్' వంటి సూపర్ హిట్ సినిమా చేసిన హీరో రవితేజ కొత్త సినిమా శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. 'సోగ్గాడే చిన్ని నాయనా', 'రారండోయ్ వేడుక చూద్దాం' వంటి విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించిన కళ్యాణ్‌కృష్ణ ఈ చిత్రానికి దర్శకుడు. ఎస్.ఆర్.టి. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామ్ తాళ్ళూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రవితేజ సరసన మాళవికశర్మ హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ సందర్భంగా నిర్మాత రామ్ తాళ్ళూరి మాట్లాడుతూ ''దర్శకుడు కళ్యాణ్ కృష్ణ చేసిన రెండు చిత్రాలు మంచి విజయాన్ని సాధించాయి. రవితేజగారి సినిమాలు అన్నివర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఉంటాయి. వీరిద్దరి కాంబినేషన్‌లో మా ఎస్.ఆర్.టి. ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌లో నిర్మిస్తున్న మొదటి సినిమా ఇది. రెగ్యులర్ షూటింగ్‌ని ఈరోజు ప్రారంభించాం. తప్పకుండా ఈ సినిమా ప్రతి ఒక్కరికీ నచ్చుతుందని నా నమ్మకం. ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే తెలియజేస్తాం'' అన్నారు. 'రాజా ది గ్రేట్' తర్వాత రవితేజ చేసిన మరో యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టచ్ చేసి చూడు'. విక్రమ్ సిరికొండ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఫిబ్రవరి 2న విడుదలవుతుందని తెలుస్తోంది.

అఖిల్‌తో ప్రభాస్ సినిమా!



'అఖిల్'తో అభిమానుల్ని నిరాశ పరిచిన అక్కినేని అఖిల్ 'హలో' చిత్రంలోని తన నటనతో అందర్నీ ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమా తర్వాత అఖిల్ చేయబోయే సినిమాపై దృష్టి పెట్టాడు. తన తదుపరి సినిమా గురించి జనవరి 10న వెల్లడిస్తానని ఇటీవల అఖిల్ ప్రకటించారు. ప్రస్తుతం అఖిల్ కొన్ని కథలు వింటున్నారు. అందులో దేన్ని ఫైనల్ చేస్తారనేది త్వరలోనే తెలుస్తుంది. ఈ చిత్రాన్ని దగ్గుబాటి రానా సంస్థ క్యాన్ నిర్మిస్తుందని తెలుస్తోంది. ఆది పినిశెట్టి సోదరుడు, 'మలుపు' చిత్ర దర్శకుడు సత్యప్రభాస్ పినిశెట్టి... అఖిల్ తదుపరి చిత్రాన్ని డైరెక్ట్ చేసే అవకాశం ఉందని సమాచారం. అయితే అఖిల్ మూడో సినిమా డైరెక్టర్ ఎవరనేది అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.



• దిశా పటాని

దిశా రహస్య వివాహం?

బాలీవుడ్‌లో పెళ్ళిళ్ళ సీజన్ మొదలైనట్టు కనిపిస్తోంది. ఇటీవల విరాట్ కోహ్లి, అనుష్క శర్మ అందర్నీ ఆశ్చర్యపరుస్తూ ఇటలీలో రహస్యంగా వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. వీళ్ళిద్దరిలాగే టైగర్ ష్రాఫ్, దిశా పటాని కూడా రహస్యంగా పెళ్ళి చేసుకున్నారని బాలీవుడ్ వర్గాల సమాచారం. వీరిద్దరూ గత కొంతకాలంగా ఎక్కడికి వెళ్ళినా కలిసే వెళుతున్నారు. కొత్త సంవత్సరం వేడుకలను శ్రీలంకలో జరుపుకున్నారు. అక్కడే రహస్యంగా పెళ్ళి చేసుకున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. వీరిద్దరి ప్రేమకు టైగర్ ష్రాఫ్ తండ్రి జాకీ ష్రాఫ్ అంగీకరించినప్పటికీ తల్లి ఆయేషా మాత్రం ఒప్పుకోలేదని తెలిసింది. ఈ ప్రేమ వ్యవహారం గురించి దిశాని ప్రశ్నిస్తే.. ''టైగర్ ఫ్యామిలీతో నేను ఎక్కువగా కలవను'' అని చెప్పింది. ఇప్పుడు మీడియాలో వినిపిస్తున్న పెళ్ళి వార్తపై ఆమె ఎలా స్పందిస్తుందో చూడాలి. తెలుగులో వరుణ్‌తేజ్ హీరోగా నటించిన 'లోఫర్' చిత్రంలో హీరోయిన్‌గా నటించిన దిశా పటాని ప్రస్తుతం తమిళంలో 'సంఘమిత్ర' సినిమా చేస్తోంది. టైగర్, దిశా జంటగా నటించిన 'బాఘి 2' త్వరలో విడుదల కానుంది.

అదే ఫాలో అవుతున్న సూర్య



హీరో సూర్య 'గ్యాంగ్' సినిమా ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. విఘ్నేశ్ శివన్ దర్శకుడు. తెలుగులో ఈ చిత్రాన్ని యు.వి.క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రమోద్, వంశీ విడుదల చేస్తున్నారు. కీర్తి సురేష్ హీరోయిన్‌గా నటిస్తుండగా..రమ్యకృష్ణ, కార్తిక్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సాధారణంగా సినిమాల్లో ఏదో ఒక పాత్ర మందు లేదా సిగరెట్ కానీ తాగుతూ మనకు తెరపై కనపడుతుంది. అయితే సూర్య గత మూడు చిత్రాలు 'పసంగ 2', '24', ఎస్3'ల్లో ఈ సన్నివేశాలు కనపడవు. అందుకనే సినిమా ప్రారంభంలో వేసే మద్యపానం, ధూమపానం కార్డ్‌ను 'గ్యాంగ్' సినిమాలో కూడా చూపించరని చెప్పారు హీరో సూర్య.

'రంగుల రాట్నం' నాకు మంచి పేరు తెస్తుంది

- హీరో రాజ్ తరుణ్



రాజ్ తరుణ్ హీరోగా అన్నపూర్ణ స్టూడియోస్ బేనర్‌పై నిర్మిస్తున్న చిత్రం 'రంగుల రాట్నం'. చిత్రా శుక్లా హీరోయిన్‌గా, శ్రీరంజని దర్శకురాలిగా ఈ చిత్రం ద్వారా పరిచయమవుతున్నారు. సంక్రాంతి సందర్భంగా జనవరి 14న ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా హీరో రాజ్ తరుణ్ మాట్లాడుతూ ''ఈమధ్య విడుదలైన ట్రైలర్‌కి చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ సినిమాలో నా క్యారెక్టర్, లుక్ కొత్తగా ఉంటాయి. ఇప్పటి వరకు నేను చేసిన క్యారెక్టర్ల కంటే ఈ సినిమా చేసిన క్యారెక్టర్‌కి మంచి పేరు వస్తుంది. నా మొదటి సినిమా 'ఉయ్యాలా జంపాలా' అన్నపూర్ణ స్టూడియోస్ బేనర్‌లో చేశాను. సుప్రియ గారు కాల్ చేసి ఈ సినిమా గురించి చెప్పారు. శ్రీరంజని గారు చెప్పిన కథ విన్నాను. నాకు బాగా నచ్చింది. 'రంగుల రాట్నం' అనే టైటిల్ కూడా కథకి చాలా యాప్ట్ అయ్యింది. నా తొలి సినిమా చేసిన బేనర్‌లో మరో మంచి సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రం ద్వారా హీరోయిన్‌గా పరిచయమవుతున్న చిత్రా శుక్లా ఎక్కువ రెస్పాన్సిబులిటీస్ ఉన్న అమ్మాయిగా ఒక మంచి క్యారెక్టర్ చేసింది. తన క్యారెక్టర్‌కి పూర్తి న్యాయం చేసింది. అల్లరి చిల్లరగా తిరిగే కుర్రాడు, ఆ అమ్మాయి మధ్య ప్రేమ ఎలా మొదలైంది అనేది చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. సంక్రాంతి పండుగకు ఫ్యామిలీ అంతా కలిసి థియేటర్ వెళ్ళి రెండు గంటల పాటు హాయిగా నవ్వుకుని ఎంజాయ్ చేసేలా ఈ చిత్రం వుంటుంది. ఇది ఒక మంచి లవ్‌స్టోరీ. మదర్ సెంటిమెంట్, ప్రేమికుల మధ్య వచ్చే లవ్ సీన్స్ అన్నీ చాలా ఫ్రెష్‌గా ఉంటాయి. శ్రీరంజనిగారు చాలా అద్భుతంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. డైరెక్టర్ అంటే డైరెక్టరే. మేల్, ఫిమేల్ అనే తేడా ఉండదు. స్క్రిప్ట్ రాశాక వారి పాయింట్ వ్యూలో కొన్ని థాట్స్ వుంటాయి. దానికి తగ్గట్లుగా సినిమా చేశారు. శ్రీరంజని సెల్వరాఘవన్ వద్ద చాలాకాలం పని చేసింది. డైరెక్టర్‌కి కావాల్సిన క్వాలిటీస్ అన్నీ శ్రీరంజనిలో వున్నాయి. మ్యూజిక్ గురించి చెప్పాలంటే శ్రీచరణ్ చేసిన ఆరు పాటలూ చాలా అద్భుతంగా ఉన్నాయి. రీరికార్డింగ్ కూడా చాలా బాగుంటుంది. మిగతా క్యారెక్టర్ల గురించి చెప్పాలంటే నాకు మదర్‌గా సితారగారు చేశారు. ఫ్రెండ్ క్యారెక్టర్‌లో ప్రియదర్శి చాలా నేచురల్ పెర్‌ఫార్మెన్స్ ఇచ్చాడు. మా కాంబినేషన్‌లో వచ్చే కామెడీ సీన్స్ సిట్యుయేషన్‌కి తగ్గట్టుగా ఉంటాయి'' అన్నారు.



కేసరిగా అక్షయ్



వైవిధ్యభరిత కథా చిత్రాలకు చిరునామాలా ఉంటూ.. తన విలక్షణ నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్. తెరపై ఒక వైపు కామెడీని పంచుతూనే.. మరో వైపు సున్నితమైన సామాజిక అంశాలని అంతర్లీనంగా తన నటనా చాతుర్యంతో చెప్పడం ఈ హీరో ప్రత్యేకత. దీనికి నిదర్శనమే తాజాగా వచ్చిన 'టాయిలెట్: ఏక్ ప్రేమ్ కథ', అలాగే త్వరలో రాబోతున్న 'పాడ్ మాన్' వంటి చిత్రాలు. ఇప్పుడు ది బేటిల్ అఫ్ సారాగర్హి అనే కథ ఆధారంగా తెరకెక్కుతున్న 'కేసరి' సినిమాలో నటిస్తున్నారు ఈ విలక్షణ నటుడు. ఈ మూవీకి అనురాగ్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ధర్మ ప్రొడక్షన్స్ నిర్మాణంలో కరణ్ జోహార్ నిర్మిస్తున్నారు. శుక్రవారం నుంచి ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. ఈ చిత్రాన్ని హోలీ పండుగ సందర్భంగా ఏప్రిల్ 2019లో విడుదల చేయనున్నారు. మరి అక్షయ్ ఈ సినిమాలో ఎటువంటి సామాజిక అంశాన్ని తెరపైకి తీసుకువస్తారో చూడాలి.



మరో నిర్మాత ఇలా మోసపోకూడదు

- నిర్మాత ఎస్.కె.బషీద్



సందీప్ కిషన్, లావణ్య త్రిపాఠి జంటగా రూపొందిన చిత్రం 'ప్రాజెక్ట్ జెడ్'. ఎస్.బి.కె. ఫిలిమ్ కార్పొరేషన్ పతాకంపై ఎస్.కె.బషీద్ నిర్మించిన చిత్రమిది. ఇటీవల విడుదలైన ఈ చిత్రం విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా ఎస్.కె.బషీద్ మాట్లాడుతూ ''మా 'ప్రాజెక్ట్ జెడ్' చిత్రాన్ని ప్రేక్షకులు అదరిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ప్రతి సినిమాలో ఒక విలన్ ఉంటాడు అలాగే నా జీవితంలో హీరో సందీప్ కిషన్ విలన్‌గా మారి సినిమాను చంపేస్తున్నాడు. వరసగా సందీప్ కిషన్ చేసిన 19 సినిమాలు సక్సెస్ అవ్వలేదు. అందుకే నేను సెంటిమెంటల్‌గా తన వాయిస్‌ను కాదని డబ్బింగ్ వేరే వారి చేత చెప్పించాను. దాంతో సందీప్ కిషన్ ఈ సినిమాలో నా వాయిస్ కాదు, సినిమా ప్రమోషన్స్‌లో నేను పాల్గొనని, సినిమా విడుదలను అడ్డుకోవడానికి చాలా సార్లు ప్రయత్నించాడు. అందుకు నేను లీగల్‌గా ప్రొసీడ్ అయ్యి కష్టపడి సొంత డబ్బుతో విడుదల చేసుకున్నాను. కానీ సందీప్ కిషన్ నాపై పగ పట్టినట్టుగా వ్యవహరిస్తున్నాడు. సినిమా బాగా రాలేదు కనుక నేనే సినిమాను మళ్లీ రీషూట్ చేసి త్వరలో విడుదల చేస్తానంటూ ప్రచారం చేస్తున్నాడు. ఇలా మరో నిర్మాత మోసపోకూడదనే ఈ విషయాలు తెలియజేస్తున్నాను'' అన్నారు.



చినరాజప్ప కాన్వాయ్ వాహనం దగ్ధం!

- డ్రైవర్ అప్రమత్తత.. బయటపడ్డ సిబ్బంది
- కాన్వాయ్‌కు సంబంధంలేదని పోలీసుల వివరణ

విశాఖపట్నం, జనవరి 5: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప కాన్వాయ్‌లోని ఎస్కార్ట్ వాహనం విద్యుద్ఘాతంతో దగ్ధమైంది. విశాఖ జిల్లా నర్సీపట్నంలో సీఎం చంద్రబాబు జన్మభూమి కార్యక్రమానికి చినరాజప్ప శుక్రవారం ఉదయం బయలుదేరారు. కాన్వాయ్ విశాఖ జిల్లా మాకవరపాలెం చేరుకొన్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. వాహన డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో అందులోని ఐదుగురు ఎస్కార్ట్ సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. మరో వాహనంలో వారు నర్సీపట్నం చేరుకొన్నారు. ఈ వార్తలు మీడియాలో రావడంతో విశాఖ పోలీసులు ఘటనపై స్పందించారు. అక్కడ దగ్ధమైనది కాన్వాయ్‌లోని వాహనం కాదని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి వచ్చే ముందు రూట్ క్లియర్ చేసే వాహనం ప్రమాదవశాత్తు కాలిపోయిందని స్పష్టం చేశారు.

విశాఖ పోలీసులకు బెయిల్

- రాజస్థాన్ ఏసీబీ కేసులో అరెస్టు
- రెండు నెలలుగా జైలులోనే

విశాఖపట్నం, జనవరి 5 (మనం ప్రతినిధి): రాజస్థాన్‌లో రెండు నెలలుగా జైలులో ఉన్న విశాఖ పోలీసులకు ఎట్టకేలకు బెయిల్ వచ్చింది. విశాఖ ఉత్తర సబ్ డివిజన్ సీఐ ఆర్కే చౌదరి, మహారాణిపేట క్రైమ్ ఎస్ఐ గోపాలరావు, పరవాడ క్రైమ్ ఎస్ఐ షరీఫ్, కానిస్టేబుల్ హరిప్రసాద్‌కు శుక్రవారం రాజస్థాన్ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రెండు నెలల క్రితం విశాఖలో చోరీకి పాల్పడిన దొంగను పట్టుకొనేందుకు వెళ్లిన ఈ బృందం అనూహ్యంగా అక్కడి అవినీతి నిరోధక శాఖకు పట్టుపడింది. దొంగల నుంచి లంచం తీసుకుంటుండగా వారిని ఆ రాష్ట్ర ఏసీబీ అరెస్టు చేసింది. నాటి నుంచి వీరు జైలులో ఉన్నారు. వీరిని రాష్ట్రానికి రప్పించేందుకు విశాఖ పోలీసు కమిషనర్ యోగానంద్ ఆదేశాల మేరకు డీసీపీ బాజ్‌పాయి, సీఐ పైడప నాయుడు అక్కడికి వెళ్లి బెయిల్ కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. తొలుత ఏసీబీ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా... కోర్టు తిరస్కరించింది. దీంతో వారు ఆ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. ఇందుకోసం విశాఖ పోలీసు సిబ్బంది, అధికారులు రూ.2.5 లక్షల నిధిని సేకరించి రాజస్థాన్‌లో న్యాయవాదిని నియమించారు. తాజాగా శుక్రవారం వాదనలు విన్న హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీంతో వారు శనివారం విడుదలయ్యే అవకాశం ఉంది.



సచివాలయ ఉద్యోగులకు క్రీడాపోటీలు

- విజేతలకు బహుమతులు అందజేత

అమరావతి, జనవరి 5 (మనం ప్రతినిధి): సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక స్పోర్ట్స్ మీట్-2017 విజేతలకు బహుమతులు అందజేశారు. శుక్రవారం సచివాలయంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిచంద్ర, పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనాల చేతుల మీదుగా విజేతలు బహుమతులను అందుకున్నారు. క్రికెట్, రన్నింగ్, షటిల్ తదితర పోటీల్లో పురుష, మహిళా విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ముఖేష్ మాట్లాడుతూ... నూతన రాష్ట్రంలో తొలిసారి నిర్వహించిన సచివాలయ ఉద్యోగుల క్రీడా పోటీలను విజయవంతం చేసినందుకు అభినందనలు తెలిపారు. ఆలిండియా సివిల్ సర్వీసెస్ స్విమ్మింగ్-2016లో కాంస్య పతకం సాధించిన కె.వెంకట్రావు, సౌత్ ఏషియన్ వెటరన్ టేబుల్ టెన్నిస్‌లో రజత పతకం సాధించిన బి.సుజాతలను సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ పరిచయం చేశారు.

తలాక్ బిల్లును వ్యతిరేకించిన టీడీపీ


న్యూఢిల్లీ, జనవరి 5: ఒకవైపు జాతీయస్థాయిలో ఎన్డీయేకు మిత్ర పక్షంగా వ్యవహరిస్తున్నా... ట్రిపుల్ తలాక్ బిల్లును మాత్రం టీడీపీ వ్యతిరేకించింది. తెలుగుదేశం పార్టీతో పాటు తమిళనాడులోని ప్రతిపక్షమైన అన్నాడీఎంకే కూడా బిల్లును వ్యతిరేకించడం గమనార్హం. తమ నిర్ణయం బీజేపీని ఇబ్బంది పెట్టినా చేయగలిగింది ఏమీ లేదని.. కానీ ప్రస్తుతం ఉన్న బిల్లు మాత్రం తమకు ఆమోదయోగ్యం కాదని రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ అన్నారు. అందులో ఉన్న నేరం క్లాజుకు తాము వ్యతిరేకమని, అదే విషయాన్ని బీజేపీకి చెప్పి.. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాల్సిందిగా కోరామని ఆయన చెప్పారు.

శ్రీకాళహస్తిలో అపచారం

- కాలభైరవుడి గర్భగుడిలో విరుద్ధంగా పూజలు

శ్రీకాళహస్తి, జనవరి 5 (మనం న్యూస్): విజయవాడ కనకదుర్గ ఆలయంలో తాంత్రిక పూజలు జరిగాయంటూ రాష్ట్రం వ్యాప్తంగా కలకలం సృష్టించగా.. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తిలో అపచారం జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా కాళభైరవుని గర్భగుడిలో పూజలు చేసినట్లు వెలుగు చూసింది. అలాగే శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో పలు అక్రమాలు చోటు చేసుకున్నట్టు విచారణలో తేలింది. ఆలయ ఈవో భ్రమరాంబ.. సూపరిండెంట్ ధనపాల్‌ను సస్పెండ్ చేశారు. ఆలయంలో అన్నదానం, ప్రసాదాల కౌంటర్ సూపరిండెంట్‌గా పనిచేస్తున్న ధనపాల్ రూ.24,500 సొంతానికి వాడుకుని చెల్లించనట్టు ఈవో తనిఖీల్లో బయటపడింది. అదేవిధంగా ప్రసాదాల కౌంటర్ నుంచి రూ.3 వేల వరకు లడ్డు, వడ తీసుకుని మూడు నెలలు అవుతున్నా ఇప్పటికీ చెల్లించకపోవడం ఈవో దృష్టికి వచ్చింది. వీఐపీలకు ప్రత్యేక వసతులు దేవాదాయశాఖ నిషేధించినా వారి పేరుతో 16 చీరలు, 20 పంచెలు తీసుకున్నట్లు తెలిసింది. ధనపాల్‌ను సస్పెండ్ చేస్తూ, సమగ్ర విచారణ చేపట్టాల్సిందిగా ఈవో ఆదేశించారు.

ప్రపంచాన్ని ఆకర్షిస్తోంది



జన్మభూమి వైపు చూపు.. రాష్ట్ర ప్రజలు గర్వపడే విషయం

- 80 శాతం సంతృప్తి ప్రజల్లో రావాలి
- ప్రతి ఫిర్యాదునూ వెంటనే పరిష్కరించాలి
- మన పిల్లలు ప్రపంచానికే నాయకత్వం వహించే పరిస్థితి రావాలి: చంద్రబాబు
- అధికారులు, ప్రజాప్రతినిధులతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్

అమరావతి, జనవరి 5 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో జరిగే జన్మభూమి కార్యక్రమం ప్రపంచం మొత్తాన్ని ఆకర్షిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరూ గర్వపడాల్సిన విషయమిదని అన్నారు. శుక్రవారం విశాఖపట్నం నుంచి జన్మభూమి నోడల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మూడు రోజులుగా జన్మభూమి అద్భుతంగా జరిగిందని, ఇదే స్ఫూర్తిని రాబోయే ఏడు రోజుల్లో కూడా కొనసాగించాలని ఆయన కోరారు. రాష్ట్రంలో 80 శాతం ప్రజల్లో సంతృప్తి తీసుకురావడమే లక్ష్యంగా నేతలు పనిచేయాలన్నారు. రాబోయే 15 ఏళ్ల రాష్ట్రంలో 15 శాతం వృద్ధి రేటు కొనసాగించాలని, ప్రతి శాఖ సామర్థ్యం పెరగాలని, పనితీరు మరింత మెరుగుపడాలని సీఎం ఆకాంక్షించారు. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. 11వ తేదీ కల్లా అన్ని ఫిర్యాదులు రియల్‌టైమ్‌లో పరిష్కరించాలన్నారు. ''గ్రామసభల్లో మాట్లాడే చిన్నారులను చూస్తే నాకు ముచ్చట వేస్తోంది. మన పిల్లలు ప్రపంచానికే నాయకత్వం వహించే పరిస్థితి తీసుకు రావాలి. గ్రామసభల్లో చిన్నారులతో మాట్లాడించి వారిలో సమస్యల పట్ల అవగాహన, సామాజిక బాధ్యత పెంచాలన్నారు. అభివృద్ధిపై ప్రజల్లో స్పష్టత ఉంది. ప్రజా ప్రతినిధులు, ప్రజా ఆకాంక్షలు నెరవేర్చే స్థాయికి చేరుకోవాలి. పిల్లలు ప్రపంచానికే నాయకత్వం వహించే పరిస్థితి రావాలి'' అని చంద్రబాబు పేర్కొన్నారు. జన్మభూమిలో సమస్యలపై అధికారుల స్పందన బాగుందా అని అడిగిన ప్రశ్నకు 75 శాతం అవునని, 25 శాతం లేదని సర్వేలో తేలిందని సీఎం వెల్లడించారు.

3వ రోజు టాప్-10 మండలాలు, గ్రామాలు

జన్మభూమి మూడో రోజున విశాఖ అర్బన్, చెరుకు పల్లి, విస్సన్నపేట, పెద్దాపురం, కడియం, యలమంచిలి, మొవ్వ, పెందుర్తి మండలాలు టాప్-10 జాబితాలో ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. మిగిలిన మండలాలు కూడా ఆ స్థాయికి చేరుకోవాలన్నారు. కాకుమాను, పాలకొల్లు, పొన్నూరు, మేడికొండూరు, రాజాం, ఉంగుటూరు, పెడన, కసింకోట, పామిడి గ్రామాలు మొదటి 10 గ్రామాల జాబితాలో ఉన్నాయన్నారు. మిగిలిన గ్రామాలు పోటీబడి జన్మభూమి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చంద్రబాబు కోరారు. టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులు సంజయ్‌గుప్తా, అహ్మద్‌బాబు, రామాంజనేయులు, కృష్ణమోహన్, మురళి, కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డెక్కితే సహించేది లేదు

సమస్యలపై వినతి పత్రాలు ఇవ్వండి: చంద్రబాబు

విశాఖపట్నం, జనవరి 5 (మనం న్యూస్): సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కినా, ఉద్యమానికి దిగినా సహించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. వినతి పత్రాల ద్వారా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని.. టెంట్‌లు వేసి ఉద్యమాలు, ధర్నాలు చేసేవారిని పట్టించుకునేది లేదని ఆయన స్పష్టం చేశారు. మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్న డిమాండుతో శుక్రవారం విశాఖ పోర్టు అతిథి గృహంలో ముఖ్యమంత్రిని విశాఖ నగర మత్స్యకార నేతలు కలిశారు. విశాఖ, శ్రీకాకుళం జిల్లాల్లో మత్స్యకారులు నాలుగు వారాలుగా ధర్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు మాట్లాడుతూ.. తనకు ఎప్పుడు ఏమి చేయాలో తెలుసని, రోడ్డెక్కి ఆందోళనలు చేస్తే సహించేదే లేదని మత్స్యకార నేతలను హెచ్చరించారు. ''ఏం తమాషాగా ఉందా? కులాల పేరిట సమాజంలో చిచ్చు పెడతారా? గతంలో తొమ్మిది సంవత్సరాలు నేను ముఖ్యమంత్రిగా పనిచేసినప్పుడు ఈ తరహా ఉద్యమాలే లేవు. ఇప్పుడెందుకు ఇలా రోడ్ల మీదకు వస్తున్నారు? ఇలా ఆందోళనలు చేసేవారి సమస్యలను అసలు పట్టించుకోను. గుర్తుంచుకోండి'' అంటూ క్లాస్ తీసుకొన్నారు. మత్స్యకార నేతలను తన వద్దకు తీసుకువచ్చిన విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్ కుమార్‌పై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ గురించి వినతిపత్రం అందజేసేందుకు వెళ్లిన తమపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేయడంతో మత్స్యకార నేతలు అయోమయం చెందారు.

ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం

- అధికారంలోకి రాగానే అమలు: జగన్
- చిత్తూరు జిల్లాకు చంద్రగ్రహణం పట్టింది
- ప్రజా సంకల్పయాత్రలో వైసీపీ అధినేత



చిత్తూరు, జనవరి 5: వైసీపీ అధికారంలోకి రాగానే ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా 53వ రోజు శుక్రవారం పుంగనూరు నియోజకవర్గం సదుంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ''నాలుగేళ్ల పాటు పింఛన్లు ఇవ్వకుండా అన్యాయం చేసిన చంద్రబాబుకు ఇప్పుడు జ్ఞానోదయం అయింది. పింఛన్లు ఇవ్వడం లేదన్న విషయం ఇప్పుడే తెలిసిందని డ్రామాలు ఆడుతున్నారు. నాలుగేళ్లలో ఏ ఒక్క హామీని అమలు చేయని వ్యక్తి తనకు ఓట్లు వేయకపోతే ప్రజలు సిగ్గుపడాలని చెప్పడం దుర్మార్గం. నాలుగేళ్లలో ఏమీ చేయకుండానే తనకు ఓటు వేయకపోతే ప్రజలు సిగ్గుపడాలని చంద్రబాబు అంటున్నారు. ఆయన మాటలు చూస్తే కళ్లు నెత్తికెక్కినట్లున్నాయి. ఓటు వేయకుంటే ప్రజలు సిగ్గుపడాలా? ఏమీ చేయకుండా ఓట్లు అడుగుతున్న చంద్రబాబు సిగ్గుపడాలా? ఏం చేశాడని చంద్రబాబుకు ఓట్లు వేయాలి. ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా దొరికిపోయి హోదాను అమ్మేసినందుకు ఓట్లు వేయాలా? 35 పడకల ఆస్పత్రికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 11 ఎకరాల సొంత భూమి ఇచ్చారు. ఆ స్థలంలో ఆస్పత్రిని కట్టడం లేదు. ఆ భూమిని తిరిగి ఇవ్వడం లేదు. ఆ భూమి ఇస్తే ఆస్పత్రి కట్టడానికి మేం సిద్ధం. పుంగనూరులో ఆర్టీసీ డిపో కట్టి ఏడున్నరేళ్లు అయినా బస్సులు ఇవ్వలేదు. ఇంత అన్యాయమైన పాలన ఎక్కడా ఉండదు. పార్టీ అధికారంలోకి రాగానే ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తాం. ఆర్టీసీని బ్రహ్మాండంగా నడిపిస్తాం'' అని జగన్ అన్నారు.

చంద్రబాబు మేలు మరవరాదు

- 2029 నాటికి ఏపీ నెంబర్ వన్
- 2050కి ప్రపంచంలో అగ్రగామి
- పాలకొల్లు జన్మభూమిలో లోకేశ్



పాలకొల్లు, జనవరి 5 (మనం న్యూస్): ప్రజల సంక్షేమానికి తెలుగుదేశం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అలుపెరుగని కృషి చేస్తున్నారని మంత్రి నారా లోకేశ్ అన్నారు. శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు రూరల్ పంచాయితీ పరిధిలోని సబ్బేవారిపేటలో నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గత ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్ రూ. 200 మాత్రమే ఇచ్చేదని, తాము అధికారంలోకి వచ్చాక 1000కి పెంచినట్టు లోకేశ్ తెలిపారు. నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని చెప్పారు. చంద్రబాబు చేసిన మేలును ఎప్పుడూ మరువరా దన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4133 అంగన్‌వాడీ భవనాలను నిర్మించామని, రూ.3449 కోట్లతో పాఠశాలలకు మౌలికవసతులు కల్పించామని, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. 5000 పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేశామని, రూ.80 కోట్లతో విద్యార్థులకు సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. వచ్చే డిసెంబరు నాటికి రాష్ట్రంలో ప్రతి ఇంటి ముందూ ఎల్ఈడీ విద్యుత్ దీపాలు వెలుగుతాయన్నారు. 2029 నాటికి దేశంలో ఆంధ్రప్రదేశ్‌ను నెంబర్ వన్‌గా, 2050 నాటికి ప్రపంచంలోనే అగ్రగామిగా ఉండాలన్నది తమ ఆశయమని, ఇది సాధించి తీరుతామని లోకేశ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, పితాని సత్యనారాయణ, కొల్లు రవీంద్ర, కె.ఎస్ జవహార్ తదితరులు పాల్గొన్నారు.

'సుగంధ' పరిమళం!

అన్నదాతకు 'ఈ-స్పైస్ బజార్' అండ.. విజయవాడ కేంద్రంగా ఏర్పాటు

- శిక్షణ.. ఆపై రైతులకు జీఏపీ సర్టిఫికెటు
- నేరుగా విదేశాలకు ఉత్పత్తుల ఎగుమతి
- కరివేపాకు, పసుపు, మిర్చికి ప్రాధాన్యం
- ఏపీతోపాటు తెలంగాణ రైతులకూ అవకాశం
- అనుసంధాన కర్తగా స్పైసెస్ బోర్డు
- ఇకపై ప్రైవేటు సంస్థలతో పనిలేదు

అమరావతి, జనవరి 5 (మనం ప్రతినిధి): రైతన్న జీవితంలో 'సుగంధ' పరిమళాలు.. ఆరుగాలం కష్టానికి నిజమైన విలువ రాబోతున్నాయి. ఆరుగాలం శ్రమించినా.. కనీస మద్దతు ధర రావడం లేదని కుంగిపోతున్న అన్నదాతకు స్పైసెస్ (సుగంధ ద్రవ్యాల) బోర్డు అండగా నిలవబోతోంది. రైతు పండించిన ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసేందుకు కొత్తగా ఈ-స్పైస్ బజార్ ఏర్పాటయింది. ఇది కేంద్ర ప్రభుత్వ సుగంధ ద్రవ్యాల సంస్థ ఆధ్వర్యంలో నడుస్తోంది. కరివేపాకు, పసుపు, మిర్చి పండించే రైతులు జీఏపీ గుర్తింపు ఇవ్వడం ద్వారా ప్రైవేటు వ్యక్తులతో పనిలేకుండా నేరుగా విదేశాలకు ఎగుమతి చేసుకునే అవకాశం కలగనుంది. వ్యవసాయంలో డిజిటల్ విప్లవాన్ని తీసుకొచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాయి. గ్రామీణ భారతదేశంలో మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ వాడకం ఎక్కువైంది. ఈ సాంకేతిక విప్లవాన్ని వ్యవసాయంలో ఉపయోగించి రైతులను రారాజులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం యోచిస్తోంది. దళారులతో సంబంధం లేకుండా రైతు పండించిన పంటను అంతర్జాతీయ మార్కెట్‌లో నేరుగా అమ్ముకునే విధంగా చేయటంతో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చు. ఈ వెసులుబాటును రైతన్నల చెంతకు తెచ్చేందుకు స్పైసెస్ బోర్డు విజయవాడలో స్పైసెస్ బజార్‌ను ఏర్పాటు చేసింది. ఇది ఈ ఏడాది నుంచి పనిచేస్తుంది. ఇప్పటి వరకూ రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను కార్పొరేట్ సంస్థలు, వ్యాపారులు, ఐటీసీ వంటి అంతర్జాతీయ సంస్థలు విదేశాలకు ఎగుమతులు చేస్తూ లబ్ధి పొందుతున్నాయి. ఇకపై రైతులే నేరుగా తమ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసుకునేందుకు వీలుగా స్పైసెస్ బోర్డు రైతులకు జీఏపీ గుర్తింపునిచ్చింది. గుంటూరు కేంద్రంగా పనిచేసే స్పైసెస్ బోర్డు దిగుమతిదారులకు, రైతులకు మధ్య అనుసంధానకర్తగా వ్యవహరించనుంది. రాష్ట్రం నుంచి విదేశాలకు ఎగుమతి చేసే పంట ఉత్పత్తుల్లో ఎక్కువగా పురుగు మందుల అవశేషాలు ఉండటం వల్ల విదేశీ దిగుమతిదారులు మన ఉత్పత్తులను తిప్పిపంపిస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పురుగు మందులు ఏఏ కాలాల్లో పంటపై పిచికారీ చేయాలి. ప్యాకింగ్ ఎలా చేయాలి. గ్రేడింగ్ తదితర అన్ని విషయాల్లో స్పైసెస్ బోర్డు శిక్షణ ఇచ్చింది. ఇలా శిక్షణ పొందిన రైతులకు సుగంధ ద్రవ్యాల బోర్డు గుంటూరు, ప్రకాశం జిల్లాలోని 700 మంది రైతులకు గ్లోబల్ జీఏపీ (గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టిసెస్) సర్టిఫికెట్లు ఇప్పించింది. ఏపీలో 21 వేల మంది మిర్చి రైతులను, 6 వేల మంది పసుపు రైతులను, మరికొందరు కరివేపాకు రైతులను ఈ-స్పైస్ బజార్‌లో అమ్ముకునే వెసులుబాటు కల్పించారు. తెలంగాణలోని వరంగల్, ఖమ్మంలోనూ 20 వేల మంది మిర్చి రైతులు, 5 వేల మంది పసుపు రైతులకు ఈ అవకాశం కల్పించింది. వీరికి కూడా త్వరలోనే జీఏపీ సర్టిఫికెట్లు ఇప్పించాలని బోర్డు నిర్ణయించింది. కార్పొరేట్ సంస్థలు అంతర్జాతీయ ఎగుమతుల కోసం చేసే పరీక్షలకు రూ.7 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ సర్టిఫికెట్లు ఉన్న రైతులకు స్పైసెస్ బోర్డులో రూ.500కే నాణ్యత పరీక్షలు చేస్తారు. దేశంలోని మార్కెట్ కన్నా ఈ-స్పైస్ బజార్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్‌లో రైతు పండించిన పంటకు 50 శాతం అదనపు ధర వస్తుంది. బోర్డు ఈ ఏడాది మిర్చి, కరివే పాకును ఎగుమతి చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. రైతు పండించిన పంట నాణ్యతను స్పైసెస్ బోర్డు పరీక్షిస్తుంది. ఆ తర్వాతనే ఆ పంట ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేయనుంది. గ్లోబల్ జీఏపీ సర్టిఫికెట్ ఉన్న రైతులకు నాణ్యత పరీక్షల వివరాలను ఎఫ్‌పీవో(ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్)ల ద్వారా ఈ-స్పైస్ బజార్‌లో ప్రదర్శిస్తారు. అంతర్జాతీయ సంస్థలు వీటిని కొనుగోలు చేయడానికి ఎఫ్‌పీవోల ద్వారా చర్చలు జరుపుతారు. రైతుల్లో కొంత ఇంగ్లీష్, హిందీ భాషలు తెలిసిన వారు ఎఫ్‌పీవోల్లో ఉంటారు. వీరు ప్రస్తుతం దేశీయ, విదేశీ మార్కెట్‌లో ఏ పంట ఉత్పత్తి ఎలా ఉంది? ప్రస్తుతం ఆ పంటకు మార్కెట్ ఎలా ఉంది? అనే విషయాలను అధికారులతో చర్చించిన తర్వాత ధరను ఆన్‌లైన్‌లో రైతులు నమోదు చేస్తారు. ఆయా సంస్థలు తాము ఎంత చెల్లించేది కూడా ఆన్‌లైన్‌లోనే నమోదు చేస్తారు. ఇద్దరి మధ్య స్పైసెస్ బోర్డు అనుసంధానకర్తగా ఉంటుంది. బేరం కుదిరితే విదేశీ సంస్థలు నేరుగా రైతు ఖాతాల్లోకి డబ్బు జమ చేస్తాయి.

వచ్చే ఏడాది నుంచి వాము, మిరియాలు

పంట పండించిన రైతు తన వస్తువుకు తానే ధరను నిర్ణయించే విధంగా దీనిని ఏర్పాటు చేసినట్లు స్పైసెస్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పీఎస్.శ్రీకంఠన్ థంపి వెల్లడించారు. కడప, కర్నూలు, అనంతపురం, ప్రకాశం జిల్లాల్లో పండే వాము, కొత్తిమీర, చింతపండు, విశాఖ జిల్లాలోని అరకు, పాడేరుల్లో ప్రత్యేకంగా లభించే మిరియాలనూ వచ్చే ఏడాది నుంచి ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు. ''రైతు తీసుకొచ్చిన పంటకు విదేశాలకు ఎగుమతి చేసే ముందు దానికి బార్ కోడ్ నమోదు చేస్తారు. ఈ బార్ కోడ్‌లో ఈ పంట ఏ రైతు, ఏ గ్రామంలో, ఎన్ని ఎకరాల్లో పండించారు? తదితర వివరాలన్నీ ఆన్‌లైన్‌లో తెలుస్తాయి. ఈ-స్పైస్ బజార్‌లో రెండు తెలుగు రాష్ట్రాల్లోని వేల మంది రైతులు నమోదయ్యారు. తొలి దశలో మిర్చి, కరివేపాకును గుంటూరు, ప్రకాశం జిల్లాల రైతులు ఎగుమతులు చేయబోతున్నారు. వరంగల్, ఖమ్మం జిల్లా రైతులు మిర్చి, పసుపును ఎగుమతి చేయనున్నారు'' అని ఆయన చెప్పారు.



సెన్సెక్స్	జనవరి 2018	5





పెరిగినవి	%	తగ్గినవి	%
యస్ బ్యాంకు	5.03	ఓఎన్‌జీసీ	-0.83
అదానీ పోర్ట్స్	3.71	ఐసీఐసీఐ బ్యాంకు	-0.70
భారతీ ఎయిర్‌టెల్	3.36	ఎస్‌బిఐ	-0.60
ఇండస్‌ఇండ్	3.26	విప్రో	-0.56
డాక్టర్ రెడ్డీస్	2.40	సన్ ఫార్మా	-0.39

నిఫ్టీ	జనవరి 2018	5



పెరిగినవి	%	తగ్గినవి	%
ఐడియా సెల్యులర్	10.76	భారతీ ఇన్‌ఫ్రా	-1.70
యస్ బ్యాంకు	4.97	హిందాల్కో	-1.22
బజాజ్ ఫైనాన్స్	3.45	యు.పి.ఎల్	-0.95
అదానీ పోర్ట్స్	3.40	హెచ్.పి.సి.ఎల్	-0.92
భారతీ ఎయిర్‌టెల్	3.25	బి.పి.సి.ఎల్	-0.77








'సెన్సెక్స్', 'నిఫ్టీ'ల సరికొత్త రికార్డు



ముంబయి: బొంబాయి స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బి.ఎస్.ఇ) 'సెన్సెక్స్', నేషనల్ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్.ఎస్.ఇ) సూచి 'నిఫ్టీ'లు రెండూ శుక్రవారంనాడు నూతన శిఖరాలను అధిరహించిన స్థితిలో ముగిసాయి. 'సెన్సెక్స్' 184.21 పాయింట్లు పుంజుకుని 34,153.85 పాయింట్ల వద్ద ముగిసింది. 'నిఫ్టీ' 54.05 పాయింట్లు పుంజుకుని 10,558.85 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ రెండు స్టాక్ సూచీలు ఈ వారం మొత్తంలో దాదాపు 0.3 శాతం పెరుగుదలను చూశాయి. సెన్సెక్స్ డిసెంబరు 27 నాటి (ఇంట్రాడే) రికార్డు 34,137.97 పాయింట్ల రికార్డును బద్దలుకొడుతూ ఆల్ టైమ్ రికార్డు 34,188.85 పాయింట్ల స్థాయిని తాకింది. నిఫ్టీ కూడా ఇంట్రాడేలో 10,566.10 పాయింట్ల గరిష్ఠ స్థాయిని చుంబించింది. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్ల నుంచి పటిష్టమైన సంకేతాలు రావడం, మార్కెట్లలోకి విదేశీ నిధుల ప్రవాహాలు కొనసాగడంతో టెక్నాలజీ, వినోదం, వినియోగ వస్తువులు, స్థిరాస్తుల రంగ కంపెనీల షేర్ల కొనుగోళ్ళు ముమ్మరంగా సాగాయి. అమెరికాలో ప్రైవేటు యాజమాన్యాలు ఊహించినదానికన్నా ఎక్కువగా డిసెంబరులో 2,50,000 ఉద్యోగాలు జోడించాయని గురువారంనాడు విడుదలైన నివేదిక ఒకటి వెల్లడించడంతో ఆసియాలో ఇతర స్టాక్ మార్కెట్లు కూడా రికార్డు స్థాయిలకు మరో అంగుళం చేరువయ్యాయి. డౌ జోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ చరిత్రలో మొట్టమొదటిసారిగా గురువారంనాడు 25,000 మైలురాయిని దాటింది. ఎస్.అండ్ పి. 500, నాస్‌డాక్ కాంపోజిట్ రెండూ రికార్డు నెలకొల్పుతూ గరిష్ఠ స్థాయిల్లో ముగిసాయి. బి.ఎస్.ఇ.లో ఆయిల్ అండ్ గ్యాస్, పి.ఎస్.యు.ల రంగ సూచీలను మినహాయిస్తే, మిగిలిన అన్ని రంగాల సూచీలు పెరిగిన స్థితిలోనే ముగిసాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులకు ప్రకటించిన పునర్ మూలధనీకరణ పథకంలో భాగంగా మొదట రూ. 80,000 కోట్లు సమకూర్చే ప్రతిపాదనకు లోక్‌సభ ఆమోదం తెలుపడంతో బ్యాంకింగ్ రంగ షేర్లు పెరిగాయి.



బలపడిన రూపాయి

డాలరుతో రూపాయి మారకం విలువ శుక్రవారంనాడు ఇంట్రాడేలో గత రెండున్నరేళ్ళలో ఎరుగనంతగా రూ. 63.31ని చూసింది. విదేశీ నిధుల రాక కొనసాగడంతో మార్కెట్‌లో లిక్విడిటీ మెరుగుపడింది. దేశీయ మదుపు సంస్థలు కొనుగోళ్ళు పెంచాయి. బ్యాంకులకు తిరిగి మూలధనాన్ని సమకూర్చే పనిలో ప్రభుత్వం ముందడుగు వేసింది. ఇవన్నీ ట్రేడింగ్ సెంటిమెంట్‌ను పెంపొందించాయి. బాండ్ల ద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకులకు రీక్యాపిటలైజేషన్ దిశగా, రూ. 80,000 కోట్ల అదనపు వ్యయానికి ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారంనాడు పార్లమెంట్ ఆమోదాన్ని కోరింది. తాత్కాలిక డాటా ప్రకారం, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు గురువారంనాడు రూ. 212.05 కోట్ల విలువైన షేర్లు కొనుగులో చేయగా, దేశీయ మదుపు సంస్థలు రూ. 325.24 కోట్ల విలువైన షేర్లు కొనుగోలు చేశాయి.



టాస్క్‌ఫోర్స్ సిఫార్సును వ్యతిరేకించిన 'అసోచామ్'


న్యూఢిల్లీ: కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు నేతృత్వంలోని టాస్క్‌ఫోర్స్ చేసిన సిఫార్సులపై భారత వాణిజ్య మండలుల సమాఖ్య ('అసోచామ్') ధ్వజమెత్తింది. రానున్న ఆగ్నేయ ఆసియా దేశాల సంఘం శిఖరాగ్ర సమావేశాలను దృష్టిలో ఉంచుకొని వాయు కాలుష్యాన్ని అదుపు చేసేందుకు ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతంలో పనిచేసే బొగ్గు పరిశ్రమ ఆధారిత పరిశ్రమలన్నింటినీ జనవరి 15 నుంచి పదిహేను రోజులపాటు మూసివేయాలని సి.పి.సి.బి. నేతృత్వంలోని టాస్క్‌ఫోర్స్ కోరింది. ''వాయు కాలుష్యాన్ని నియంత్రించడంలో పాలనా యంత్రాంగ వైఫల్యానికి, నిబంధనలు పాటిస్తున్న పరిశ్రమల విభాగాలు బలికాకూడదు. వాయు కాలుష్యానికి పరిశ్రమలు ఒక్కవాటినే బాధ్యులను చేయడం సబబుకాదు. ఢిల్లీ ఎన్.సి.ఆర్. ప్రాంతంలో వాయు కాలుష్యానికి కారణమవుతున్న ఇతర అంశాలు అనేకం ఉన్నాయి'' అని పర్యావరణం, అడవులు, వాతావరణ మార్పు శాఖ మంత్రి హర్ష వర్ధన్‌కు రాసిన లేఖలో 'అసోచామ్' పేర్కొంది. ఢిల్లీ-ఎన్.సి.ఆర్ ప్రాంతంలోనేకాదు, దేశవ్యాప్తంగా ఇతర నగరాలలో కూడా పరిశుద్ధమైన గాలి తగ్గిపోవడానికి నిర్మాణ కార్యకలాపాలు, రహదారులపై ధూళి, వాహనాల కాలుష్యం, వ్యర్థ పదార్థాల దహనం వంటి ఇతర అంశాలు కూడా ప్రధాన కారణమని 'అసోచామ్' అభిప్రాయపడింది. ''ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది చివరి త్రైమాసికం (జనవరి-మార్చి) కావడం వల్ల బ్యాంకర్లు/ఫైనాన్షియల్ సంస్థలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునే విధంగా పరిశ్రమలు ఉత్పత్తి/అమ్మకాల లక్ష్యాలను సాధించవలసి ఉంటుంది. వాటిని నెరవేర్చడంలో అవి విఫలమైతే, అవి భారీ మూల్యం చెల్లించుకోవలసి రావచ్చు'' అని 'అసోచామ్' ఉన్నత కార్యదర్శి డి.ఎస్. రావత్ చెప్పారు. ''పైగా, ఈ పరిశ్రమల కేంద్రాలను నిరర్థక ఆస్తులుగా ప్రకటిస్తే, కార్యకలాపాలను సాధారణ స్థితికి తీసుకురావడం చాలా కష్టం అవుతుంది. పరిశ్రమల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సి.పి.సి.బి. సిఫార్సులను ఉపసంహరించుకునే అంశాన్ని ప్రభుత్వం పరిశీలించి తీరాలి'' అని ఆయన అన్నారు.

డిజిటల్ చెల్లింపుల్లో వృద్ధి

కోల్‌కతా: భారతదేశంలో అన్ని రిటైల్ చెల్లింపులకు గొడుగు సంస్థ అయిన నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్.పి.సి.ఐ) దాని డిజిటల్ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యు.పి.ఐ)లో, 2017 డిసెంబరులో 145.46 మిలియన్ లావాదేవీలు నమోదైనట్లు ప్రకటించింది. గత ఏడాది జనవరిలో అవి కేవలం 4.15 మిలియన్ మేరకే ఉన్నాయి. లావాదేవీల విలువ కూడా 2017 జనవరిలో ఉన్న రూ. 1,568 కోట్ల నుంచి డిసెంబరులో రూ. 13,144 కోట్లకు పెరిగాయని ఎన్.పి.సి.ఐ. అధికారి ఒకరు చెప్పారు. 11.44 మిలియన్‌గా ఉన్న లావాదేవీల సంఖ్య గత ఏడాది జూలై తర్వాత, ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. సెప్టెంబర్, అక్టోబర్‌లలో 100 శాతం వృద్ధి కనిపించిన తర్వాత, 2017 నవంబర్, డిసెంబర్‌లలో వృద్ధి 40 శాతం దిగువన స్థిరపడింది. అయితే, ఎన్.పి.సి.ఐ. నిర్వహించే యు.పి.ఐ. యాప్ 'భీమ్' (భారత్ ఇంటర్‌ఫేస్ ఫర్ మనీ) ద్వారా లావాదేవీలు 90 లక్షల మేరకే ఉన్నాయి. 'భీమ్' యాప్‌ను మరింత మంది డౌన్‌లోడ్ చేసుకోవడాన్ని ప్రోత్సహించేందుకు రిఫరల్ ప్రమోషన్ రూపంలో రూ. 25 క్యాష్ బ్యాక్ ఆఫరు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. బ్యాంకు వివరాలు పంచుకోకుండానే ఖాతాల నుంచి నేరుగా డిజిటల్ చెల్లింపులు ఆఫరు చేసేందుకు బ్యాంకులు, ఫైనాన్షియల్ సంస్థలు కూడా ఎన్.పి.సి.ఐ.కి చెందిన యు.పి.ఐ. ప్లా ట్‌ఫాంను ఉపయోగించుకుంటున్నాయి. 2017 డిసెంబరు నాటికి యు.పి.ఐ. ప్లాట్‌ఫాంపై మొత్తం 67 బ్యాంకులున్నాయి. వివిధ బ్యాంకు ఖాతాలను అనుసంధానపరచే సదుపాయాన్ని కూడా యు.పి.ఐ. ఆధారిత యాప్ అందిస్తోంది.

నిర్మాణ రంగానికి 'సిమెంట్ రెగ్యులేటర్'

హైదరాబాద్: ''సిమెంట్ రెగ్యులేటర్''ను ఏర్పాటు చేయవలసిన అవసరం ఎంతగానో ఉందని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బి.ఎ.ఐ) పేర్కొంది. నిర్మాణ రంగం క్రమబద్ధమైన వృద్ధిని సాధించడానికి వీలుగా ఇతర సంస్కరణలు అమలు జరుపాలని, రెగ్యులేటరీ యంత్రాంగాన్ని నెలకొల్పాలని బి.ఎ.ఐ. కోరింది. నిర్మాణ రంగంలోని సబ్‌కాంట్రాక్టర్లపై ఇప్పటికీ 18 శాతం జి.ఎస్.టి.విధిస్తున్నారని, దాన్ని మరింత తగ్గించాలని బి.ఎ.ఐ. శుక్రవారం నాడిక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరింది. సిమెంట్ ధరలు నియంత్రించడంలో ''సిమెంట్ రెగ్యులేటరీ అథారిటీ'' సహాయపడుతుందని బి.ఎ.ఐ. ఛీఫ్ ప్యాట్రన్ బి. శీనయ్య చెప్పారు. సిమెంట్ ఉత్పత్తి సంస్థలు ఒక కార్టెల్‌గా ఏర్పడకుండా, అనుచిత విధానాలకు పాల్పడకుండా ఆ రెగ్యులేటరీతో నివారించవచ్చని ఆయన చెప్పారు. ''నిజానికి, ఒక రెగ్యులేటరీ యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తే, గృహ నిర్మాణ వ్యయాన్ని తగ్గించవచ్చు. చదరపుటడుగుకు రూ. 50 పోటీ ధరను తీసుకురావచ్చు. అందరికీ స్వగృహాలను అందుబాటులోకి తేవచ్చు. నిర్మాణ రంగంలోని సబ్ కాంట్రాక్టర్లపై ఇప్పటికీ 18 శాతం జి.ఎస్.టి. ఉంది. దాన్ని మరింత తగ్గించాలి. రియల్ ఎస్టేట్ ఇండస్ట్రీ జి.ఎస్.టి. 18 శాతంలో 6 శాతాన్ని భూమి విలువగా పరిగణిస్తున్నారు. కాంప్లెక్స్‌ల నిర్మాణం కింద భూమి విలువ తగ్గింపు, భూమి వాస్తవిక విలువ ఆధారంగా ఉండాలి లేదా రెడీ రెకనర్‌లో పేర్కొన్న విలువ ఆధారంగానైనా ఉండాలి'' అని శీనయ్య అన్నారు. అఖిల భారత బిల్డర్ల 28వ సమావేశాలు బెంగళూరులో జనవరి 19 నుంచి 21 వరకు జరుగుతాయని ఆ ప్రకటన తెలియజేసింది.



బి.ఎ.ఐ. ఛీఫ్ ప్యాట్రన్ బి. శీనయ్య

'అభ్యంతరాలుంటే చెప్పండి'

బేయర్-మోన్‌శాంటో సమ్మేళనంపై మొదలైన కాంపిటీషన్ కమిషన్ పరిశీలన

న్యూఢిల్లీ: ప్రతిపాదిత 66 బిలియన్ అమెరికన్ డాలర్ల బేయర్-మోన్‌శాంటో ఒప్పందంలోని సూక్ష్మ అంశాలను బహిరంగంగా పరిశీలించే పనిని నిష్పాక్షిక వర్తక విధానాలు అమలయ్యేట్లు చూసే నియంత్రణ సంస్థ కాంపిటీషన్ కమిషన్ శుక్రవారంనాడు ప్రారంభించింది. ఒప్పందం కార్యరూపం ధరిస్తే ప్రపంచంలో అతిపెద్ద విత్తన, క్రిమి సంహారక మందుల సంస్థ ఆవిర్భవించినట్లు అవుతుంది. బేయర్-మోన్‌శాంటోల విలీనం ప్రతికూలం ప్రభావం చూపుతుందని భావించిన వ్యక్తులు లేదా సంస్థలు తమ అభ్యంతరాలకు మద్దతుగా తగిన ఆధారాలు జతపరచి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సి.సి.ఐ)కి 15 రోజులలోగా సమర్పించవలసి ఉంటుంది. ''ఆధారాలు లేని అభ్యంతరాలను కమిషన్ పరిశీలించకపోవచ్చు''నని సి.సి.ఐ. ఒక బహిరంగ ప్రకటనలో తెలిపింది. ఆ రెండు సంస్థల ''సమ్మేళనం పోటీపై చెప్పుకోతగ్గ ప్రతికూల ప్రభావం పడుతుందని లేదా పడవచ్చుని ప్రాథమిక అభిప్రాయం ఉందా'' అనే అంశాన్ని నిగ్గు తేల్చేందుకు ఆ ఒప్పందాన్ని సి.సి.ఐ. ప్రజల ముందు చర్చకు పెట్టింది. భారతదేశంలో చెప్పుకోతగ్గ ఉనికి ఉన్న బేయర్-మోన్‌శాంటోలు తమ మధ్య ఒప్పందం గురించి 2016 సెప్టెంబరులో ప్రకటించాయి. మోన్‌శాంటోలో మొత్తం వాటాను బేయర్ కైవసం చేసుకునే విధంగా ఆ రెండు సంస్థల మధ్య ఒక ఖరారు ఒప్పందం, విలీన ప్రణాళిక 2016 సెప్టెంబరు 14న కుదిరాయి. ఈ ప్రతిపాదిత సమ్మేళనం ఫలితంగా, పూర్తిగా బేయర్ యాజమాన్యంలో ఉన్న అనుబంధ సంస్థగా మోన్‌శాంటో మిగులుతుంది. ఫార్మాస్యూటికల్స్, పంట విజ్ఞానం, వినియోగదార్ల ఆరోగ్య, పశువుల ఆరోగ్య విభాగాలలో బేయర్‌కు విస్తృతమైన స్థాయిలో ఉత్పత్తులున్నాయి. మోన్‌శాంటో వ్యవసాయ కంపెనీ. వ్యవసాయ ఉత్పత్తి, కూరగాయల విత్తనాలు, గుల్మ సంహారక, కలుపు మొక్కల నియంత్రణ విభాగాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది. ''ప్రతిపాదిత సమ్మేళనం వల్ల ఓవర్‌ల్యాప్ ప్రాడక్టులు వేటిలోనూ పోటీకి సంబంధించిన ఆందోళనలు ఏవీ తలెత్తవని 2016 అక్టోబరులో సి.సి.ఐ. వద్ద దాఖలు చేసిన నోటీసులో బేయర్ పేర్కొంది. సంస్థలు రెండూ పరస్పర ప్రయోజనదాయక, వ్యాపార విధానాలలో ఉన్నాయి. కాంప్లిమెంటరీల ఫలితంగా ఉత్పన్నమయ్యే సహ ఉత్తేజనాల నుంచి లాభం పొందాలని ప్రతిపాదిత సమ్మేళనం భావిస్తోంది. మోన్‌శాంటోతో సమ్మేళనం త్వరలోనే కార్యరూపం ధరిస్తుందని బేయర్ ఆశిస్తోంది.



'మేరా హోర్డింగ్స్' యాప్

హైదరాబాద్: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లోని 'హైదరాబాద్ హంటర్స్' జట్టు ఆటగాళ్లతో కలసి స్పెయిన్‌కు చెందిన మేటి షట్లర్ కరొలినా మారిన్ 'మేరా హోర్డింగ్స్'ను శుక్రవారం నాడిక్కడ ప్రారంభించారు. ఇది బిల్‌బోర్డ్ అడ్వర్టయిజింగ్ మార్కెట్ ప్రదేశ మొబైల్ యాప్. ఖాళీగా ఉన్న తమ బిల్‌బోర్డ్/హోర్డింగులను ఆన్‌లైన్‌లో విక్రయించేందు కు సైనప్ కావడానికి, రిజిస్టరవడానికి అనేక హోర్డింగ్ కంపెనీలు, ఏజన్సీలకు యాప్ వీలు కల్పించింది. ఔట్‌డోర్ ఆన్‌లైన్ బుకింగ్ కంపెనీ మేరా హోల్డింగ్స్ స్థానిక క్రికెట్ లీగ్‌ల నుంచి ఇండియన్ ప్రీమియర్ లీగ్ వరకు స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లకు అధికారిక భాగస్వామిగా ఉంది. బి.సి.సి.ఐ, ఐ.పి.ఎల్, ప్రొ కబడ్డీ లీగ్‌లకు కూడా అది అధికారిక ఔట్‌డోర్ భాగస్వామిగా ఉంది. హైదరాబాద్ హంటర్స్ జట్టుకు మద్దతు ఇస్తూ, మేరా హోర్డింగ్స్ కంపెనీ హైదరాబాద్, ముంబయి, బెంగళూరు, చెన్నై, లఖ్‌నవూ, అహ్మదాబాద్, ఢిల్లీ, గువాహటిలలో పెద్దయెత్తున ఔట్‌డోర్ అడ్వర్టయిజింగ్ కాంపైన్ ప్రారంభించినట్లు కంపెనీ స్థాపకుడు, చైర్మన్ సాయికృష్ణ గజవెల్లి చెప్పారు. 'శ్మాష్ ద హౌస్ డౌన్' అని ఆటగాళ్ళు కసిగా అరుస్తున్న చిత్రాలతో హోర్డింగులను ఏర్పాటు చేసినట్లు సాయికృష్ణ చెప్పారు.

హోరెత్తిన హోండా అమ్మకాలు

న్యూఢిల్లీ: దేశంలో గత 17 ఏళ్ళుగా ఉన్న హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్.ఎం.ఎస్.ఐ) మొట్టమొదటిసారిగా ఒకే ఏడాదిలో 50 లక్షల యూనిట్ల అమ్మకాలు సాధించిన మైలురాయిని దాటింది. గత ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు 57,94,893 యూనిట్లు విక్రయించినట్లు హోండా ప్రకటించింది. ద్విచక్ర వాహనాల తయారీలో దేశంలో రెండవ అతి పెద్ద కంపెనీ అయిన హోండా 2016 క్యాలెండర్ సంవత్సరంలో 49,88,512 ద్విచక్ర వాహనాలను విక్రయించింది. ''హోండా మొదటిసారిగా 2017లో యాభై లక్షల యూనిట్ల అమ్మకాల మైలురాయిని దాటడానికి ఉత్పాదక సామర్థ్యాన్ని కొత్తగా విస్తరించుకోవడం, కొత్తగా మూడు బండ్లను ప్రవేశపెట్టడం, టైర్ టూ, టైర్ త్రీ మార్కెట్లలోకి నెట్‌వర్క్ చొచ్చుకుపోవడం పెరగడం దోహదపడ్డాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో అరవై లక్షల యూనిట్ల అమ్మకాల లక్ష్యాన్ని సాధించగలమని మేం ధీమాతో ఉన్నాం'' అని హెచ్.ఎం.ఎస్.ఐ. అమ్మకాలు-మార్కెటింగ్ విభాగ సీనియర్ ఉపాధ్యక్షుడు యద్వీందర్ సింగ్ గులేరియా చెప్పారు. టూవీలర్ల పరిశ్రమకు 2017 అవాంతరాల ఏడాదిగానే గడిచిందని ఆయన అన్నారు. సంప్రదాయసిద్ధంగా మోటారుసైకిల్ ప్రాబల్యం వహిస్తున్న రాష్ట్రాలలో కూడా స్కూటర్లు ప్రాచుర్యం పొందడం పెరుగుతోందని ఆయన చెప్పారు. డిసెంబర్‌లోనూ కంపెనీ మంచి డిమాండ్‌నే చూసింది. కంపెనీ 2016 డిసెంబరులో 2,05,158 యూనిట్లను విక్రయిస్తే, 2017 డిసెంబరులో 3,63,226 యూనిట్లను విక్రయించగలిగింది. యాక్టివా నేతృత్వంలో హోండా స్కూటర్లు 2016 డిసెంబరులో 1,51,758 అమ్ముడుపోతే, 2017 డిసెంబరులో 2,38,818 స్కూటర్లు అమ్ముడుపోయాయి. సి.బి.షైన్ 125 సి.సి. మోటార్‌సైకిల్ 2016లో 53,400 యూనిట్లు అమ్ముడుపోతే, 2017లో ఏకంగా 1,24,408 యూనిట్లు అమ్ముడయ్యాయి.



ఇంటి బడ్జెట్ వేయండి ఇలా?



పన్ను భారం ఎంత తగ్గుతుంది?.. ఇలా ఏవో కొన్ని లెక్కలు వేసుకోవడం చేస్తుంటాం. కానీ మన ఇంటికీ ఒక బడ్జెట్ ఉంటుంది. దానికీ ఒక లెక్క ఉంటుంది.. అనే విషయం పెద్దగా పట్టించుకోం. పాలకులు చేసే బడ్జెట్ కసరత్తుల్లో రాజకీయ ఎత్తుగడలు, తిమ్మిని బమ్మిని చేయడాలు ఉండొచ్చు. కానీ మన సొంతింటి బడ్జెట్‌లో అలా జిమ్మిక్కులు చేయడానికి కుదరదు. కచ్చితంగా ఓ ప్రణాళిక ఉండాలి. ఒకప్పుడు కుటుంబంలో ఒకరే సంపాదనపరులై ఉండే వారు. ఇప్పుడు కుటుంబంలో ఆడామగ అనే తేడా లేకుండా ఆర్జించే పరిస్థితులే ఉన్నాయి. కుటుంబ సంపాదనతో పాటే అవసరాలూ బాగా పెరుగుతున్నాయి. అందుకే, అవసరాలను తీర్చుకుంటూనే భవిష్యత్తు ఖర్చులనూ అంచనా వేసుకు నేలా ఇంటి బడ్జెట్ రూపకల్పన జరగాలి. ఇప్పుడు ఎంత ఖర్చు చేస్తున్నామనే దానికి కచ్చితమైన లెక్కలు ఉండాలి. కేంద్ర బడ్జెట్ ప్రభావం ప్రతి పౌరుడిపై ప్రత్యక్షంగానో.. పరోక్షంగానో ఉంటుంది. దీర్ఘకాలంలో ఆర్థికాభివృద్ధికి ఇదే కీలకం. మన ఇంటికీ ఇదే సూత్రం వర్తిస్తుంది. సొంతిల్లు సమకూర్చు కోవడం, పిల్లల ఉన్నత చదువులు, వారి వివాహాలు, పదవీ విరమణ ప్రణాళికలూ.. ఇలా దీర్ఘకాలిక లక్ష్యాలూ.. లేదా కారు కొనడం, విదేశీ విహార యాత్రల్లాంటి స్వల్పకాలిక లక్ష్యాలు.. వీటన్నింటినీ నెరవేర్చుకోవడానికి మన దగ్గరున్న ఆర్థిక వనరులను ఎంత సమర్థంగా వినియోగించుకోవాలో తెలియాలి. దీన్నే ఇంటి బడ్జెట్ ప్రణాళికగా చెప్పుకోవచ్చు. సొమ్ముకు సంబంధించి మీరు తీసుకునే ప్రతి నిర్ణయమూ ఇతర ఆర్థిక విషయాల్లో మీ కుటుంబ సభ్యులందరి జీవితాన్నీ ప్రభావితం చేస్తుంది. పార్లమెంటులో బడ్జెట్ ఆమోదం పొందాలంటే దానిమీద విస్తృత చర్చ జరుగుతుంది. మెజారిటీ సభ్యుల ఆమోదం పొందిన తర్వాతే అది అమల్లోకి వస్తుంది. మీ ఇంటిలో కూడా దీన్ని పాటించండి.



వేసిన బడ్జెట్‌ను అందరికీ వివరించండి. మార్పుచేర్పులు అవసరమైతే చేయండి. దీనివల్ల కుటుంబ సభ్యులందరికీ ఒక దిశానిర్దేశం ఏర్పడుతుంది. ఎప్పటికప్పుడు పరిస్థితుల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా లేని వాటిని సర్దుబాటు చేసుకోవచ్చు. ఫలితంగా ఎలాంటి ఒత్తిళ్లూ ఒడిదుడుకులూ లేని జీవితాన్ని సొంతం చేసుకోవచ్చు. ప్రణాళిక ఏదైనా రూపకల్పన చేయడంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే ఎంత మేరకు ఖర్చు చేయవచ్చో కచ్చితంగా తెలుస్తుంది. మన మనసును కూడా దానికి సిద్ధం చేసుకోవచ్చు. కొత్తలో పరిమితికి లోబడే ఖర్చు చేయాలంటే కొంత ఇబ్బందే. అయితే, ఏదైనా సాధన మీద అలవడుతుంది. ప్రతి నెలా కొంత మొత్తం పొదుపు చేస్తున్నాను. భవిష్య నిధిలో జమ చేస్తున్నాను. బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పోస్టాఫీసు పథకాలు, కొన్ని మ్యూచువల్ ఫండ్ పథకాల్లో పెట్టుబడి పెడుతున్నాను'' ఇలా ఓ పద్ధతి ప్రకారమే చేస్తున్నాం కదా! ఇదంతా బడ్జెట్‌లో భాగమే కదా? అని అడగొచ్చు! అయితే, పెట్టుబడి పెట్టడం ఒక్కటే ఆర్థిక ప్రణాళిక కాదు. ఇలాంటి పెట్టుబడులకు ఏటా కొంత కష్టార్జితాన్ని కేటాయించడమే బడ్జెట్ అనీ అనలేము. ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గరికి వస్తుందనగా హడావిడిగా మదుపు చేయడం చాలామందికి అలవాటు.

ఇలా ఆదా చేస్తే?



ఏదైనా తినేటప్పుడు.. పంటి కింద చిన్నపాటి రాయిపడితే.. ఎలాంటి బాధ కలుగుతుందో.. ఆదాయంలోంచి కొంత మొత్తాన్ని పన్ను చెల్లింపు రూపంలో కట్టాలంటే.. అంతే బాధపడతుంటారు చాలామంది. కానీ ఆర్జించే ఆదాయం, సంపాదనలోంచి.. వార్షిక పన్ను చెల్లించడం అనేది అందరి గురుతర బాధ్యత. ప్రతీ ఒక్కరూ క్రమం తప్పకుండా తమ సంపాదన ఆధారంగా.. పన్ను చెల్లింపులు చేయాల్సిందే. అయితే, కాస్తంత ప్రణాళికబద్ధంగా ఉంటే.. పన్నుభారం పడకుండా జాగ్రత్తపడొచ్చు. పన్ను భారాన్ని తగ్గించుకోడానికి మేలైన పొదుపు పథకాలూ అందుబాటులో ఉన్నాయి. అవి ఏంటి? ఎందులో పెట్టుబడి పెట్టాలి? అనేదే మనకు తెలియాలి. ఆదాయపు పన్ను తగ్గించుకోవడానికి హడావిడిగా తీసుకునే నిర?యాలు ఎప్పుడూ మంచి ఫలితాలు ఇవ్వవు. ఆచితూచి పెట్టుబడులు పెట్టాలి. పొదుపు ప్రణాళికలో పన్ను ఆదా చేసుకోవడమూ ఒక భాగం. అయితే, పన్ను ఆదా పెట్టుబడి పథకాలే ఆర్థిక ప్రణాళిక అనిపించుకోదు. ప్రతి పెట్టుబడి పథకం వెనకా ఒక లక్ష్యం ఉండాలి. అది మనకు సాధ్యమైనన్ని విధాలుగా ఉపయోగపడాలి. అందులో పన్ను ఆదా అనేది అదనపు సౌకర్యం కావాలి. పెట్టిన మొత్తానికి మినహాయింపు పొందుతూనే.. సంపద వ ద్ధికి కూడా ఆస్కారం ఇవ్వాలి. వయసు, జీవనశైలిని బట్టి పన్ను ఆదా పథకాలను ఎంచుకోవాలి. అప్పుడే ఫలితాలు బాగుంటాయి. ఉద్యోగం, ఉపాధి, వ్యాపారం ఇలా ఏదో ఒక రూపంలో సంపాదన మొదలైనప్పటి నుంచే వీలైనంత వరకూ పన్ను పడకుండా చూసుకోవాలి. చిన్న వయసులో ఉంటారు కాబట్టి, కాస్త నష్టభయం ఉన్నా తట్టుకునే శక్తి ఉంటుంది.

అందుకని, పెట్టుబడులు పెట్టి, సాధ్యమైనంత వరకూ పన్ను మినహాయింపులు పొందాలి. స్వల్ప వ్యవధి ఉండే ఈక్విటీ ఆధారిత పొదుపు పథకాలను (ఈఎల్‌ఎస్‌ఎస్) పరిశీలించవచ్చు. పెట్టుబడిని కనీసం మూడేళ్లపాటు కదపకుండా ఉంచితే చాలు. సమీప భవిష్యత్తులో సొమ్ము అవసరం లేదనుకొనేవారికి ఇవి చక్కగా సరిపోతాయి.

భారత్‌ను చూసి నేర్చుకోండి

పాక్ సెలెక్టర్లకు బట్, అక్మల్ సూచన



కరాచీ: జాతీయ క్రికెట్ జట్టును ఎలా ఎంపిక చేయాలో భారత్‌ను చూసి నేర్చుకోమని పాకిస్థాన్ మాజీ కెప్టెన్ సల్మాన్ బట్, జట్టుకు దూరమైన వికెట్ కీపర్/బ్యాట్స్‌మన్ కమ్రాన్ అక్మల్ తమ సెలెక్టర్లకు సూచించారు. తమ సెలెక్టర్లతో పోలిస్తే.. భారత సెలెక్షన్ కమిటీ తమ క్రికెటర్లకు ఎక్కువ అవకాశాలిస్తున్నారని బట్, కమ్రన్ అభిప్రాయపడ్డారు. 'టాప్ లెవెల్ క్రికెట్ ఆడేందుకు భారత సెలెక్టర్లు తమ క్రికెటర్లకు అవకాశాలు కల్పిస్తూనే ఉన్నారు. ఒక దశలో రోహిత్ శర్మ సగటు 25, 30 ఉండేది. కానీ అతనికి మరిన్ని అవకాశాలు కల్పించడం వల్ల ఇప్పుడు రోహిత్ శర్మ ప్రపంచ శ్రేణి క్రికెటర్ అయ్యాడు' అని బట్ అన్నాడు. 'ఇన్నింగ్స్‌ను మెరుగు పరచుకుని దీర్ఘ కాలం క్రికెట్‌లో కొనసాగేందుకు దేశవాళీ క్రికెట్ పిచ్‌లు కావాలి. క్రికెటర్లు అంతర్జాతీయ క్రికెట్‌కు సిద్ధపడేందుకు, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఇదొక్కటే మార్గం' అని కమ్రన్ చెప్పాడు.



కపిల్ సరసన భువనేశ్వర్

కేప్‌టౌన్: సౌతాఫ్రికాతో శుక్రవారమిక్కడ ప్రారంభమైన తొలి టెస్టు మ్యాచ్ తొలి రోజు కండిషన్స్‌ను టీమిండియా ఫాస్ట్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ చక్కగా వినియోగించు కున్నాడు. ముగ్గురు కీలకమైన బ్యాట్స్‌మెన్‌ను వెంట వెంటనే పెవిలియన్ పంపి టీమిండియాకు శుభారంభాన్నిచ్చాడు. తొలి ఓవర్లోనే ఓపెనర్ డీన్ ఎల్గార్‌ను డకౌట్ చేయడంతో ప్రొటీస్ వికెట్ల పతనం ప్రారంభమైంది. దీంతో ఈ మీడియం పేసర్ భువనేశ్వర్ దిగ్గజ బౌలర్ కపిల్ దేవ్ సరసన నిలిచాడు. 1992 తర్వాత ఈ ఘనత సాధించిన రెండో బౌలర్‌గా రికార్డుల్లోకెక్కాడు. 1992-93 చారిత్రాత్మక సౌతాఫ్రికా పర్యటనలో ఇదే సౌతాఫ్రికా జట్టుపై కపిల్ దేవ్ తొలి ఓవర్లోనే తొలి వికెట్ తీశారు. డర్మన్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో జిమ్మీ కుక్‌ను కపిల్ తొలి బంతికే అవుట్ చేశారు. ఇప్పుడు అవుట్‌సైడ్ ఆఫ్ స్టంప్ మీదుగా భువీ వేసిన బంతికి ఎల్గార్ వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహాకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు.

టెస్టుల్లో బుమ్రా అరంగేట్రం



కేప్‌టౌన్: అందరూ ఎంతో ఆసక్తి ఎదురు చూస్తున్న ఇండియా, సౌతాఫ్రికా తొలి టెస్టు మ్యాచ్‌కు కొద్ది నిమిషాల ముందు జస్‌ప్రీత్ బుమ్రాకు టెస్టు క్యాప్ అందించినట్టు బీసీసీఐ ట్విట్టర్‌లో పేర్కొంది. బౌలింగ్ కాంబినేషన్‌పై ఈ మ్యాచ్‌కు ముందు జరిగిన చర్చలో ఇషాంత్ శర్మ, మహ్మద్ షమీ, భువనేశ్వర్ కుమార్, ఉమేష్ యాదవ్‌లపై అందరి దృష్టి ఉండింది. ఆరో నంబర్ స్థానానికి ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా లేదా రోహిత్ శర్మను మేనేజ్‌మెంట్ తీసుకుంటుందని అనుకున్నారు. మరోవైపు వైరల్ ఫీవర్‌తో జడేజా బాధపడుతున్నాడని కూడా వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలో బుమ్రా గురించి పెద్దగా చర్చ జరగలేదు. అతనికి టెస్టు బౌలర్‌గా తగినంత సామర్థ్యం లేదన్న కారణాలు తెరపైకి వచ్చాయి. టీ20ల్లో నంబర్ వన్‌గా, వన్డేలో మూడో ర్యాంక్ క్రికెటర్‌గా, నిర్ణీత ఓవర్లలో కీలకమైన బౌలర్‌గా కొనసాగుతున్న బుమ్రా తొలిసారి అంతర్జాతీయ టెస్టు మ్యాచ్ ఆడాడు. టాస్ సమయంలో విరాట్ కోహ్లీ మాట్లాడుతూ.. ఇషాంత్‌కు బదులు 24 ఏళ్ల బుమ్రాను తుది జట్టులోకి తీసుకున్నామని చెప్పాడు. ముగ్గురు బౌలర్ల జట్టు ప్రణాళికలో భువనేశ్వర్, షమీ ఉన్నారని తెలిపాడు. స్పిన్నర్‌గా అశ్విన్‌కు, ఆల్ రౌండర్‌గా హార్దిక్ పాండ్యాకు జట్టులో చోటు దక్కింది.

సౌతాఫ్రికా 286 ఆలౌట్

సత్తా చాటిన భారత బౌలర్లు • భువనేశ్వర్‌కు 4 వికెట్లు • టీమిండియా 28/3 • గాంధీ-మండేలా ఫ్రీడం సిరీస్ తొలి టెస్టు

కేప్‌టౌన్: గాంధీ-మండేలా ఫ్రీడం టెస్టు సిరీస్ అనుకున్నట్టుగానే ఇండియా, సౌతాఫ్రికా మధ్య తొలి టెస్టు అత్యంత ఉత్కంఠ భరితంగా ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సౌతాఫ్రికాను భారత బౌలర్లు ఆరంభంలోనే దెబ్బ తీశారు. ముఖ్యంగా భువనేశ్వర్ వరుసగా తన మూడు ఓవర్లలో మూడు వికెట్లు తీశాడు. ఆ తర్వాత డివిలియర్స్, ప్లెసిస్ కాస్త ప్రతిఘటించినప్పటికీ చివరికి ప్రొటీస్‌ను 286 పరుగులకే టీమిండియా కట్టడి చేయగలిగింది. తొలి రోజు ఆటలో టీమిండియా బౌలర్లందరూ సక్సెస్ అయ్యారు. కానీ తొలి రోజే ఆఫ్ స్పిన్నర్ అశ్విన్‌కు రెండు వికెట్లు పడడం ఆశ్యర్యాన్ని కలిగించింది. అయితే చివరి 11 ఓవర్లు ఆడేందుకు బరిలోకి దిగిన టీమిండియా సౌతాఫ్రికా ఫాస్ట్ బౌలింగ్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవడంలో విఫలమైంది. ముగ్గురు టాపార్డర్ బ్యాట్స్‌మెన్ తక్కువ పరుగులకే వెనుదిరిగారు. దీంతో తొలి రోజు సొంత గడ్డపై సౌతాఫ్రికా తక్కువ పరుగులకు అవుటైనప్పుడు.. ఇప్పటికే 3 వికెట్లు కోల్పోయిన మన వాళ్లు రెండో రోజు ఎన్ని పరుగులు చేస్తారు? అన్న ఒక భయం భారత క్రికెట్ అభిమానుల్లో నెలకొంది. ఏది ఏమైనా తొలి రోజు ఆట ముగిసే సమ యానికి టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 28 పరుగులు చేసింది. పుజారా, రోహిత్ క్రీజులో ఉన్నారు.



తడబడి ఆనక నిలబడి

భువనేశ్వర్ వేసిన అద్భుతమైన బౌలింగ్ వల్ల సౌతాఫ్రికా జట్టు ఆరంభంలోనే ఇబ్బంది పడింది. భువనేశ్వర్ మూడు ఓవర్లలో మూడు వికెట్లు తీయడంతో ప్రొటీస్ 12 పరుగులకు 3 వికెట్లు కోల్పోయింది. తర్వాత డివిలియర్స్, ఫాఫ్ డు ప్లెసిస్ పోరాడి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. దీంతో భోజన విరామ సమయానికి సౌతాఫ్రికా 3 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. మ్యాచ్‌కు ముందు సౌతాఫ్రికా టీమ్ సెలెక్షన్‌పై పెద్ద చర్చ జరిగింది. చివరికి నాలుగురు సీమ్ బౌలర్లతో బరిలోకి దిగాలని నిర్ణయించుకున్నారు. దీంతో 2016 నవంబర్‌లో చివరిసారిగా టెస్టు మ్యాచ్ ఆడిన పేస్ బౌలర్ డేల్ స్టెయిన్‌ను తుది జట్టులోకి తీసుకున్నారు. స్టెయిన్‌తో పాటు కగిసొ రబాడ, మోర్నే మోర్కెల్, వెర్నాన్ ఫిలాండ్ పేస్ బౌలింగ్ అటాక్‌లో ఉన్నారు. పిచ్ గ్రీన్ టాప్‌తో ఉన్నప్పటికీ టాస్ గెలిచిన ప్రొటీస్ కెప్టెన్ డు ప్లెసిస్ బ్యాటింగ్ ఎంచుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

ఆధునిక క్రికెట్‌లో తొలుత బ్యాటింగ్ చేయడం పాజిటివ్ సంకేతాలను ఇస్తోంది. కానీ సౌతాఫ్రికా జట్టు కూర్పు, ఈ మ్యాచ్‌కు గ్రౌండ్స్‌మన్ ఇవాన్ ఫ్లింగ్ సిద్ధం చేసిన పిచ్‌ను బట్టి కొందరు తొలుత బ్యాటింగ్ నిర్ణయంపై కనుబొమలు ఎగురవేశారు. వారం రోజుల ఉత్కంఠ అనంతరం ప్రారంభమైన ఈ మ్యాచ్ తొలి ఓవర్లోని మూడో బంతికి భువనేశ్వర్ ఓపెనర్ డీన్ ఎల్గార్ (0)ను అవుట్ చేశాడు. తర్వాత ఐడెన్ మార్క్రమ్ (5) తొలిసారి భువీ బంతిని ఎదుర్కోలేక తన టెస్టు కెరీర్‌లో ఎల్‌బిడబ్ల్యూ అవుటయ్యాడు. తర్వాత వన్‌డౌన్ ప్లేయర్ హాషీం ఆమ్లా (3) కూడా వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో ఏబీ డివిలియర్స్, ఫాఫ్ డు ప్లెసిస్ బ్యాటింగ్‌కు దిగారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో ఈ సీనియర్ల అవసరం జట్టుకు ఎంతో అవసరం. మ్యాచ్ తొలి గంటలో పిచ్ తన ప్రభావం చూపుతున్నప్పటికీ వీరిద్దరూ ఎంతో ధైర్యంగా ఆడుతూ జట్టును మళ్లీ ట్రాక్ మీదికి తెచ్చారు. భువీ వేసిన ఒక ఓవర్లో డివిలియర్స్ 17 పరుగులు సాధించాడు. మరో ఎండ్‌లో ఉన్న ప్లెసిస్ కూడా దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. వీరిద్దరూ 63 బంతుల్లో 50 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. వీరిద్దరూ మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడుతూ భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. అయితే 33వ ఓవర్లో చివరి బంతికి అర్ధ సెంచరీ పూర్తి చేసిన డివిలియర్స్ అవుట్ కావడంతో 114 పరుగుల వద్ద వీరి భాగస్వామ్యానికి తెరపడింది. మరో రెండు ఓవర్ల తర్వాత ఫాఫ్ డు ప్లెసిస్ కూడా ఆవుట్ కావడంతో భారత బౌలర్లు ఊపిరి పీల్చుకున్నారు. తర్వాత వచ్చిన క్వింటన్ డికాక్, ఫిలాండర్ కొంత మేరకు జట్టుకు తమ వంతు సహకారం అందించారు. మహరాజ కూడా జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించేందుకు ప్రయత్నించాడు. కానీ దురదృష్టవశాత్తు రనౌటై పెవిలియన్ దారిపట్టాడు. తర్వాత రబాడ కూడా ఫరవాలేదనిపించుకున్నాడు. చివరికి మోర్కో మోర్కెల్ ఎల్‌బిడబ్ల్యూగా వెనుదిరిగడంతో సౌతాఫ్రికా ఇన్నింగ్స్ ముగిసింది.

తర్వాత తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కోహ్లీ సేన కూడా ఆరంభంలోనే దెబ్బతినింది. 5వ ఓవర్లో ఫిలాండ్ వేసిన నాలుగో బంతికి మురళీ విజయ్ అవుటయ్యాడు. తర్వాత పుజారా వచ్చాడు. కానీ మరుసటి ఓవర్లో డేల్ స్టేయిన్ వేసిన రెండో బంతికి ధావన్ అతనికే క్యాచ్ ఇచ్చి పెవిలియన్ దారిపట్టాడు. వన్‌డౌన్‌లో వచ్చి కెప్టెన్ విరాట్ కోహ్లీ కూడా క్రీజులో నిలవలేకపోయాడు. దీంతో 27 పరుగులకే టీమిండియా 3 వికెట్లు కోల్పోయింది. తర్వాత రోహిత్ శర్మ బ్యాటింగ్‌కు దిగాడు.

స్కోరుబోర్డు

సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్: డీన్ ఎల్గార్ (సి) సాహా (బి) భువనేశ్వర్ 0, ఐడెన్ మార్క్రమ్ ఎల్‌బిడబ్ల్యూ (బి) భువనేశ్వర్ 5, హాషీం ఆమ్లా (సి) సాహా (బి) భువనేశ్వర్ 3, ఏబీ డివిలియర్స్ (బి) బుమ్రా 65, ఫాఫ్ డు ప్లెసిస్ (సి) సాహా (బి) పాండ్యా 62, క్వింటన్ డి కాక్ (సి) సాహా (బి) భువనేశ్వర్ 43, ఫిలాండర్ (బి) షమీ 23, మహరాజ్ రనౌట్ 35, రబాడ (సి) సాహా (బి) అశ్విన్ 26, స్టెయిన్ నాటౌట్ 16, మోర్నే మోర్కెల్ ఎల్‌బిడబ్ల్యూ (బి) అశ్విన్ 2; ఎక్స్‌ట్రాలు: 6; **మొత్తం 73.1 ఓవర్లలో 286 ఆలౌట్;** వికెట్ల పతనం: 1-0, 2-7, 3-12, 4-126, 5-142, 6-202, 7-221, 8-258, 9-280, 10-286; బౌలింగ్: భువనేశ్వర్: 19-4-87-4, షమీ: 16-6-47-1, బుమ్రా: 19-1-73-1, పాండ్యా: 12-1-53-1, అశ్విన్: 7.1-1-21-2.

ఇండియా తొలి ఇన్నింగ్స్: మురళీ విజయ్ (సి) ఎల్గార్ (బి) ఫిలాండర్ 1, ధావన్ (సి) అండ్ (బి) స్టెయిన్ 16, పుజారా నాటౌట్ 5, కోహ్లీ (సి) డి కాక్ (బి) మోర్కెల్ 5, రోహిత్ శర్మ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు: 1; **మొత్తం 11 ఓవర్లలో 28/3;** వికెట్ల పతనం: 1-16, 2-18, 3-27; బౌలింగ్: ఫిలాండర్: 4-1-13-1, స్టెయిన్: 4-1-13-1, మోర్కెల్: 2-2-0-1, రబాడ: 1-0-1-0.



ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు సెరెనా దూరం

సిడ్నీ: డిఫెండింగ్ చాంపియన్ సెరెనా విలియమ్స్ ఈ ఏడాది తొలి గ్రాండ్ శ్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్ టోర్నీకి దూరమైంది. తొలి బిడ్డ (పాప)కు జన్మనిచ్చిన తర్వాత బాగానే ఆడుతున్నప్పటికీ అవసరమైన ఫిట్‌నెస్ లేదని సెరెనా తెలిపింది. గతేడాది డిసెంబర్ చివర్లో అబుదాబీలో జరిగిన ఓ ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో సెరెనా ఆడింది. ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ జెలెనా ఒస్టాపెంకో చేతిలో ఓడింది. అంతకుముందు చివరిసారిగా ఏడాది క్రితం ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెరెనా ఆడింది. ఆమె నెలల గర్భంతో ఉన్నప్పటికీ ఫైనల్లో తన అక్క వీనస్‌ను ఓడించి టైటిల్ గెలిచింది.

ఢిల్లీ కుర్రాడికి బోల్ట్ శిక్షణ



న్యూఢిల్లీ: ప్రపంచ అత్యుత్తమ స్ప్రింట్ రన్నర్ ఉసేన్ బోల్ట్ శిక్షణ ఇవ్వడమంటే ఊహించుకుంటేనే ఏదో తెలియని ఫీలింగ్ కలుగుతోంది కదా! అయితే అద్భుత అవకాశాన్ని ఢిల్లీకి చెందిన రిక్షా కార్మికుని కుమారుడు, 16 ఏళ్ల నాసిర్ అహ్మద్ సొంతం చేసుకున్నాడు. 'జమైకా వెళ్లేందుకు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నాను. అక్కడ శిక్షణ తీసుకుని ఏదో ఒక రోజు దేశానికి పతకం సాధిస్తా. నా తండ్రి రిక్షా కార్మికుడు. ఆయన సంపాదనలో ఎక్కువ శాతం నాకోసమే ఖర్చు చేస్తాడు. క్రీడల మంత్రిని కలిసి మద్దతు కోరతాను. నాకు ఆయన మద్దతిస్తారని పూర్తి నమ్మకముంది. నా సత్తా ఏంటో చూపిస్తాను. ప్రస్తుతం కామన్వెల్త్ గేమ్స్ కోసం శిక్షణ తీసుకుంటున్నాను. అర్హత సాధిస్తానని భావిస్తున్నాను' అని నాసిర్ అన్నాడు. 'నాసిర్‌లో అసాధారణ ప్రతిభ వుంది. అతను రోజు రోజుకు ఎలా ఎదిగాడో నాకు తెలుసు. అతని కెరీర్ ఎంతో మందికి ఉదాహరణ. జమైకాకు వెళ్లడం అతనికి గొప్ప అవకాశం. మెళకువలు బాగా నేర్చుకుంటాడని భావిస్తున్నాను' అని కోచ్ సరేందర్ సింగ్ అన్నారు. ఇటీవల జరిగిన అండర్-16 జాతీయ పోటీల్లో నాసిర్ 100 మీటర్ల లక్ష్యాన్ని 10.85 సెకన్లలో పూర్తి చేశాడు.

మనం స్పోర్ట్స్
శనివారం, 6 జనవరి, 2018
www.manamnews.com

గంగూలీ రికార్డుపై కోహ్లీ దృష్టి



కేప్‌టౌన్: భారత క్రికెట్ టెస్టు జట్టును విరాట్ కోహ్లీ అత్యంత ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిపిస్తు న్నాడు. వరుసగా తొమ్మిది టెస్టు సిరీస్‌లను కోహ్లీ సేన కైవసం చేసుకుంది. ధోనీ నుంచి పగ్గాలు చేపట్టిన తర్వాత కోహ్లీ 32 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. పగ్గాలు చేపట్టినప్పటి నుంచి కోహ్లీ ముందుండి జట్టును నడిపిస్తున్నాడు. కోహ్లీ నేతృత్వంలో టీమిండియా 32 టెస్టుల్లో మూడు మ్యాచ్‌ల్లో మాత్రమే ఓటమిపాలైంది. దీంతో సునీల్ గవాస్కర్, రికీ పాంటింగ్ వంటి దిగ్గజాల సరసన కోహ్లీ నిలిచాడు. గెలుపు శాతంలో భారత అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా నిలిచిన కోహ్లీ ఇప్పుడు ఇక్కడ సౌతాఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్టులో మరో రికార్డుపై కన్నేశాడు. ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలిస్తే మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ రికార్డును కోహ్లీ సమం చేస్తాడు. కోహ్లీ 32 టెస్టులకు గాను 20 టెస్టుల్లో జట్టును గెలిపించగా.. గంగూలీ 49 టెస్టులకు గాను 21 టెస్టుల్లో విజయాన్ని అందించాడు. ఒకవేళ గంగూలీ రికార్డును కోహ్లీ సమం చేస్తే ఎంఎస్ ధోనీ తర్వాత రెండో స్థానంలో నిలుస్తాడు. ఎందుకంటే టెస్టుల్లో ధోనీ కెప్టెన్సీలో విదేశీ గడ్డపై టీమిండియా 27 మ్యాచ్‌ల్లో గెలిచింది.


రహానేకు దక్కని చోటు



కేప్‌టౌన్: సౌతాఫ్రికాతో శుక్రవారమిక్కడ ప్రారంభమైన తొలి టెస్టు మ్యాచ్‌కు టీమిండియా తుది జట్టులో వైస్ కెప్టెన్ అజింక్య రహానేకు చోటు దక్కలేదు. దీంతో అభిమానులు తీవ్ర నిరాశ చెందారు. గత రెండేళ్లుగా రహానే విదేశీ టోర్నీల్లో స్థిరంగా రాణిస్తున్నాడు. అంతేకాకుండా స్లిప్స్‌లో అతనిది సురక్షితమైన హస్తం. కేప్‌టౌన్‌లోని పరిస్థితులను బట్టి రోహిత్ శర్మకు బదులు రహానేకు అవకాశమివ్వాల్సిందని అభిమానులు అభిప్రాయపడ్డారు.

హెచ్‌సీఏ కార్యదర్శి శేష్ నారాయణపై

సస్పెన్షన్ వేటు



అపెక్స్ కౌన్సిల్‌లో సంచలన నిర్ణయం

అంతర్గత గొడవలే కారణం

హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ)లో అంతర్గత కుమ్ములాటలు ఎక్కువయ్యాయి. రెండు వర్గాలకు చెందిన ఇద్దరు నాయకులు హెచ్‌సీఏలోని కీలక పదవుల్లో ఉండడంతో ఒకరి నిర్ణయాన్ని మరొకరు గౌరవించుకోవడం లేదు. దీంతో హెచ్‌సీఏ అధ్యక్షుడు జి. వివేకానంద్‌కు, కార్యదర్శి శేష్ నారాయణకు అస్సలు



పొసగడం లేదు. ఇద్దరి మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు ఉన్నాయి. తాజాగా కార్యదర్శి శేష్ నారాయణ్‌ను సస్పెండ్ చేస్తూ శుక్రవారం అపెక్స్ కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకున్నారు. హెచ్‌సీఏ బాడీ ఎన్నికై ఏడాది అయిందో లేదో కార్యదర్శిపై వేటు పడడం సంచలనం సృష్టించింది. గతంలో వచ్చిన ఆరోపణలపై అంబుడ్స్‌మన్ వద్ద ఉన్న కేసు విచారణ పెండింగ్‌లో ఉన్న కారణంగా శేష్‌ను సస్పెండ్ చేస్తూ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేశామని డాక్టర్ వివేకానంద తెలిపారు. అయితే ఆ ఆరోపణల గురించి గానీ, ఆ కేసు గురించి గానీ హెచ్‌సీఏ అధ్యక్షుడు చెప్పారు. మరో రెండ్రోజుల్లో స్పెషల్ జనరల్ సమావేశం ఉన్న సమయంలో ఈ నిర్ణయం తీసుకోవడం సంచలనం రేపింది. అయితే ఇటువంటి నిర్ణయాలు తీసుకునే అధికారం ఆ కౌన్సిల్‌కు లేదని శేష్ చెప్పారు. 'జరిగిన పరిణామాల గురించి హెచ్‌సీఏ అంబుడ్స్‌మన్‌ను కలిసి వివరించాను. నేనిచ్చిన సమాచారం ఆయన తగిన చర్య తీసుకునేందుకు ఉపయోగపడుతుందని భావిస్తున్నాను. ఏ సమావేశం జరగాలన్నా కార్యదర్శి తప్పక ఉండాలి. కౌన్సిల్ తీసుకున్న నిర్ణయంపై నేను తగిన చర్యలు చేపడతాను. అధ్యక్షుడి పదవిలో ఉంటూ అధ్యక్షుడు వివేకానంద ద్వంద్వ ప్రయోజాలను లీగల్‌గా ఎదుర్కొంటాను. గవర్నమెంట్ సర్వెంట్ క్రీడా సంఘాల్లో ఎటువంటి బాధ్యతలూ చేపట్ట కూడదన్న జస్టిస్ లోధా కమిటీ సూచనలకు వ్యతిరేకంగా హెచ్‌సీఏ అధ్యక్ష పదవిలో వివేకానంద్ కొనసాగుతున్నారు. ఆయన అధ్యక్ష పదవి నుంచి దిగిపోయే వరకు పోరాడతాను' అని శేష్ నారాయణ్ వివరించారు.

శేష్ నారాయణ్ పనితీరును హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ తప్పుబట్టింది. కౌన్సిల్ నిర్ణయాలను గౌరవించకుండా పూర్తిగా వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నట్టు రూపొందించిన చార్జ్‌షీట్‌ను అంబుడ్స్‌మన్ (పరిశీలనాధికారి)కి అపెక్స్ కౌన్సిల్ అందజేసింది. అయితే ఈ చార్జ్‌షీట్‌ను గత డిసెంబర్ 14నే శేష్ నారాయణ్‌కు పంపించామని బుధవారం నాటి సమావేశంలో అపెక్స్ కౌన్సిల్ తెలిపింది. చార్జ్‌షీట్‌పై శేష్ నారాయణ్ స్పందించకుండా తమను అగౌరవపరుస్తున్నారని పేర్కొంటూ అపెక్స్ కౌన్సిల్ సభ్యులందరూ సంతకాలు చేసిన మరో చార్జ్‌షీట్‌ను అంబుడ్స్‌మన్‌కు బుధవారం అందజేసినట్టు వివేకానంద చెప్పారు. అపెక్స్ కౌన్సిల్‌లో తొమ్మిది మంది సభ్యులుండగా.. ఆరుగురు ఈ సమావేశానికి హాజరయ్యారు. తక్కువ సమయంలో ఈ సమావేశం నిర్వహించడంతో కాగ్ ప్రతినిధి, సుభద్ర రాలేకపోయారని కౌన్సిల్ వర్గాలు తెలిపాయి. అయితే ఈ సమావేశానికి సంయుక్త కార్యదర్శి అజ్మల్ అసద్ ప్రత్యేక ఆహ్వానితుడుగా హాజరయ్యారు.

ఇద్దరి మధ్య గొడవలెందుకు?

అధ్యక్షుడు జి. వివేకానంద్‌కు, కార్యదర్శి శేష్ నారాయణ్‌కు మధ్య గొడవలకు కారణం తెలంగాణ ప్రీమియర్ టీ20 లీగ్. ఈ లీగ్ కోసమే గత డిసెంబర్ 30వ తేదీన మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్ జట్ల ఎంపిక ప్రక్రియను హెచ్‌సీఏ కొనసాగించింది. మీ రాజకీయ లబ్ధి కోసం అసోసియేషన్‌ను ఉపయోగించలేమని అధ్యక్షుడికి కార్యదర్శి తెగేసి చెప్పారు. గతంలో మీ తండ్రి జి. వెంకటస్వామి కూడా ఇలాగే ప్రవర్తించారన్నారు. ఇటువంటి టోర్నీలు నిర్వహించాలంటే జనరల్ బాడీ అనుమతిని అపెక్స్ కౌన్సిల్ తీసుకోవాల్సివుంటుంది. గత కొద్ది కాలంగా ఈ టోర్నీ కోసం కార్యాలయ సిబ్బంది వేగంగా పనిచేస్తుండడంతో అధ్యక్షుడికి, కార్యదర్శికి మధ్య దూరం మరింత పెరిగింది. వీరిద్దరూ తమ ఆధిపత్యాన్ని చెలాయించేందుకు ప్రయత్నించారు. మరి కొద్ది రోజుల్లో అంటే ఈ నెల 7వ తేదీన స్పెషల్ జనరల్ మీటింగ్ జరగనున్న నేపథ్యంలో అసోసియేషన్‌లో వాతావరణం మరింత దారుణంగా తయారైంది.



తనపై ఉన్న ఆరోపణలపై వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాలని అధ్యక్షుడు వివేకానంద్ కార్యదర్శి శేష్ నారాయణ్‌కు నోటీసులు ఇచ్చారు. క్రికెట్ సంఘం ప్రయోజనాలకు హాని కలిగించేలా మీ ప్రవర్తన ఉందని ఆ నోటీసులో అధ్యక్షుడు వివేకానంద ఆరోపించారు. దీనికి శేష్ నారాయణ్ ఘాటైన సమాధానమిస్తూ.. తనపై వచ్చిన ఆరోపణలన్నీ నిరాధారమైనవని, తప్పుడు ఆరోపణలని చెప్పినట్టు సమాచారం. అంతేకాదు తనకు నోటీసు ఇచ్చే అధికారం మీకెక్కడిది అని కూడా అధ్యక్షుడు వివేకానంద్‌ను శేష్ నారాయణ్ ప్రశ్నించారు. అంతేకాదు బీసీసీఐ సమావేశాలకు హాజరయ్యేందుకు వివేకానంద్‌కు అపెక్స్ కౌన్సిల్ ఎటువంటి అనుమతి ఇవ్వలేదని కూడా శేష్ నారాయణ్ ఆరోపించారు. ఇరు వర్గాల మధ్య గొడవ తీవ్ర స్థాయికి చేరింది. ఇప్పుడు శేష్ నారాయణ్‌ను సస్పెండ్ చేయడం చెల్లుతుందా? సస్పెండ్ చేసే అధికారం ఎవరికుంది? మరి ఆదివారం జరగాల్సిన హెచ్‌సీఏ స్పెషల్ జనరల్ సమావేశం ఎవరి అధ్యక్షతన జరుగుతుంది? వంటి అనేక ప్రశ్నలు తీవ్ర ఉత్కంఠ రేపుతున్నాయి.

మరికొన్ని క్రీడా వార్తలు 11లో...

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id. manamtelugudaily1@gmail.com.